# భారత శక్తి

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక:54 హైదరాబాద్, 10-8-2025, ఆదివారం పేజీలు: 12 వెల: 1.00



## ఈసీ కీలక నిర్ణయం.. 334 రాజకీయ పార్టీలపై వేటు

దిల్లీ: దేశంలో రాజకీయ పార్టీల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం సవరించింది. గుర్తింపు పొందని 334 రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగించింది. నిబంధనల ప్రకారం.. ఈసీ ( వద్ద నమోదైన రాజకీయ పార్టీలు ఆరేళ్లలో కనీసం ఒక్క ఎన్నికలోనైనా పోటీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ పార్టీలు ( 2019 నుంచి ఒక్క ఎన్నికలోనూ బరిలోకి దిగకపోవడంతో వాటిపై ఈసీ వేటు వేసింది.దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 334 పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. పేరుకు పార్టీలు పెట్టినప్పటికీ.. వీటికి భౌతికంగా ఎలాంటి కార్యాలయాలు అందుబాటులో లేవని వెల్లడించింది. ఇప్పటివరకు దేశంలో 2,854 గుర్తింపుపొందని పార్టీలు ఈసీ వద్ద రిజిస్టర్ అయి ఉన్నాయి. తాజా చర్యతో ఆ సంఖ్య 2,520కి తగ్గింది.

## నేటి భారతం...

ఊహకు అందని ఆనందాలు చిగిరిస్తున్న ఈ నేలలో.. ఊపిరి కూడా ఊయలై విహరిస్తున్న ఈ కాలంలో.. మనసుకోరే మరో లోకం చూడాలనిపిస్తున్న ఈ వేళలో.. ప్రకృతి కన్నా గొప్పది ఏమీ లేదు ఈ ధరణిలో... అందుకే.. ఇప్పటికైనా కనులు తెరిచి.. ఈ ప్రకృతిని కంటికి రెప్పలా కాపాడుకుందాం... ఎందుకంటే.. తుదిశ్వాశ వరకూ ప్రకృతి అందాలకు బానిసలమే అందరం..

బి.రమణ,



## మనల్ని మనమే నాశనం చేసుకుంటున్నాం..

- ప్రకృతి మన జీవితాలకోసం అద్భుతాలు చేస్తోంది..
- మనమేమో వాటిని కాలరాస్తున్నాం..
- ప్రకృతి ప్రకోపాన్ని చూపిస్తుంటే తట్టుకోలేకపోతున్నాం..
- పచ్చదనాన్ని పరిరక్షించడం కనీస బాధ్యగా మార్చుకోవాలి..
- ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపించాలి..
- గాలి, నీరు, భూమి స్వచ్ఛంగా ఉంటేనే జీవనం సాగుతుంది..
- ఒకవైపు ప్రజలు కాలుష్యాన్ని నిర్లక్ష్యం చేయడం..
- రసాయనాలు వెదజల్లే పరిశ్రమలు మరోవైపు విషాన్ని వెదజల్లడం..
- సరైన అవగాహన కల్పించకపోతే ప్రపంచ వినాశనం జరుగుతుంది..
- ప్రకృతిని కాపాడే బాధ్యత అందరూ తీసుకోవాలని ఆశిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..



ప్రకృతి మనకు తల్లి ఒడి లాంటిది.. తల్లి ఒడిలో చల్లగా జీవించే స్వేచ్ఛ ఉంటుంది.. అలాంటి తల్లి ఒడిని నాశనం చేస్తే మనిషి మనుగడ ప్రమాదంలో పడుతుంది.. ఎంతో స్వచ్ఛంగా ఉన్న ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తున్న ధోరణి ప్రతి చోటా కనిపిస్తోంది.. మన ఇల్లు బావుంటే చాలు పక్కన వుండే వాళ్ళు ఏమైపోయినా పర్వాలేదు అనుకునే స్వార్ధపరులున్నంత కాలం పరిస్థితుల్లో ఎలాంటి మార్పు కనిపించదు.. ఈ స్వార్ధ ప్రవృత్తి ప్రతి ఒక్కరిలో చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.. ప్రకృతిని ప్రేమించడం నేర్చుకోకపోతే ప్రమాదంతో కలిసి ప్రాణం పోయేంతవరకు ప్రయాణం సాగించక తప్పదు..

12లో



## సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీలు కట్టిన మహిళా మంత్రులు

హైదరాబాద్: రక్షాబంధన్ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మహిళా మంత్రులు రాఖీలు కట్టారు. మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పార్టీ నేతలు తదితరులు సీఎంకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తదితరులకు మంత్రి సీతక్క రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు.



## తెలంగాణలో రూ.80 వేల కోట్ల పెట్టుబడులకు ఎన్టీపీసీ సిద్ధం

హైదరాబాద్: ఆగష్టు 09 ( భారత శక్తి ) :తెలంగాణలో రూ.80వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) సంసిద్ధత వ్యక్తం చేసింది.

ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్ బృందం శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టనున్నట్లు వివరించింది. సోలార్, పవన విద్యుత్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు ఎన్టీపీసీ సుముఖత తెలిపింది.

రాష్ట్రంలో 6,700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ఉత్పత్తికి అవకాశం ఉందని సీఎంకు ఎన్టీపీసీ బృందం తెలిపింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అన్ని విధాలా సహకరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## సినీ కార్మికుల వేతనాల పెంపునకు నేను హామీ ఇవ్వలేదు: చిరంజీవి

సినీ కార్మికులకు 30శాతం వేతనాలు పెంచి, తాను త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు మీడియాకు తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు మెగాస్టార్ చిరంజీవి ఆగ్రహించారు. తాను కార్మికుల సంఘాల నుంచి ఎవరినీ కలవలేదని ఆయన స్పష్టం చేశారు.




12లో



12లో

## భారత రక్షణ రంగ ఉత్పత్తులు @ రూ.1.51 లక్షల కోట్లు



## క్విట్ భాజపా అంటేనే దేశానికి భవిష్యత్తు: మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్: స్వాతంత్ర్య పోరాటంలో క్విట్ ఇండియా ఉద్యమం కీలకమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరించారు.

## ప్రధాని మోదీకి రాఖీ కట్టిన చిన్నారులు

ప్రధాని నరేంద్రమోదీ రక్షా బంధన్ వేడుకలను విద్యార్థులు, ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారి సభ్యులతో కలిసి జరుపుకొన్నారు. దిల్లీలోని ప్రధాని నివాసంలో శనివారం ఉదయం 7 గంటల సమయంలో పలువురు విద్యార్థులు, బ్రహ్మకుమారి సభ్యులు మోదీ)కి రాఖీ కట్టారు. అనంతరం మోదీ వారితో కొంతసేపు సరదాగా ముచ్చటించారు.



భారత శక్తి

# మోడీ రాజీపడ్డారా...

మోడీ దౌత్య నీతిపై ప్రతిపక్షాల అవహేళనలు చేస్తున్నారు. ట్రంప్ ను వాటేసుకున్నాడు.. కౌగిలించుకున్నాడు. ఇండియాకు తీసుకొచ్చి సన్మానం చేశాడు. బెస్ట్ ఫ్రెండ్ అని చెప్పుకున్నాడు. మరి ఇవన్నీ ట్రంప్ విషయంలో చేస్తే.. మోడీకి ట్రంప్ నుంచి మంచి శాస్తి జరిగిందని ప్రతిపక్ష నేతల చేస్తున్నారు. వాళ్లు చెప్పిన వరకూ నిజం. ఇది నిజమే..కానీ ట్రంప్ తోనే కాదు.. అమెరికాలోని అన్ని పార్టీల నేతలతోనూ మోడీ ఇలానే ప్రవర్తిస్తారు. బ్రిటన్ ప్రధానితోనూ, కెనడా ప్రధాని, ఆస్ట్రేలియా ప్రధానితోనూ అంతే స్నేహంగా మోడీ మెలుగుతారు.ఒబామాతో, బైడెన్ తోనూ మోడీ స్నేహం ఒకేలా ఉంటుంది. మోడీ దౌత్యనీతిలో ప్రధాన అంశం 'వ్యక్తిగత సంబంధాలు'.. ఇది కొన్ని సార్లు ఉపయోగపడుతాయి.. మరికొన్ని సార్లు ఉపయోగపడవు. ఖతార్ లో భారతీయులకు ఉరిశిక్ష పడితే ఆ దేశాన్ని ఒప్పించి విముక్తి చేసిన ఘనత మోడీ. ఉక్రెయిన్ తో రష్యా యుద్ధంలో ఒకరోజు యుద్ధం ఆపించి భారతీయులను ఆ దేశం నుంచి తీసుకొచ్చిన ఘనత మోడీది. మోడీ వ్యక్తిగత సంబంధాలు ఉపయోగపడ్డాయి. పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఇంటికి ఆయన ఇంటికి పిలవకుండానే వెళ్లాడు. పాక్ దాడి చేస్తే యుద్ధం చేస్తున్నారు. కఠినంగా వ్యవహరిస్తున్నారు. జీ జిన్ పింగ్ భారత్ వచ్చారు. చైనాకు మోడీ వెళ్లారు. కానీ చైనా సైనికులు మనపై దాడి చేస్తే మోడీ రాజీపడలేదు. ట్రంప్ మోడీకి పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. రైతులకే భారత్ తొలి ప్రాధాన్యం ఇస్తుంది. మత్స్యకారులు, పశువు పోషకులు విషయంలో కూడా మేము రాజీపడం. దీనికి నేను వ్యక్తిగతంగా మూల్యం చెల్లించాల్సి రావచ్చు. దానికి సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యలు చేశారు.భారత్ పై కొద్ది రోజులుగా డోనాల్డ్ ట్రంప్ విషం కక్కుతూనే ఉన్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఏకంగా 50% సుంకం విధించేశాడు. ప్రధానంగా రష్యాతో చమురు కొనుగోలుతో పాటు యూఎస్ నుంచి డైరీ ప్రోడక్టు దిగుమతికి నో చెప్పడమే కూడా కారణమని తెలుస్తోంది. 8 కోట్ల మందికి పైగా రైతులు భారత్‌తో పాల ఉత్పత్తులపై ఆధారపడి ఉన్నారు. ఈ నేపథ్యంలో యుఎస్ నుంచి కూడా ఉత్పత్తులను మనం దిగుమతులు చేసుకుంటే భారత రైతులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఒకవేళ యుఎస్ ప్రొడక్ట్స్ వస్తే ఏటా సుమారు లక్షల కోట్ల రూపాయలు దేశ ఆదాయాన్ని కూడా కోల్పోతామని అంచనా వేశారు. ఈ నేపథ్యంలోనే భారత్ నో చెప్పగా ట్రేడ్ డీల్ ఆగిపోయినట్లు కూడా సమాచారం.మెరికా నుంచి ఈ పాల ఉత్పత్తులను దిగుమతులు చేసుకోవడం కూడా మతపరంగా ఒక సున్నితమైన అంశం. మన దేశంలో ఆవుకు గడ్డి ఆహారంగా పెడతారు. కానీ అమెరికా ఆవులకు మాంసం ,మాంస ఉత్పత్తులను ఆహారంగా వేస్తారు. ఇలా చేయడం వల్ల మతపరంగా సున్నితమైన అంశం. ఎన్నో డిమాండ్ల నేపథ్యంలో భారతీ దీన్ని వ్యతిరేకించింది. ఇది స్థానిక రైతులకు కూడా జీవనోపాధి ప్రమాదంలో పడేస్తుంది. ఇప్పటికే రైతులు ఆదాయాలు తక్కువ. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సమ్మాన్ నిధి యోజన ద్వారా ప్రతి ఏటా ఆరువేల రూపాయలు కూడా రైతుల కోసం డైరెక్ట్ బెనిఫిట్రస్ జమ చేస్తున్నారు. అంతేకాదు ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన ద్వారా కూడా నీటిపారుదల సమస్యను పరిష్కరించింది. చిన్న రైతుల వ్యవస్థీకృత శక్తి పెరిగింది. ప్రాసెసింగ్ యూనిట్ లో నిల్వాల కూడా వేగవంతం చేసింది.ఎంఎస్ స్వామినాథన్ వార్షికోత్సవాలు ఢిల్లీలో జరుగుతున్నాయి. భారతరత్న, ఫాదర్ ఆఫ్ గ్రీన్ రివల్యూషన్ ఎంఎస్ స్వామినాథన్ మూడు పదుల వయసులోనే దేశ భవితవ్యాన్నే మార్చారు. కరువు భారీ నుంచి రక్షించారు. యూఎస్, మెక్సికో, జపాన్ శాస్త్రవేత్తలతో కలిసి వరి, గోధుమ వంగడాలపై పరిశోధనలు చేసి ఎంతో గాను ఉపయోగపడ్డారు. భారత్ వెనక్కి తిరిగి చూడలేని స్థితిలో ఇప్పుడు ఉందంటే అయిన పాత్ర కీలకం. భారత్ ఇప్పుడు ఆహార ఉత్పత్తులు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంది.అమెరికాతో వివాదం నెలకొన్న వేళ ప్రధాని నరేంద్ర మోడీ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఫోన్ చేశారు. 23వ రష్యా - భారత్ వార్షిక సదస్సుకు రావాలని పుతిన్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌తో యుద్ధంపై తాజా పరిణామాలను మోడీకి పుతిన్ వివరించారు. వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని పుతిన్‌కు మోడీ సూచించారు. భారత్ శాంతివైపు ఉందన్న స్థిర వైఖరిని ఈ సందర్భంగా మోడీ పునరుద్ఘాటించారు. ఇదిలా ఉంటే.. భారత్‌పై అమెరికా విధించిన టారిఫ్‌లకు ప్రతిస్పందనగా కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అమెరికా నుంచి ఆయుధాల కొనుగోళు నిలిపివేయాలని నిర్ణయించారు. అంతేకాదు.. ఇప్పటికే ఫిక్స్ అయినా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమెరికా పర్యటనను కూడా రద్దు చేసుకున్నారు. తాజాగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఇండియాకు ఆహ్వానించారు. దీనిపై ట్రంప్ ఎలా స్పందిస్తారో అని ఆసక్తి నెలకొంది.దేశ ప్రజలను ఎక్కడ తాకట్టు పెట్టడం లేదు.

# మద్యం కేసులో జగన్ ఫ్యామిలీ



విజయవాడ, ఆగస్టు 9,

ఏపీలో మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో భారీ మద్యం కుంభకోణం జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో.. ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటయింది. దాదాపు ఈ కేసులో 40 మంది వరకు నిందితులు ఉన్నారు. ఓ 12 మంది అరెస్టు అయ్యారు. మరి కొంతమంది పరారీలో ఉన్నారు. ఈ కేసులో ఏ 5 నిందితుడిగా ఉన్నారు విజయసాయిరెడ్డి. ఆయన అరెస్టు ఇంతవరకు జరగలేదు. ఈ కేసులో తొలుత అరెస్ట్ అయ్యారు రాజ్ కసిరెడ్డి. అనంతరం వైసీపీ హయాంలో ముఖ్యమంత్రి కార్యాలయ అధికారిగా పని చేసిన ధనుంజయ రెడ్డి, జగన్ ఓ ఎస్ డి కృష్ణమోహన్ రెడ్డి, జగన్ సన్నిహితుడు బాలాజీ గోవిందప్ప రెస్ట్ అయ్యారు. అటు తర్వాత మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అదుపులోకి తీసుకుంది సిట్. అక్కడకు కొద్ది రోజులకే రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. దీంతో ఇక తదుపరి అరెస్టు జగన్మోహన్ రెడ్డి దేనని ప్రచారం నడిచింది. అయితే ఈ కుంభకోణంలో జగన్ కుటుంబ సభ్యులకు సైతం ప్రముఖంగా వినిపించాయి.తొలి ఛార్జ్ షీట్లో జగన్మోహన్ రెడ్డి పేరు ప్రస్తావనకు తరచూ వచ్చింది. దీంతో అంతిమ లబ్ధిదారుడు ఆయనేనన్న టాక్ వినిపించింది. జగన్ అరెస్టు జరుగుతుందని కూడా ప్రచారం జరిగింది. అయితే ఇది రాజకీయ కక్షపూరిత కేసుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానించింది. ఈ కేసు నిలబడదని కూడా చెప్పుకొచ్చింది. కానీ ప్రత్యేక దర్యాప్తు బృందం లోతైన విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో లిక్కర్ కుంభకోణంలో ఉన్న నిందితులకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు సోషల్ మీడియాలో దర్శనం ఇచ్చాయి. ఈ కేసులో నిందితుడిగా ఉన్న వెంకటేష్ నాయుడు డబ్బుల నోట్ల కట్టలు లెక్కబెడుతూ కనిపించిన వీడియో ఒకటి బయటకు వచ్చింది. మరోవైపు చార్టెడ్ ఫ్లైట్లో ప్రముఖ హీరోయిన్ తో ఉన్న సెల్ఫీ కూడా హల్చల్ చేసింది. ప్రత్యేక విమానంలో డబ్బుల నోట్ల కట్టలు తరలిస్తున్న ఫోటోలు అంటూ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇవన్నీ మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొమ్ము అని.. తాడేపల్లి ప్యాలెస్ కు తరలించే ప్రయత్నంలో భాగంగా చిక్కిన ఫోటోలేనని టిడిపి కూటమి ఆరోపిస్తోంది. అయితే సిట్ చేతికి ఇలాంటి ఫోటోలు, వీడియోలు చాలా చిక్కినట్లు ప్రచారం నడుస్తోంది.అయితే ఈ లిక్కర్ కుంభకోణంలో ప్రధాన నిందితులంతా జగన్మోహన్ రెడ్డికి బంధువులేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కేసులో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి అని అందరికీ తెలిసిన విషయమే. అయితే ఆయన జగన్మోహన్ రెడ్డికి సమీప బంధువు అని టిడిపి సీనియర్ నేత ఆనం వెంకట రమణారెడ్డి వెల్లడించారు. 2019 ఎన్నికలకు ముందు రాజ్ కసిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలా చేరిన మరుక్షణం ఆయన జగన్మోహన్ రెడ్డి కోటరీలో చేరిపోయారు. మద్యం కంపెనీలు నిర్వహించే రాజ్ కసిరెడ్డికి జగన్ ఈమధ్య కుంభకోణం బాధ్యతలు అప్పగించినట్లు వెంకట రమణారెడ్డి ఆరోపించారు. అయితే రాజ్ కసిరెడ్డి ఎవరో కాదని.. వైయస్ సుజాత రెడ్డి స్వయానా అల్లుడని సంచలన ప్రకటన చేశారు ఆనం. స్వయానా మేనత్త అల్లుడు కావడం, మద్యం వ్యాపారంలో అనుభవం ఉండడంతోనే జగన్ తన కోటరీలోకి రాజ్ కసిరెడ్డిని తీసుకొచ్చారని టిడిపి నేత తాజాగా ఆరోపించారు. తద్వారా ఈమద్యం కుంభకోణంలో వైయస్ కుటుంబ సభ్యుల హస్తం ఉందని ఆరోపిస్తోంది తెలుగుదేశం పార్టీ.వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మద్యం పాలసీని మార్చారు. ప్రభుత్వమే నేరుగా మద్యం దుకాణాలు నడిపింది. ఈ తరుణంలో మద్యం తయారు చేసే కంపెనీలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. డిస్టలరీలను సైతం తమ చెప్పు చేతల్లోకి తెచ్చుకొని.. భారీగా కమిషన్లు దండుకున్నారని తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే అనుమానం వ్యక్తం చేసింది. అందుకే అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. దాదాపు 18 వేల కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని.. 3500 కోట్ల రూపాయలు వైసీపీ నేతలు కొల్లగొట్టారని సీట్ తేల్చింది. అయితే ఈ మొత్తం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడు జగన్ అన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే మద్యం కుంభకోణమే అన్నదే జరగలేదని వైసిపి ఆరోపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో జగన్మోహన్ రెడ్డికి రాజ్ కసిరెడ్డి సమీప బంధువు అని తేలడం మాత్రం కొత్త మలుపు తిరిగినట్లు అయింది. ఈ అంశాన్ని టిడిపి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే అవకాశం కనిపిస్తోంది. మొత్తానికైతే మద్యం మకిలి జగన్ కుటుంబానికి అంటిందన్నమాట. చూడాలి మరి ఏం జరుగుతుందో..?

# రొయ్యల సాగుకు అమెరికా షాక్



ఏలూరు, ఆగస్టు 9

అమెరికా రొయ్యల దిగుమతులపై అదనంగా 25% సుంకం విధించడంతో భారతదేశంలోని ఆక్వా రైతులకు, వ్యాపారులకు భారీ దెబ్బ తగిలింది. ఈ కొత్త సుంకాల వల్ల దేశంలో రొయ్యల సాగు రంగం భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన నెలకొంది. మన రొయ్యల ధరలు పెరిగితే, ఈక్వెడార్ లాంటి దేశాలు ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ సంక్షోభం నుంచి బయటపడాలంటే భారత్ ఎలాంటి చర్యలు తీసుకోవాలి?ఇప్పటికే మన దేశ రొయ్యల ఎగుమతులపై అమెరికా 8% వరకు యాంటీ-డంపింగ్, కౌంటర్‌వైలింగ్ సుంకాలను విధిస్తోంది. ఇప్పుడు కొత్తగా విధించిన 25% సుంకం కలవడంతో మొత్తం పన్ను భారం 33%కి పెరిగింది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న ఈ టారిఫ్‌లను ప్రకటించడానికి ముందు ఈ సుంకం కేవలం 7.5% మాత్రమే ఉండేది.2011 నుంచి 2023 వరకు, భారత రొయ్యల సాగు రంగం ఏటా సగటున 18% వృద్ధిని నమోదు చేసింది. ఈ అద్భుతమైన వృద్ధికి ప్రధాన కారణం ఎగుమతులే. ముఖ్యంగా అమెరికా నుంచి ఉన్న అధిక డిమాండ్ ఈ వృద్ధికి కీలక పాత్ర పోషించింది.2023-24లో భారతదేశం అమెరికాకు ృ2.5 బిలియన్ల విలువైన రొయ్యలను ఎగుమతి చేసింది. ఇది అమెరికా మొత్తం రొయ్యల దిగుమతుల్లో దాదాపు 38% వాటా. ఈక్వెడార్ (21%), ఇండోనేషియా (17%), వియత్నాం (11%) మన తర్వాత స్థానాల్లో ఉన్నాయి.అయితే, ఇప్పుడు పోటీ తీవ్రంగా మారింది. ఈక్వెడార్ ప్రస్తుతం 18% సుంకాన్ని మాత్రమే ఎదుర్కొంటోంది. ఇండోనేషియాకు 35% నుంచి 25.3%కి, వియత్నాంకు 46% నుంచి 20%కి సుంకాలు తగ్గాయి.భారత్‌కు మాత్రం సుంకం 33%కి చేరడంతో, మన అతిపెద్ద పోటీదారు అయిన ఈక్వెడార్‌తో పోలిస్తే 14-15 శాతం ప్రతికూలత ఏర్పడింది. ఈ భారీ సుంకాల అంతరం అమెరికా మార్కెట్‌లో మన పోటీతత్వాన్ని, వాటాను తగ్గించే ప్రమాదం ఉంది. దీనివల్ల మన ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ కంపెనీలు, రైతులపై తీవ్ర ఒత్తిడి పడుతుంది.ఈ సుంకాల పెంపుకు ముందే భారత దేశంలో రొయ్యల రైతులు అధిక ఉత్పత్తి ఖర్చులతో సతమతమవుతున్నారు. మొత్తం ఉత్పత్తి ఖర్చులో 60% వరకు రొయ్యల మేతకే పోతుంది. గత మూడేళ్లలో మేత ధరలు 25-30% పెరిగాయి. దీనికి కారణం చేపల పిండి, సోయాబీన్ వంటి మేత పదార్థాల ధరలు పెరగడం, రూపాయి విలువ తగ్గడం.తెల్ల రొయ్య సాగు చేసే చిన్న, మధ్య తరగతి రైతులకు సగటు ఉత్పత్తి ఖర్చు కిలోకు ?280- ?300కి చేరింది. అయితే, కిలో సగటు అమ్మకపు ధర ?340 నుంచి ?360 మధ్య ఉంది. దీంతో లాభాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఒకవేళ అమ్మకపు ధర ?280 కన్నా తగ్గితే, చాలా మంది రైతులు నష్టాల్లో కూరుకుపోతారు.ప్రస్తుతం పండుగల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఎగుమతి కోసం స్టాక్ చేస్తున్న నేపథ్యంలో, భారత ఎగుమతిదారులు ఈ అదనపు సుంకాల భారాన్ని భరించాల్సి రావచ్చు. ఇది వారి లాభాలను మరింత తగ్గిస్తుంది. చివరికి ఈ ప్రభావం తక్కువ లాభాలతో పనిచేస్తున్న రైతులపై పడుతుంది.ఈ సంక్షోభం దేశంలో రొయ్యల సాగుకు కేంద్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. మన రాష్ట్రం దేశంలో మొత్తం రొయ్యల ఉత్పత్తిలో 82% కంటే ఎక్కువ వాటాను కలిగి ఉంది. ఆ తర్వాత ఒడిశా, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, గుజరాత్ వంటి రాష్ట్రాలు ఉన్నాయి.ఇది కేవలం తీర ప్రాంతాలకే పరిమితం కాదు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద హర్యానా, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఉప్పునీటి ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహిస్తున్నారు. ఈ రాష్ట్రాల్లోని రైతులు తమ లవణీయత గల భూములను సాగుకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

ఎగుమతులు నిలిచిపోతే, కొత్తగా ఈ రంగంలోకి వచ్చిన ఈ రైతులు అమెరికా సుంకాలు తగ్గించడం కోసం ప్రభుత్వం చర్చలు జరపడం ఒక మార్గం. ఒకవేళ అధిక సుంకాలు కొనసాగితే, భారత్ ఈ సంక్షోభాన్ని ఒక హెచ్చరికగా తీసుకోవాలి.రొయ్యల ఎగుమతి మార్కెట్లను విస్తరించుకోవాలి. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలి, దేశీయంగా రొయ్యల వినియోగాన్ని ప్రోత్సహించాలి.అమెరికాను మించి తూర్పు ఆసియా, యూరోపియన్ యూనియన్, యూకే, పశ్చిమ ఆసియా లాంటి మార్కెట్లపై దృష్టి పెట్టాలి. ఇటీవల భారత్-యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలోని సుంకాల ప్రయోజనాలను ఉపయోగించుకుని యూకేకు రొయ్యల ఎగుమతులను పెంచుకునే అవకాశం ఉంది.రొయ్యలకు బ్రాండింగ్ కల్పించి, విదేశీ మార్కెట్లలో అభివృద్ధి చేయడంలో మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ కీలక పాత్ర పోషించవచ్చు. చిన్న రైతులకు రుణ సౌకర్యాలు, బీమా సౌకర్యాలు మెరుగుపరచాలి.దేశంలో రొయ్యల వినియోగాన్ని పెంచడం కూడా అంతే అవసరం. రొయ్యల పోషక విలువలను ప్రచారం చేయడం ద్వారా భారతీయ మాంసాహార ప్రియులకు చేరువ చేయవచ్చు.

## వైరల్ అయిన డీఈవో డ్యాన్స్

కర్నూలు

కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. శామ్యూల్ పాల్ మహిళా టీచర్లతో చేసిన డ్యాన్స్ వైరల్ అవుతోంది. పి.జి.టి.ఎస్ ట్రైనింగ్ సందర్భంగా మహిళ టీచర్లతో కలసి అయన డ్యాన్స్ చేసారు.

ఇలాంటి నృత్యాలతో కర్నూలు డీఈవో తెలుగు సంస్కృతిని, విద్యాశాఖ పరువు ప్రతిష్టలను మంటగలిపారని కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏపి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని వారు అంటున్నారు.

## ఒంగోలులో రోడ్డు ప్రమాదం ముగ్గురు మృతి...

### కొందరికి తీవ్ర గాయాలు

ఒంగోలుప్రకాశం జిల్లా చాకిచెర్ల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వ్యాన్ను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. అందిన సమాచారం... రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారు.. పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్త గణేష్ ని పాడు గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. తిరుమల తిరుపతి వెళుతుండగా స్వామివారి దర్శనం ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది

## రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది అద్భుతంగా పని చేస్తున్నారు!

### మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్

గత రాఖీ పండుగ నాడు ఒక్క రోజే 63 లక్షల మందిని బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేశారు. గత రాఖీకి మూడు రోజుల్లోనే రికార్డు స్థాయిలో 1.77 కోట్ల మంది ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించారు. ఈ రాఖీకి కూడా అదే రీతిలో సిబ్బంది పనిచేస్తున్నారు. సోదరభావానికి ప్రతీకైన రాఖీ పండుగను త్యాగం చేసి నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మహాలక్ష్మి పథకాన్ని మహిళలు వినియోగించుకుంటూ..ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సోదరులకు రాఖీలు కడుతున్నారు వారందరికీ నా అభినందనలు. ప్రజా రవాణా వ్యవస్థను ప్రోత్సహిస్తోన్న ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు రాఖీ పండుగ శుభాకాంక్షలు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

### పలువురికి తీవ్రగాయాలు

కావలి

ఉలవపాడు మండలం చాగోలు వద్ద శనివారం తెల్లవారుజమున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం లో ముగ్గురు వెంకట నరసమ్మ(42) సుభాషిణి(35) అభిరామ్(26) మృతి చెందారు. గాయపడ్డ వారిలో మరో ఇద్దరి పరిస్థితి విషమం, ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. మృతుల డెడ్ బాడీలతో పాటు తీవ్రంగా గాయపడిన వారిని కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతులు బాధితులు పలనాడు జిల్లా మాచవరం మండలం గణేష్ ని పాడు గ్రామస్తులుగా గుర్తించారు.

తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని తుఫాను వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. ప్రమాదం ఘటన పై కుటుంబ సభ్యులకు ఉలవపాడు పోలీసులు సమాచారం అందించారు. ప్రమాద సమయంలో తుఫాను వాహనంలో 13 మంది ప్రయాణిస్తున్నట్లు సమాచారం

## రాజకీయాలకు సెలవు ఇవ్వబోతున్నా మాజీ మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్ మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి నివాసం బోయిన్ పల్లిలో రాఖీ పండగ వేడుకలు ఘనంగా జరిగాయి... తన సోదర సోదరిమణుల తో ఇల్లంత సందడిగా మారింది... ప్రతి సంవత్సరం అన్న దమ్ములకు రాఖీ కట్టడం సంతోషంగా ఉంటుందని మల్లారెడ్డి అక్క చెల్లెలు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు... మల్లారెడ్డి మాట్లాడుతూ రాఖీ పండగ తన జీవితం లో ఎంతో ప్రత్యేకమని, రాఖీ పండగ రోజే తన తొలి ఇంజనీరింగ్ కాలేజి ని ప్రారంభించి పాల మల్లారెడ్డి కాస్తా విద్యావేత్త గా మారానని, ఇపుడు అంచెలంచెలుగా ఎదిగి డీమ్డ్ యూనివర్సిటీ స్థాపించే స్థాయికి వెళ్లానని మల్లారెడ్డి అన్నారు. దేశ వ్యాప్తంగా డీమ్డ్ యూనివర్శిటీ లు స్థాపించి పేద ప్రజలకు విద్య వైద్యం ను అందించే దిశగా కృషి చేస్తున్నాని అన్నారు..ఈ రాఖీ పండగ రోజున అందరికి అందుబాటులో ఉండే విధంగా వన్ హెల్త్ పేరిట మెడికల్ షాప్ లు ప్రారంభిస్తున్నామని, వీటిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తామని ఆయన తెలిపారు... మల్లారెడ్డి ఆసుపత్రి లో కేసీఆర్ కిట్ తరహా అఓభీ ఫండ్, మల్లారెడ్డి కిట్ ను అందిస్తున్నట్లు మల్లారెడ్డి తెలిపారు... 108 తరహాలో త్వరలో వన్ హెల్త్ పేరిట 100 అంబులెన్స్ లను ప్రారంభించి ఎమర్జెన్సీ సర్వీసులను అందించనున్నట్లు మల్లారెడ్డి తెలిపారు... ఈ సందర్భంగా మల్లారెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ రాఖీ పూర్ణిమ శుభాకాంక్షలు తెలిపారు....

# వర్షాకాలంలో వచ్చే వ్యాధులు తీసుకోవలసిన ముందు జాగ్రత్తచర్యలు

## డాక్టర్ ఎండి సిహెచ్. తిరుపతిరావు..

కరీంనగర్

ఆహ్లాదకరంగా ఉన్నప్పటికీ, వర్షం మీకు మరియు మీకుటుంబానికి తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలను కలిగించే వైరస్ లు మరియు అంటువ్యాధులను కూడా పుష్కలంగా తీసుకువస్తుంది.తేమతో కూడిన వాతావరణం, భారీ వర్షాలు మరియు గాలులతో కూడిన వాతావరణం అనేక అంటువ్యాధులను వ్యాప్తి చేస్తాయి. వర్షాకాలంలో,మన రోగ నిరోధక వ్యవస్థలు బలహీనపడతాయి ఇది నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు పెరగడానికి దారితీస్తుంది.వర్షాకాలంలో, అనేక వైరస్ లు, బ్యాక్టీరియా మరియు ఇతర వ్యాధులు వచ్చే ప్రమాదం ఇతర సీజన్ లతో పోలిస్తే రెట్టింపు అవుతుంది. పెరిగిన గాలి తేమ, మరియు తేమ బూజు, శిలీంధ్రాలు మరియు బ్యాక్టీరియాతో సహా సూక్ష్మజీవుల పెరుగుదలను ప్రోత్సహిస్తుంది, అలాగే ప్రమాదకరమైన సూక్ష్మక్రిములు, ఇది అనేక రకాల వ్యాధుల వ్యాప్తికి దారితీస్తుంది డాక్టర్ ఎండి సిహెచ్. తిరుపతిరావు ఆన్నారు.అనేక ఋతుపవన వ్యాధులు ఒకరి ఆరోగ్యంపై గణనీయమైన ప్రతికూల ప్రభావాన్ని చూపే వరకు నిర్ధారణ చేయలేరు. ముందస్తుగా గుర్తించడం మరియు కొన్ని ప్రాథమిక నివారణ మరియు పరిశుభ్రత విధానాలు ఈ కాలంలో మిమ్మల్ని సురక్షితంగా ఉంచుతాయి.అత్యంత తరచుగా వచ్చే కొన్ని ఋతుపవన వ్యాధులు, అదేవిధంగా కొన్ని నివారణ చిట్కాలను మనం ఇప్పుడు చూద్దాం

:మలేరియా:

మలేరియా అనాఫిలిస్ అని పిలువబడే దోమల ద్వారా వ్యాప్తి చెందుతుంది. మలేరియా కలిగించే పరాన్నజీవి అనాఫిలిస్ మినిమస్ వర్షాకాలంలో సంతానోత్పత్తి చేస్తుంది. ఈ వ్యాధి ఎక్కువగా నీటిలో మరియు నీటి ప్రవాహాలలో దోమలు సంతానోత్పత్తి చేయడం వల్ల నీరు నిలిచిపోవడం వల్ల సంభవిస్తుంది, ఇది తీవ్రమైన జ్వరాన్ని 105 డిగ్రీల సెల్సియస్ వరకు, కలిగిస్తుంది, ఇది చాలా రోజులు ఉంటుంది. మలేరియా లక్షణాలలో అధిక జ్వరం, శరీర అసౌకర్యం, చలి మరియు అధిక చెమట వంటివి ఉంటాయి.డెంగ్యూ జ్వరం,డెంగ్యూ జ్వరం దోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది, ఇది నిలకడగా ఉన్న నీటిలో సంతానోత్పత్తి చేస్తుంది. బక్కెట్లు, డ్రమ్ములు, పూల కుండలు, బావులు మరియు చెట్ల రంధ్రాలు వంటివి. దోమ కుట్టిన తరువాత డెంగ్యూ జ్వరం అభివృద్ధి చెందడానికి నాలుగు నుండి ఏడు రోజులు పడుతుంది. డెంగ్యూ జ్వరం అధిక జ్వరం, దద్దుర్లు, తలనొప్పి, తక్కువ ప్లేట్ లెట్ కౌంట్ మరియు హైపర్ సెన్సిటివిటీ ద్వారా వర్గీకరించబడుతుంది.

చికున్ గున్యా:

చికున్ గున్యా అనేది దోమలు ద్వారా వ్యాప్తి చెందే ప్రాణాంతకం కాని వైరల్ వ్యాధి, ఇది నిలకడగా ఉన్న నీటిలో పొదగబడుతుంది. ఈ దోమలు నిలకడగా ఉన్న నీటిలో సంతానోత్పత్తి చేస్తాయి మరియు రాత్రిపూట మాత్రమే కాకుండా పగటిపూట కూడా మిమ్మల్ని కాటు వేయగలవు. వీటిని ఓవర్ హెడ్ ట్యాంకులు, మొక్కలు, పాత్రలు మరియు నీటి పైపుల్లో కనుగొనవచ్చు. చికున్ గున్యా లక్షణాలలో తలనొప్పి, కండరాల నొప్పి, తీవ్రమైన కీళ్ల నొప్పి, అధిక జ్వరం, అలసట మరియు చలి వంటివి ఉంటాయి

.టైఫాయిడ్:

టైఫాయిడ్ అనేది సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా వల్ల నీటి ద్వారా వ్యాపించే వ్యాధి, ఇది తగినంత పారిశుధ్యం లేకపోవడం వల్ల వ్యాప్తి చెందుతుంది. చెడిపోయిన లేదా బహిర్గతమైన ఆహారాన్ని తినడం మరియు కలుషితమైన నీటిని త్రాగడం ద్వారా టైఫాయిడ్ వ్యాప్తి చెందుతుంది. టైఫాయిడ్ జ్వరం అంటువ్యాధి. ఇది వర్షాకాలంలో వచ్చే అనారోగ్యం. కలుషితమైన ఆహారం మరియు నీరు ఈ వ్యాధికి అత్యంత సాధారణ కారణాలు. టైఫాయిడ్ లక్షణాలలో ఎక్కువసేపు అధిక ఉష్ణోగ్రత, బలహీనత, పొత్తికడుపు నొప్పి, మలబద్ధకం, తలనొప్పి, జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పి, గొంతు నొప్పి మరియు వాంతులు ఉంటాయి.

కలరా:కలరా పారిశుధ్యం మరియు పరిశుభ్రత లోపించడం, అలాగే కలుషితమైన ఆహారం మరియు నీరు తీసుకోవడం వల్ల వస్తుంది, మరియు విరేచనాలు మరియు చలనాన్ని కోల్పోవడం వల్ల వస్తుంది. సకాలంలో చికిత్స చేయకపోతే కలరా ప్రాణాంతకం కావచ్చు. తక్కువ రక్తపోటు, కండరాల తిమ్మిరి, వేగవంతమైన హృదయ స్పందన రేటు మరియు పొడి శ్లేష్మ పొర కలరా యొక్క కొన్ని సంకేతాలు.కామెర్లు:కామెర్లు అనేది నీటి ద్వారా వ్యాపించే వ్యాధి. ఇది కలుషితమైన ఆహారం మరియు నీటి ద్వారా వ్యాప్తి చెందుతుంది, అదేవిధంగా తగినంత పారిశుధ్యం లేకపోవడం వల్ల కాలేయం విఫలం అవుతుంది. శరీరం బిలిరుబిన్ ను సరిగ్గా జీవక్రియ చేయనప్పుడు, ఇది చర్మం, శ్లేష్మ పొరలు మరియు కళ్ళు పసుపుగా మారడానికి కారణమవుతుంది. కామెర్లు సాధారణంగా అంతర్లీన పరిస్థితి వల్ల వస్తుంది, ఇది కాలేయం ఎక్కువ బిలిరుబిన్ ను ఉత్పత్తి చేయడానికి కారణమవుతుంది లేదా దానిని తొలగించకుండా నిరోధిస్తుంది. కామెర్లు బలహీనత మరియు అలసటకు కారణమవుతాయి, అలాగే పసుపు మూత్రం, కళ్లు పసుపుగా మారడం మరియు వాంతులు అవుతాయి.జలుబు మరియు ఫ్లూ:అత్యంత తరచుగా వైరల్ ఇన్ఫెక్షన్లు, జలుబు మరియు ఫ్లూ, ఋతుపవనాలు ఆకస్మిక ఉష్ణోగ్రత మార్పుల వల్ల ప్రేరేపించబడతాయి.

# లీజుకు ఏపీటీడీసీ హోటళ్లు, రిసార్ట్‌లు

విజయవాడ, ఆగస్టు 9

పర్యాటకాభివృద్ధికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 22 ఏపీటీడీసీ హోటళ్లు, రిసార్ట్‌లను 33 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వాలని నిర్ణయించింది. ఆరు క్లస్టర్లుగా విభజించి టెండర్ల ద్వారా ప్రైవేట్ సంస్థలకు అప్పగించనున్నారు. పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. అలాగే ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగాలు పోకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కి చెందిన 22 హోటళ్లు, రిసార్ట్‌ల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఆరు క్లస్టర్లలోని ఈ హోటళ్లను 33 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వనున్నారు. టెండర్ల ప్రక్రియను పూర్తి చేయడానికి ఏపీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు ప్రభుత్వం అధికారం ఇచ్చింది. పర్యాటకులకు మంచి వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రైవేట్ సంస్థల నుంచి వచ్చే స్పందనను (ప్రీ బిడ్ సమావేశాల్లో) బట్టి టెండర్ల ప్రక్రియలో స్వల్ప మార్పులు చేసే అధికారాన్ని ఎండీకి ప్రభుత్వం ఇచ్చింది.తాజాగా కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. హోటళ్లు, రిసార్ట్‌ల నిర్వహణలో అనుభవం ఉన్న సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. లీజుకు తీసుకునే సంస్థలు స్థూల ఆదాయంలో 12% లేదా ఏపీటీడీసీ నిర్ణయించిన కనీస వార్షిక అద్దెలో ఏది ఎక్కువైతే దానిని చెల్లించాల్సి ఉంటుంది. దీనినే "ఇంటర్నల్ బెంచ్ మార్కు(ఐబీఎం)"గా నిర్ణయించారు. అంటే కనీసం 12% ఆదాయం లేదా నిర్ణీత అద్దె చెల్లించాల్సి ఉంటుంది.విశాఖపట్నం యాత్రి నివాస్, కళింగపట్నం హరితా బీచ్ రిసార్ట్‌లు ఉన్నాయి.ద్వారకా తిరుమల హరితా హోటల్, దిండి హరితా కోకోనట్ రిసార్టు ఉన్నాయి. సూర్యలంక హరితా హోటల్.. విజయవాడ హరితా హోటల్, బెర్మ్‌పార్క్.. విజయవాడ హరితా హోటల్ భవానీ ద్వీపం.. నాగార్జున సాగర్ హరితా హోటల్, విజయపురి సౌత్.. ఎత్తిపోతల ధ్యానబుద్ధ హరితా హోటల్ ఉన్నాయి.నెల్లూరు హరితా హోటల్.. శ్రీకాళహస్తి హరితా హోటల్ ,గండికోట హరితా హోటల్.. గండి హరితా హోటల్.. కడప హరితా హోటల్.. ఒంటిమిట్ట హరితా హోటల్కర్నూలు హరితా హోటల్, ఓర్వకల్లు హరితా హోటల్, మహానంది హరితా హోటల్.. అహోబిలం హరితా హోటల్.. లేపాక్షి హరితా హోటల్.. శ్రీశైలం హరితా హోటల్‌లు ఉన్నాయి. ఈ హోటల్స్‌లో మొత్తం 222 గదులు ఉన్నాయి.పర్యాటకులకు మంచి సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ హోటళ్లు, రిసార్టుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని నిర్ణయించారు. ఈ మేరకు త్వరలో బిడ్లను ఆహ్వానించనున్నారు. హోటళ్లలో వసతులు సరిగా లేకపోవడం, మంచి చెఫ్‌లు లేకపోవడం వంటి కారణాల వల్ల ఆదరణ తగ్గింది.. అందుకే ఈ మార్పు చేస్తున్నారు. కేరళలో కూడా ఇదే విధానం అమల్లో ఉందని అధికారులు చెబుతున్నారు. అక్కడ పర్యాటకులకు మంచి సదుపాయాలు అందుతున్నాయని అంటున్నారు. దీనివల్ల పర్యాటకుల ఆదరణ పెరుగుతుందని భావిస్తున్నారు.గండికోటను సందర్శించిన సీఎం చంద్రబాబు.. అబ్బో ఇన్ని సమస్యలు ఉన్నాయా!రాష్ట్రంలో ంఖుఆఅ హోటళ్ల ద్వారా ఏటా రూ.10 నుంచి రూ.15 కోట్ల ఆదాయం వస్తోంది. ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే ఈ ఆదాయం రూ.20 కోట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఆ హోటళ్లలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగం పోకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. వారి ఉపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామన్నారు. మరి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఏ మేరకు సక్సెస్ అవుతుందో చూడాలి మరి.

# విద్యుత్ వినియోగదారులకు మరో అవకాశం

విజయవాడ, ఆగస్టు 9,

కరెంట్ వినియోగదారులకు ఏపీఈఆర్‌సీ మరోసారి అద్భుత అవకాశం కల్పించింది. అదనపు లోడును క్రమబద్ధీకరించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ గడువు పొడిగించింది. గృహ విద్యుత్ వినియోగానికి సంబంధించి విద్యుత్ అదనపు లోడును క్రమబద్ధీకరించుకునేందుకు తొలుత జూన్ 30 వరకూ సమయం ఇచ్చారు. అయితే ఈ పథకంపై సరైన అవగాహన లేకపోవటంతో చాలా మంది ఈ అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో విద్యుత్ అదనపు లోడు స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకునేందుకు డిసెంబర్ 31వ తేదీ వరకూ గడువు ఇచ్చింది. ఈలోపు అదనపు లోడ్ క్రమబద్ధీకరించుకున్నవారికి కరెంట్ ఛార్జీలలో 50 శాతం వరకూ రాయితీ అందించనున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ కార్యదర్శి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణ పథకంపై ప్రచారం, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.సాధారణంగా మనందరం ఇళ్లల్లో కరెంట్ బల్బులు, ఫ్యాన్లు, ఏసీలు, టీవీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు వంటివి ఉపయోగిస్తూ ఉంటాం. దీంతో ఇళ్లల్లో కరెంట్ వాడకం రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో విద్యుత్ కనెక్షన్ కోసం అప్లై చేసుకున్న సమయంలో నమోదు చేసిన కరెంట్ లోడ్ కంటే ఈ మొత్తం దాటిపోతోంది. దీంతో ఈ అదనపు భారం రెగ్యులేటరీల మీద పడుతోంది. దీంతో విద్యుత్ సరఫరాలో సమస్యలు, లోఓల్టేజ్ ఇష్యూలు వస్తున్నాయి. దీంతో అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు అధికారులు అవకాశం కల్పిస్తున్నారు.అయితే సాధారణంగా గృహ విద్యుత్ వినియోగానికి సంబంధించి.. అదనపు లోడ్ కిలోవాట్‌కు డెవలప్‌మెంట్ ఛార్జీ కింద రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సెక్యూరిటీ డిపాజిట్‌గా రెండు వందల రూపాయలు.. దీనికి తోడు దరఖాస్తుకు రూ.50 కలిపి మొత్తంగా రూ.2,500 వరకూ వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుంది. అదనపు ఖర్చుల కింద మరో రూ.250 అధికం. అయితే అదే ఇప్పుడు ఉన్న పథకం ప్రకారం స్వచ్ఛందంగా విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరించుకునే వారు రూ.1,250 చెల్లిస్తే చాలు. అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు తొలుత జూన్ 30 వరకూ సమయం ఇచ్చారు. ఆ గడువు ముగిసిపోగా.. తాజాగా ఈ గడువును డిసెంబర్ 31 వరకూ పొడగించారు.

================

# కాంగ్రెస్ లోకి గల్లా ఫ్యామిలీ

గుంటూరు, ఆగస్టు 9,

ఏపీలోకాంగ్రెస్ బలోపేతం దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టిందా? భారీ వ్యూహం రూపొందిస్తోందా? ఈ విషయంలో ఏపీలో అధికార కూటమి కూడా అదే కోరుకుంటుందా? కాంగ్రెస్ పార్టీ బలపడితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలహీన పడుతుందని అంచనా వేస్తోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా షర్మిల ఉన్నారు. అయితే ఆమె నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలపడకపోవడంపై అనేక ఫిర్యాదులు వెళుతున్నట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఏపీలో ఒక బలమైన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీలోకి తెస్తే బాగుంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. వారికి గుడ్ బై చెప్పారు. ఆ ఎన్నికల్లో పోటీ చేయలేదు.ప్రస్తుతం గల్లా కుటుంబం రాజకీయంగా సైలెంట్ గా ఉంది. అయితే ఆ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ఏ పీసీసీ అధ్యక్షులపై కూడా ఈ స్థాయిలో ఫిర్యాదులు లేనట్లు తెలుస్తోంది. షర్మిల సీనియర్లను కలుపుకొని వెళ్లడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆమె బాధ్యతలు తీసుకుని దాదాపు రెండేళ్లు అవుతోంది. పార్టీ నుంచి బయటకు వెళ్లిన నేతలే తప్ప.. కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే నాయకులు కనిపించడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో గల్లా ఫ్యామిలీని కాంగ్రెస్ పార్టీలోకి తెచ్చి నాయకత్వ బాధ్యతలు



తెచ్చి నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే పార్టీ బలోపేతం కావడం ఖాయమని టాక్. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకత్వం ఆ కుటుంబంతో చర్చలు జరుపుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. మరోవైపు ఈ విషయంలో కూటమి సైతం అంతర్గతంగా సహకారం అందిస్తున్నట్లు సమాచారం.ఏపీలో కాంగ్రెస్ పార్టీకి ఎనలేని ఆదరణ ఉండేది. సుదీర్ఘకాలం ఈ రాష్ట్రాన్ని పాలించింది కాంగ్రెస్ పార్టీ. కానీ ఎన్టీఆర్ టిడిపిని ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటూ వచ్చింది. అయినా సరే టిడిపి ప్రభంజనాన్ని తట్టుకొని మరి నిలబడింది. అయితే ఇలా తట్టుకోవడం వెనుక బలమైన కుటుంబ నేపథ్యం ఉన్న నేతలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారు. అందులో పాతూరి రాజగోపాల్ నాయుడు ఒకరు. ఆయన కాంగ్రెస్ పార్టీ కురువృద్ధుడు. కృషికర్ లోక్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి ఎమ్మెల్యే అయ్యారు. కాంగ్రెస్ పార్టీలో చేరి రెండుసార్లు చిత్తూరు నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. ఆయన వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చారు గల్లా అరుణకుమారి. ఈమె అమర్ రాజా కంపెనీ ఫౌండర్ గల్లా రామచంద్ర నాయుడు భార్య. తండ్రి వారసత్వంగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా అయ్యారు. పదేళ్లపాటు మంత్రిగా కూడా కొనసాగారు. రాష్ట్ర విభజనతో 2014లో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆమె కుమారుడు గల్లా జయదేవ్ 2014, 2019లో గుంటూరు ఎంపీగా గెలిచారు. 2024 ఎన్నికలకు ముందు క్రియాశీలక రాజకీయాలకు అప్పగిస్తే మేలన్న నిర్ణయానికి హై కమాండ్ వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ పెద్దలు గల్లా కుటుంబంతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. 2029 ఎన్నికల్లో రాహుల్ గాంధీ తప్పకుండా ప్రధాని అవుతారని.. ఏపీలో మీకు మంచి భవిష్యత్తు ఉంటుందని వారితో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.అయితే ఈ విషయంలో చంద్రబాబుసహకారం కూడా కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్నట్లు అనుమానాలు ఉన్నాయి. గల్లా జయదేవ్ తో పాటు అరుణకుమారి చంద్రబాబుకు సన్నిహితులు. వారి మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. అయితే 2018లో బిజెపితో కటీఫ్ చెప్పింది టిడిపి. 2019 ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూడడంతో తెలుగుదేశం పార్టీ బిజెపికి టార్గెట్ అయింది. ఈ క్రమంలోనే పారిశ్రామికవేత్త అయిన గల్లా జయదేవ్ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంతోనూ.. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంతోనూ ఇబ్బందులు పడ్డారు. అందుకే క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై ప్రకటించారు. అయితే ఓ పారిశ్రామికవేత్తగా, చరిష్మ ఉన్న కుటుంబం గా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తీసుకుంటే తప్పకుండా ఆ ప్రభావం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై పడుతుంది. కాంగ్రెస్ పార్టీకి సరైన నాయకుడు వస్తే వైసీపీలో అసంతృప్తి నేతలు సైతం ఆ పార్టీలో చేరే అవకాశం ఉంది. అందుకే ఈ విషయంలో చంద్రబాబు సైతం ఒప్పిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# వరుస అల్పపీడనాలు... రెయిన్ అలెర్ట్

విశాఖపట్టణం, ఆగస్టు 9,

ఉత్తర అంతర కర్ణాటక ప్రాంతం , దాని పరిసర ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ పై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. సగటు సముద్ర మట్టానికి 1.5 ఢ 3.1 కి.మీ మధ్య ఎత్తులో విస్తరించింది. దక్షిణ కోస్తా? ఆంధ్రప్రదేశ్ నుండి ఉత్తర శ్రీలంక వరకు తమిళనాడు తీరం మీదుగా సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తులో ఉత్తర-దక్షిణ ద్రోణి విస్తరించి ఉంది. ఆగస్టు 13, 2025 నాటికి వాయువ్య బంగాళాఖాతం , దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉంది.

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ ఢ యానాం :-

ఈరోజు:-

తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది ఉరుములతో కూడిన మెరుపులు , బలమైన గాలులు గంటకు 30-40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది.

రేపు, ఎల్లుండి:-

తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు , బలమైన గాలులు గంటకు 30-40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది.

దక్షిణ కోస్తా ఆంధ్ర ప్రదేశ్:-

ఈరోజు , రేపు :

తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది ఉరుములతో కూడిన మెరుపులు , బలమైన గాలులు గంటకు 30-40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది.

ఎల్లుండి:-

తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు , బలమైన గాలులు గంటకు 30-40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది.

రాయలసీమ:-

ఈరోజు, రేపు:-

తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది ఉరుములతో కూడిన మెరుపులు , బలమైన గాలులు గంటకు 30-40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది.

ఎల్లుండి:-

తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు , బలమైన గాలులు గంటకు 30-40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది.

# ఒడిస్సా నుండి కేరళకు గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు

## జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం

ఒడిస్సాలో గంజాయి కొనుగోలు చేసి తమిళనాడుకు తరలించే క్రమంలో నలుగురు నిందితులు బొండపల్లి పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల వద్ద నుండి 100 కిలోల గంజాయి, ఒక షిఫ్ట్ కారు, 4 సెల్ ఫోన్లు, రూ.2,500/-ల నగదు స్వాధీనం చేసుకున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను త్వరలో పట్టుకుంటామన్నారు. బొండపల్లి పోలీసులకు రాబడిన ఖచ్చితమైన సమాచారంతో గొట్లాం బైపాస్ రోడ్డు జంక్షనువద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా ఒడిస్సా నుండి మిళనాడు రాష్ట్రానికి షిఫ్ట్ కారులో గంజాయిని తరలిస్తున్న ఇద్దరి నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 48 ప్యాకెట్లలో గల 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుడు ఇచ్చిన సమాచారంతో మరో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, 4గురు నిందితులను రిమాండుకు తరలిస్తున్నట్లుగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆగస్టు 9న నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ వివరాలను వెల్లడించారు.

# రక్షాబంధన్ పండగ సోదరా భావానికి ప్రతీక

జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ జిల్లా ఎస్పీ కి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేసిన సరస్వతి శిశు మందిర్ విద్యార్థినిలు

వనపర్తి జిల్లా శనివారం రోజు రాఖి పండగ సందర్భంగా శుక్రవారం రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ కి వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల విద్యార్థినీలు రాఖీలు కట్టి, స్వీట్స్ పంచి శుభాకాంక్షలు తెలిపారు.

# మీ 10 ఏళ్ల అవినీతికి మేం రక్ష.. మా దోపిడీకి మీరు రక్ష:

## ఇదీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరు.? కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్

అందుకే అవినీతికి పాల్పడ్డారని తెలినా కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకోవడం లేదు.విద్యుత్ కొనుగోళ్ల కమిషన్ నివేదికను కేబినెట్ లో ఎందుకు చర్చించలేదు?పెద్ద ఎత్తున వాటా ముట్టినందునే దీనిపై కాంగ్రెస్ నోరు మెదపడం లేదా,ఫోన్ ట్యాపింగ్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ విచారణపై మాకు నమ్మకం లేదు.జడ్జీలను, సీఎం, కేంద్ర అధికారులను పిలిచి విచారించే స్థాయి సిట్ కు లేదుసీబీఐ విచారణ కోరడానికి అనేక కారణాలున్నాయి.కేంద్రం నేరుగా జోక్యం చేసుకునే అవకాశమే ఉంటే పరిస్థితి వేరుగా ఉండేదికేటీఆర్ లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదు,ఫోన్ ట్యాపింగ్ పై కుటుంబ సభ్యులతో కలిసి గుడిలో ప్రమాణం చేసే దమ్ముందా?ఫోన్ ట్యాపింగ్ జరిగిందని నేను దేవుడి సాక్షిగా ప్రమాణం చేసేందుకు సిద్ధందమ్ముంటే నా సవాల్ ను స్వీకరించాలి.కేటీఆర్ లెక్క కొంపలు ముంచే తెలివి నాకు లేదుఎస్ఐబీని నీచమైన పనులకు వాడుకున్న దుర్మార్గులా మాకు చెప్పేది?బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సిగ్గు, శరం, రోషం ఉంటే ఆ పార్టీని వదిలి బయటకు రావాలికవితకు కూడా నోటీసులిచ్చి ఫోన్ ట్యాపింగ్ పై విచారణ జరపాలి.ఫోన్ ట్యాపింగ్ కాలేదని హరీష్ రావు ప్రమాణం చేయగలరా?కరీంనగర్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్:కుటుంబ సభ్యులు, జర్నలిస్టులతో కలిసి రాఖీ సంబురాలు జరుపుకున్న కేంద్ర మంత్రి.రాష్ట్రంలో విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. మీ 10 ఏళ్ల అవినీతికి మేం రక్ష..మా దోపిడీకి మీరు రక్ష. అంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరికొకరు అవినీతి, దోపిడీలకు రక్షగా నిలుస్తూ ప్రజలను వంచిస్తున్నాయి అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని తెలినా కేసీఆర్ కుటుంబంపై కాంగ్రెస్ చర్యలు తీసుకోకపోవడానికి ఆ రెండు పార్టీల మధ్యనున్న 'రక్షా' బంధమే కారణమని ఎద్దేవా చేశారు.

కాళేశ్వరం కమిషన్ నివేదికను కేబినెట్ లో చర్చించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యుత్ కొనుగోళ్ల కమిషన్ నివేదికను కేబినెట్ లో ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. పెద్ద ఎత్తున వాటాలు ముట్టినందునే ఆ కమిషన్ నివేదిక గురించి కనీసం పెదవి కూడా విప్పడం లేదని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేటీఆర్ ఇచ్చే లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రాజకీయంగా నేరుగా ఎదుర్కొనే దమ్ములేకు చేసిన తప్పులు, పాపాల నుండి తప్పించుకునేందుకు లీగల్ నోటీసుల పేరుతో భయపెట్టాలని చూస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ ను "ఫోన్ ట్యాపింగ్ జరిగిందని మావద్ద సమాచారముంది. ఆధారాలున్నాయి. ఇదే విషయంపై ఏ గుడికైనా కుటుంబ సభ్యులతో కలిసి వస్తా. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని దేవుడి సాక్షిగా ప్రమాణం చేస్తా. అదే సమయంలో నువ్వు కూడా నీ భార్యాపిల్లలు, తల్లిదండ్రులతో కలిసి గుడికి వచ్చి ఫోన్ ట్యాపింగ్ జరగలేదని వాళ్లందరితో కలిసి ప్రమాణం చేస్తావా?' అని సవాల్ విసిరారు. దమ్ముంటే తన సవాల్ కు స్పందించాలని అన్నారు. రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని కరీంనగర్ లోని తన నివాసంలో బండి సంజయ్ కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, జర్నలిస్టులతో కలిసి రాఖీ సంబురాలు జరుపుకున్నారు. పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి రాఖీలు కట్టి స్వీట్లు తిన్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ. రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానామిచ్చారు. ఏమన్నారంటే..రాష్ట్ర ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు. ఈ దేశ, ధర్మ రక్షణ కోసం కలిసికట్టుగా ఉంటూ నాకు నువ్వు రక్ష, నేను నీకు రక్ష అని చెప్పేలా జరుపుకునే పండుగ. ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని కోరుకుంటున్నా. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం చాలా విచిత్రమైన పరిస్థితులులున్నాయి. మీ అవినీతికి మేం రక్ష..మా దోపిడీకి మీరు రక్ష' అంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ కలిసి దోచుకుంటున్నాయి. అందుకే బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణల పేరుతో కాలయాపన చేస్తున్నారే తప్ప కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. అట్లాగే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుంటే నిలదీయకుండా బీఆర్ఎస్ రక్షణ కవచంగా నిలిచింది. ఈ పార్టీల సంగతి ప్రజలు అర్ధం చేసుకోవాలి. అట్లాగే ఫోన్ ట్యాపింగ్ జరగలేదని హరీష్ రావును ప్రమాణం చేయమనండి చూద్దాం. కేసీఆర్ అరాచకాలవల్ల ఆనాడు రాష్ట్రంలోని సామాన్య ప్రజలు కూడా ఒకరికొకరు వాట్సాప్, సిగ్నల్ ద్వారా మాట్లాడుకునే వాళ్లంటే పరిస్థితి ఎట్లుందో అర్ధం చేసుకోవచ్చు.

## ఆర్టీసీ బస్సులో పురుషులకు షాక్

తాండూరు

పండుగ పూట ఆర్టీసీ మగ వారి జేబులకు చిల్లులు పెట్టింది. ఉన్న ఛార్జి కంటే అధికంగా వసూళ్లు చేసింది. బస్సు మాత్రం ఆర్డినరీ టికెట్టు మాత్రం ఎక్స్ ప్రెస్ రేటు. ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ముందస్తు సమాచారం ఇవ్వలేక పోవడం పై పురుషులు మండి పడుతున్నారు. మాకు ఏమి తెలియదని కండక్టర్ లుఅంటున్నారు

# సేమ్ డే శ్రీ వాణి ద్వారా దర్శనం

తిరుమల, ఆగస్టు 9,

తిరుమల శ్రీవారి దర్శనం కోసం ప్రత్యేకంగా వీఐపీల సౌకర్యార్థం అమలు చేస్తున్న శ్రీవాణి టిక్కెట్ల కేటాయింపులను భక్తులకు మరింత చేరువ చేసే దిశగా మెరుగైన సౌకర్యాలను అందించేందుకు టీటీడీ ఆధునిక పద్ధతులను ఆలంబిస్తోంది. ఆఫ్లైన్ విధానంలో ప్రతిరోజు 800 టికెట్లను తిరుమలలో కేటాయిస్తున్న పద్ధతిని భక్తులకు సౌకర్యవంతంగా ఇటీవలే మార్పులు చేపట్టారు. 10.500 రూపాయలు చెల్లిస్తున్న ఈ సౌకర్యాల కల్పనలో టీటీడీ అడిషనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిహెచ్ వెంకయ్య చౌదరి భక్తుల ఇబ్బందులను స్వయంగా పరిశీలించి అధ్యయనం చేసిన అనంతరం ఇకపై శ్రీవాణి టికెట్లను క్యూ లైన్ లో గంటలు తరబడి వేచి ఉండి ఇబ్బందులు పడకుండా భక్తులకు సుదర్శనం టోకెన్ల కంకణాల తరహాలో భక్తులకు ముంజేతికి డిజిటల్ టోకెన్లను కట్టేలాగా నిర్ణయం తీసుకున్నారు.ఉదయాన్నే ఈ టోకెన్లు పొందిన భక్తులు గంటల తరబడి వేచి ఉండే అవసరం లేకుండా వారి ఇతరత్రా పనులు చూసుకుని దర్శనానికి వెళ్లే సమయంలోపుగా ఏ సమయంలోనైనా టికెట్లు పొందే అవకాశాన్ని కల్పిస్తారు. ఇందుకోసం ఉదయాన్నే క్యూలైన్లో వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ అనే పద్ధతిలో 800 మంది భక్తులకు టోకెన్ తరహాలో డిజిటల్ కంకణాన్ని చేతికి కడతారు. అందులో సీరియల్ నెంబర్ తో పాటు భక్తుల వివరాలు కూడా సిస్టంలో నమోదు చేసిన అనంతరం పంపిణీ చేస్తారు. మరో వారం రోజులు లోపుగా ఈ తాజా నిర్ణయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులతో అడిషనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిహెచ్ వెంకయ్య చౌదరి ఏర్పాట్లపై సమీక్షిస్తున్నారు.ప్రస్తుతం శ్రీవాణి టికెట్లను పొందేందుకు తిరుమలలోని హెచ్ వి డి సి ప్రాంతంలో ప్రత్యేకంగా ఆధునికరించిన కార్యాలయాన్ని కూడా కొద్ది రోజుల క్రితమే ప్రారంభించారు. ఇక్కడ శ్రీవాణి టికెట్లను తీసుకున్న రోజు కాకుండా మరుసటి రోజున శ్రీవారి దర్శనాన్ని కల్పించే పద్ధతికి స్వస్తి పలికి ఏ రోజు కా రోజు ఉదయం టికెట్లు తీసుకుంటే సాయంత్రం నాలుగు గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతించే విధంగా ఇటీవలే మార్పులు తీసుకొచ్చారు.అయినప్పటికీ రోజు రోజుకి శ్రీవాణి టికెట్లకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ టికెట్లను పొందేందుకు ఉదయం 6 గంటల నుండి భక్తులు క్యూ కడుతున్నారు. అయితే టీటీడీ మాత్రం ఉదయం 10 గంటలకు టికెట్ల పంపిణీ ప్రారంభిస్తోంది. నాలుగు లైన్లతో కూడిన టికెట్ల కౌంటర్లను శ్రీవాణి టికెట్లు కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అయినప్పటికీ భక్తుల తాకిడి అధికం కావడం చివరకు ఎనిమిది వందల టికెట్లు కేటాయింపు పూర్తయి మిగిలిన వారికి మొండి చేయి చూపాల్సి రావడం పై టీటీడీ అధికారులకు ఒక విధంగా ఒత్తిడి ఏర్పడుతోంది. ఒత్తిడి మాట ఎలా ఉన్నా భక్తులకు గంటలు గంటలు వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా శ్రీవాణి టిక్కెట్ల కేటాయింపుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి పది నిమిషాల్లో టికెట్లు పొంది సౌకర్యంగా దేవుడు దర్శనానికి వెళ్లే విధంగా అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి ఏర్పాట్లు చేపట్టారు.

# విమానాలు ఎందుకు రద్దవుతున్నాయి...

న్యూయార్క్, ఆగస్టు 9,

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాలను విధించే పనిలో ఉండగా.. మరోవైపు ఆ దేశంలో ప్రయాణ సాధనాల్లో అంతరాలు ఏర్పడుతున్నాయి. తాజాగా అమెరికాలోని కొన్ని విమాన సర్వీసులు ఆలస్యంగా సాగగా.. మరికొన్ని విమానాలు పూర్తిగా రద్దయ్యాయి. ప్రపంచంలోని పని దేశాలతో సంబంధాలు ఉన్న అమెరికాలో ఇలాంటి పరిస్థితి ఎదురు కావడం వల్ల చాలా దేశాలకు సమస్యలు ఏర్పడ్డాయి. ఎందుకంటే ఈ విమాన సర్వీసుల ద్వారా కేవలం ప్యాసింజర్స్ మాత్రమే కాకుండా కొన్ని వస్తువుల రవాణా కూడా నిలిచిపోయింది. 800 విమానాలు రద్దు అయినట్లు తెలుస్తోంది. హ్యూస్టన్ లోని టెర్మినల్ మొత్తం ప్రయాణికులతో నిండిపోయింది. ట్రాక్ లపై ఎక్కడికక్కడే విమానాలు నిలిచిపోయాయి. అయితే విమానాలు రద్దు కావడానికి సాంకేతిక సమస్యలే కారణమని యునైటెడ్ ఎయిర్లైన్స్ సంస్థ తెలిపింది. ఇప్పటివరకు జరిగిన సాంకేతిక సమస్యలను పరిష్కరించే పనిలో ఉన్నట్లు ఆ సంస్థ అధికారికంగా తెలిపింది.విమానాలు రద్దు కావడంతో ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేటర్ కూడా స్పందించింది. విమానాల రద్దుకు సాంకేతిక సమస్య అని యునైటెడ్ సంస్థ పేర్కొన్నట్లు.. ఎఫ్ ఏ ఏ పేర్కొంది. అయితే ఒక్కచోట ఈ సమస్య ఉండడంతో దేశవ్యాప్తంగా విమాన సర్వీసులను రద్దు చేసినట్లు ఆదేశించామని తెలిపింది. మొత్తంగా 826 విమాన సర్వీసుల్లో అంతరాయం కలగగా.. 23 విమానాలు పూర్తిగా రద్దు అయినట్లు అమెరికా మీడియా పేర్కొంది. విమానాల రద్దుతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ విమానాలు తిరిగి కొనసాగించడానికి సమయం పడుతుందని తెలపడంతో ప్రయాణికులు టెర్మినల్స్ లో నిరీక్షిస్తున్నారు.అయితే చికాగోలోని ఎయిర్లైన్స్ విమాన సంస్థలు ఒక ప్రకటనలు విడుదల చేశాయి. ప్రయాణికుల సౌకర్యార్థం కోసమే విమానాలను రద్దు చేశామని చెప్పారు. సాంకేతిక సమస్యల వల్ల 35% విమానాలు ఆలస్యంగా నడుస్తాయని.. ఆరు శాతం విమానాలు పూర్తిగా రద్దు చేశామని తెలిపారు. ప్రయాణికుల భద్రతా కోసమే ఇలాంటి నిర్ణయం తీసుకున్నామని వారు పేర్కొన్నారు. మరో ఎయిర్లైన్స్ సంస్థ స్పందిస్తూ ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినందుకు క్షమాపణలు చెబుతూనే.. మంచి కోసమే విమానాల సర్వీసులు రద్దు చేశామని తెలిపింది.

కవైపు భారత్, అమెరికాల మధ్య సుంకాల విషయంలో చర్యలు కొనసాగుతున్న వేళ ఒక్కసారిగా ఇలా విమానాలు రద్దు కావడంపై ప్రయాణికులతో పాటు అమెరికాలో ఉండే భారతీయులు ఆందోళన చెందుతున్నారు. రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ చేసుకుంటున్న తరుణంలో ఇప్పటివరకు భారత్ పై ఉన్న 25% నుంచి 50% వరకు సుంకాలు పెంచినట్లు ట్రంపు తెలిపారు. అయితే ఇదే సమయంలో విమాన సర్వీసులు రద్దు కావడంపై తీవ్ర చర్చ సాగుతోంది.

# ఇండియా, అమెరికా పచ్చళ్ల వ్యాపారం రూ. 20 వేల కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 9,

భారతదేశం సుగంధ ద్రవ్యాలకు పుట్టినిల్లు. భారత్ ప్రపంచంలో అతిపెద్ద సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిదారుగా మాత్రమే కాకుండా, అతిపెద్ద ఎగుమతిదారుగా కూడా నిలుస్తోంది. భారతదేశం ప్రతియేటా సుమారు రూ. 20,000 కోట్ల విలువైన పచ్చళ్ళు, పాపడ్‌లు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలను విదేశాలకు ఎగుమతి చేస్తోంది. ముఖ్యంగా కెనడా, యుకె, అమెరికాలో ఈ ఉత్పత్తులకు భారీగా డిమాండ్ ఉంది. 2023-24లో రూ. 36,958.80 కోట్ల విలువైన స్పైసెస్ ను ఎగుమతి చేయగా.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరునెలల్లోనే భారత్ రూ. 29,016 కోట్ల (జూవి 3.36 బిలియన్) విలువైన సుగంధ ద్రవ్యాలను ఎగుమతి చేసి రికార్డ్ నెలకొల్పింది. 2027 నాటికి 10 బిలియన్ డాలర్ల ఎగుమతిని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది.వీటిలో ఒక్క అమెరికానే రూ. 5,136 కోట్ల (జూవి 594.82 మిలియన్) విలువైన స్పైసెస్ ను దిగుమతి చేసుకోగా.. రూ. 2,766 కోట్ల (జూవి 320.36 మిలియన్) విలువైన సుగంధ ద్రవ్యాలను యూకే దిగుమతి చేసుకుంది. అమెరికాలో వీటి డిమాండ్ ప్రతియేటా 10% పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. అమెరికా, కెనడా, యుకెలతో సహా అన్ని యూరప్ దేశాల్లో భారతీయ పచ్చళ్లకు, పాపడ్‌లకు డిమాండ్ ఎక్కువే. అక్కడి మార్టుల్లో ఇవి హాట్ కేకుల్లా అమ్ముడవుతాయి. చాలాసార్లు ఔట్ ఆఫ్ స్టాక్ బోర్డులు కూడా దర్శనం ఇస్తాయి. అయితే ఇందుకు గల ప్రధాన కారణం భారత్ నుంచి విదేశాలకు పెరుగుతున్న భారీ వలసలు అంటున్నారు నిపుణులు. అలాగే విదేశీయుల్లో భారతీయ రుచుల పట్ల ఆసక్తి, ఆరోగ్యకరమైన సేంద్రీయ ఆహార ఉత్పత్తుల పట్ల పెరుగుతున్న ఆదరణ కూడా కారణమే అంటున్నారు.ఉదాహరణకు కెనడాలో భారతీయ రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్లలో మామిడి, నిమ్మ వంటి పచ్చళ్ళు, భారత్ నుంచి ఎగుమతయ్యే బియ్యం, పాపడ్‌లకు గిరాకీ ఎక్కువగా ఉంది. అలాగే యుకెలో కూడా పచ్చళ్ళు, పాపడ్‌లు బ్రిటిష్-ఇండియన్ వంటకాలలో ప్రధాన భాగంగా మారాయి. భారత్ తన నిర్దిష్ట లక్ష్యాన్ని చేరాలంటే ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్లు, అంతర్జాతీయ ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఎగుమతులు ఉండటం, మార్కెట్ అడ్డంకులను అధిగమించాల్సిన అవసరం ఇంకా ఉన్నట్టు తెలుస్తోంది.

# ఆర్ధరాత్రి కత్తితో దాడి

కుత్బుల్లాపూర్

పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి కొందరు కత్తులతో హల్చల్ చేసారు. బిస్ట్రో మండి వద్ద బిర్యానీ కోసం కొందరు వ్యక్తులు వచ్చారు. తూముకుంట కు చెందిన ఓ వ్యక్తి వంశీ గౌడ్ అనే వ్యక్తి కారు మీద మూత్రం చేశాడని ఇద్దరి మధ్య గొడవ జరిగిది. గొడవలో వంశీ గౌడ్(27) అనే వ్యక్తి చేతికి కత్తి గాయం అయింది. అర్ధరాత్రి శబ్దాలు వినిపించడంతో స్థానికులు భయంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాయపడిన వ్యక్తికి స్థానిక ఆసుపత్రిలో చికిత్స జరిపించారు.

# రోగి మృతి?

## ఆసుపత్రి ఫర్నిచర్ ధ్వంసం

శంషాబాద్

శంషాబాద్ ఎయిర్ పోర్టు పిస్ పరిధిలో లిమ్స్ హాస్పిటల్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. మదన్ పల్లి చేందిన లక్ష్మి అనే మహిళ కిడ్నీ స్టోన్ బాధతో ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చింది. కీడ్ని లో రాళ్ళ వచ్చాయి అని చికిత్స చేసారు. డాక్టర్ నిర్లక్ష్యం తో తన భార్య చనిపోయిందని భర్త కిషన్ నాయక్ పోలీసులకు పిర్యాదు చేసాడు. మృతురాలి బంధువులు లింక్స్ హాస్పిటల్ పై దాడి చేసారు. డాక్టర్ ల నిర్లక్ష్యం వల్ల లక్ష్మి చనిపోయారు అంటు ఆమెఉ కుటుంబ సభ్యులు అగ్రహంతో హాస్పిటల్ పై దాడికి పాల్పడారు.ఫర్నిచర్ ధ్వంసం చేసారు.

# జిహెచ్ఎంసి కార్మికులతో రక్షాబంధన్ ఉత్సవాలు జరుపుకున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

హైదరాబాద్

బీజేపీ నేత, హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు శనివారం నాడు రామ్ నగర్ లోని అయన నివాసంలో జిహెచ్ఎంసి మహిళా కార్మికులు రక్షాబంధన్లు చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ మహిళలకు పవిత్రమైన పండుగ రక్షాబంధన్. సోదరికి జీవితాంతం రక్షగా ఉండాలని వీారు కూడా విజయాలు సాధించాలని ఆశీర్వదించుకునేదని అన్నారు. ప్రేమ, ఆప్యాయతను పెంచేది పండుగ. సమాజంలో ప్రేమ ఆప్యాయతలు పెరగాల్సిన అవసరం ఉంది. భారతీయ సంస్కృతిలో మహిళలకు గౌరవమిచ్చి ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని అన్నారు....

# మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రిలో దారుణం

రంగారెడ్డి

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కేంద్రలోని ప్రభుత్వం ఆసుపత్రిలో గత నెల 27వ. తేదీ నా నందిగామ గిరి వర్మ అనే బాలుడు సాయంత్రం సమయంలో బయట ఆడుకుంటుండగా గాజు పెంకు కాలికి గుచ్చుకోవడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకెళ్లారు.డ్యూటీలో ఉన్న డాక్టర్ నిర్లక్ష్యంగా అక్కడే డ్యూటీ లో ఉన్న గేట్ వాచ్మెన్ తో కుట్లు వేయించడం వల్ల గాజు పెంకు కాలులోనే ఉండగానే కుట్లు వేయడం దారుణం.గాయం అయిన కాలు వాపు రావడంతో భయంతో ఒక రెండు రోజులు గడిచిన అనంతరం మరల హాస్పిటల్ కు వెళ్ళగా మాత్రలు రాసి పంపించారు. ఆల మూడు సార్లు వచ్చిన అదే పద్ధతిలో వచ్చిన బాలుడిని పంపించారు.కాలు వాపు మరింత రావడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో స్కానింగ్ తియగా గాజు పెంకు ఉందిని డాక్టర్ చెప్పగా శుక్రవారం సాయంత్రం అతనికి సర్జరీ చేసి గాజు పెంకు బయటకు తీసారూ.పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రి వెళ్లలేక ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే డాక్టర్లు ఇలా నిర్లక్ష్యం చేస్తే పేద ప్రజలు ఎక్కడికి వెళ్లాలి అన్ని బాధితులు ప్రశ్నించారు.

# భారత స్వయంసమృద్ధిలో యోగా కీలక పాత్ర

ముంబై, ఆగస్టు 9,

స్వామి రాందేవ్ దార్శనికత లక్షలాది మందికి యోగాను అందించింది. రైతులకు సాధికారత కల్పించింది. ఆయుర్వేదాన్ని ప్రోత్సహించింది. స్వావలంబనను పెంచింది. భారతదేశాన్ని ఆరోగ్యకరమైన, సాంస్కృతికంగా గొప్ప , ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన దేశంగా తీర్చిదిద్దింది. బాబా రామ్‌దేవ్ ప్రతి ఇంటికి యోగాను తీసుకువచ్చారని, కంపెనీ ద్వారా రైతులకు సాధికారత కల్పించారని, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించారని పతంజలి ఆయుర్వేదం పేర్కొంది. భారతదేశాన్ని సాంస్కృతికంగా సంపన్నం చేయడంలో ఆయన సహకారం గణనీయంగా ఉందియోగా గురువుగా ప్రసిద్ధి చెందిన స్వామి రామ్‌దేవ్ భారతదేశాన్ని ఆరోగ్యంగా, స్వావలంబనగా మార్చడానికి ఒక ప్రత్యేకమైన దార్శనికతను అందించారని పతంజలి సంస్థ తెలిపింది. బాబా రామ్‌దేవ్ నాయకత్వంలో, పతంజలి ఆయుర్వేదం యోగా, ఆయుర్వేదాన్ని ప్రోత్సహించడమే కాకుండా భారతదేశ ప్రాచీన సంప్రదాయాలను ఆధునిక అవసరాలతో అనుసంధానించింది. వాటికి కొత్త దిశను ఇచ్చిందని పతంజలి తెలిపిది. ఆరోగ్యకరమైన శరీరం, స్వావలంబన ఆర్థిక వ్యవస్థ ఏ దేశ పురోగతికైనా పునాది అని స్వామి రామ్‌దేవ్ విశ్వసిస్తున్నారు."స్వామి రాందేవ్ , ఆచార్య బాలకృష్ణ నాయకత్వంలో, దేశం ఆరోగ్యం, స్వావలంబనలో ఒక విప్లవాన్ని చూస్తోంది" అని పతంజలి ఆయుర్వేద పేర్కొంది. ఈ సంస్థ యోగాను ప్రతి ఇంటికి తీసుకెళ్లింది, లక్షలాది మంది క్రమం తప్పకుండా సాధన చేయడం ద్వారా వారి శారీరక , మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునేలా చేసింది. ఒత్తిడి, మధుమేహం , గుండె జబ్బులు వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడే కపాల్‌భతి , అనులోమ-విలోమ వంటి ప్రాణాయామం, ఆసనాలను స్వామి రాందేవ్ ప్రాచుర్యంలోకి తెచ్చారు. అదనంగా, మూలికా మందులు, సౌందర్య సాధనాలు ,ఆహార పదార్థాలతో సహా పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులు ప్రజలకు సహజ , శీయ ప్రత్యామ్నాయాలను అందిస్తున్నాయి.""స్వామి రామ్‌దేవ్ స్వప్నం కేవలం ఆరోగ్యానికే పరిమితం కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి పతంజలి 'ఫామ్ టు ఫార్మసీ' నమూనాను స్వీకరించింది. దీని కింద ఔషధ మూలికలను రైతుల నుండి నేరుగా సేకరిస్తారు. ఇది రైతుల ఆదాయాలను పెంచడమే కాకుండా సేంద్రీయ వ్యవసాయాన్ని కూడా ప్రోత్సహించింది. పతంజలి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకుకూడా మద్దతు ఇచ్చింది, చిన్న వ్యాపారాలు పెద్ద మార్కెట్లను పొందే అవకాశాన్ని కల్పించింది."

స్వామి రామ్‌దేవ్ దార్శనికత భారతదేశాన్ని ఆయుర్వేదంలో ప్రపంచ నాయకుడిగా మార్చడం కూడా. పతంజలి తన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లలో అందుబాటులో ఉంచడానికి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఆచార్య బాలకృష్ణ 330 కి పైగా పరిశోధనా పత్రాలు, 200 కి పైగా పుస్తకాలు ఆయుర్వేదానికి శాస్త్రీయ పునాదిని అందించాయి" అని పతంజలి ప్రకటించింది. "స్వామి రామ్‌దేవ్ సామాజిక వ్యవస్థాపకత , గ్రామీణాభివృద్ధి చొరవలు ఆయనను లక్షలాది మందికి ప్రియమైన వ్యక్తిగా చేశాయి. భారతదేశాన్ని ఆరోగ్యకరమైన, స్వావలంబన , సాంస్కృతికంగా సంపన్న దేశంగా మార్చడంలో స్వామి రామ్‌దేవ్ సహకారం గణనీయమైనది. ఆయన ప్రయత్నాలు ప్రజల జీవితాలను మెరుగుపరచడమే కాకుండా స్వదేశీ ఉత్పత్తులు , సహజ నివారణలను ప్రోత్సహించడం ద్వారా భారతదేశం ప్రపంచ గుర్తింపును కూడా బలోపేతం చేశాయి" అని పతంజలి పేర్కొంది.

# శ్రీవారిని దర్శించుకున్న స్వచ్ఛంద్రప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్

తిరుమల

స్వచ్ఛంద్రప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్ శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు.

అయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఏపీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీవారికి మొక్కులు చెల్లించుకునేందుకు తిరుమలకు వచ్చానని అన్నారు.

పది కాలల పాటు చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించాలని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్న. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొంది? అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందరికీ అందాలని కోరుకున్న.

రాష్ట్రప్రజల సంక్షేమం పాలన అందించే శక్తిని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పీఎం మోదీకి శక్తిని ఇవ్వాలని కోరుకున్నానని అన్నారు.

# తులసి మొక్కకు రాఖీ కట్టి పర్యావరణ ప్రేమ చాటిన చిన్నారి గానవి

హైదరాబాద్, అత్తాపూర్:

రక్షాబంధన్ పండుగను ప్రత్యేకంగా మార్చుతూ, అత్తాపూర్‌లో నివసించే చిన్నారి గానవి తన పర్యావరణ ప్రేమను చూపించింది. అన్నాచెల్లెళ్ల బంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పండుగను ఈసారి ఆమె భిన్నంగా జరుపుకుంది.ప్రకృతే మనకు నిజమైన రక్షకుడిగా భావించిన గానవి, తులసి మొక్కకు రాఖీ కట్టి, "పర్యావరణం మనను రక్షిస్తుంది, మనం కూడా పర్యావరణాన్ని రక్షించుకోవాలి" అనే సందేశాన్ని అందించింది. చిన్నారి తల్లిదండ్రులు రాజేష్, జ్యోతి తెలిపారు: "మా కూతురు చిన్న వయసులోనే ప్రకృతి ప్రాధాన్యతను అర్థం చేసుకుంది. తులసి మొక్కకు రాఖీ కట్టి పర్యావరణ సంరక్షణపై అవగాహన కలిగించాలని అనుకుంది" అని గర్వంగా చెప్పారు. ఈ వినూత్న ఆలోచనతో గానవి, రక్షాబంధన్ పండుగను కేవలం మానవ బంధాలకు మాత్రమే కాకుండా, ప్రకృతితోనూ బంధం కట్టే పండుగగా మార్చింది.

# మారని రైల్వే శాఖ తీరు

## గత అనుభవాల నుండి పాటలు నేర్చుకొని రైల్వే శాఖ

సికింద్రాబాద్

రైల్వే అధికారుల తీరు మారడంలేదు. చివరి నిమిషంలో ట్రైన్ ఫ్లాట్ ఫార్మ్ మారుస్తూ ప్రయాణికుల్ని ప్రమాదంలో నేడుతున్నారు. కుంభమేళా సందర్భంగా ఢిల్లీలో చివరి నిమిషంలో ప్లాట్ ఫారం నెంబర్ చేంజ్ చేస్తూ అనౌన్స్ చేయడంతో 18 మంది దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. శనివారం నాడు సికింద్రాబాద్ స్టేషన్ లో ఆదే లోపం మరోసారి పునరావృత్తం అయింది. హైదరాబాద్ టు న్యూ ఢిల్లీ తెలంగాణ ఎక్స్ ప్రెస్ ప్రతిరోజు ప్లాట్ ఫారం నెంబర్ వన్ 1 వస్తుంది. కానీ రైల్వే శాఖ చివరి నిమిషాల్లో ఫ్లాట్ ఫామ్ నెంబర్ 2కు మారుస్తూ అనౌన్స్ చేసింది. దాంతో తో రైల్ మిస్ అవుతుంది అన్న భయాందోళనలో ప్రయాణికులు నేరుగా రైల్వే ట్రాక్ మీదనుండి ప్లాట్ ఫామ్ కు ప్రమాదబరితంగా పరుగులు తీసారు. శనివారం నేడు రాఖీ పౌర్ణమి నేపథ్యంలో భారీగా ప్రయాణికులు వచ్చారు. చివరి నిమిషాల్లో ప్లాట్ఫారం నెంబర్ మార్చడం పట్ల ప్రయాణికులు మండిపడుతున్నారు. మహిళలు, వృద్దులు, పిల్లలతో వున్నావాళ్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# రాఖీ పండుగ నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హైదరాబాద్

రాఖీ పౌర్ణమి పర్వదిన సందర్భంగా ప్రయాణికులకు రవాణాపరమైన అసౌకర్యం కలుగకుండా తెలంగాణ ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ప్రతి ఏడాది మాదిరిగానే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచింది.

రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం రాఖీ పండుగకు నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో మాత్రమే 1.50 వరకు టికెట్ ధరలను సవరించింది. స్పెషల్ బస్సులు మినహా రెగ్యూలర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. ఈ నెల 11వ తేదీ వరకు నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రవే ఈ సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేసింది.

ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ.. రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీవో ప్రకారం స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను రాఖీ పండుగ సందర్భంగా సంస్థ సవరించింది.

# బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ సర్కార్ ఏం చేయబోతుంది..?

హైదరాబాద్, ఆగస్టు 9,

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. అధికార పార్టీనే కాదు బీఆర్ఎస్, బీజేపీతో పాటు ఇతర రాజకీయ పార్టీలు, కుల సంఘాలు కూడా ఈ అంశంపై తీవ్రంగా స్పందిస్తున్నాయి. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసే దిశగా అడుగులు వేశామని కాంగ్రెస్ చెబుతుండగా?. బీసీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఆరోపిస్తున్నాయి.స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లపై క్లారిటీ లేకపోవటంతో? స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కూడా ముందుకు సాగటం లేదు. చాలా రోజులుగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. మరోవైపు సర్కార్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే ఈసీ నోటిఫికేషన్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. కానీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తుండటతో ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగటం లేదు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం శాసనసభలో బిల్లును పాస్ చేసింది. ఈ బిల్లును కేంద్రానికి పంపింది. కానీ ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర పడలేదు. ఇదే విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు తాజాగానే ఢిల్లీ వేదికగా ధర్నా కూడా చేపట్టింది. సీఎం రేవంత్ తో పాటు కేబినెట్ లోని మంత్రులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇందులో పాల్గొన్నారు. ఇందుకు పలు రాజకీయపక్షాలు కూడా సంఘీభావం కూడా ప్రకటించాయి.రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లుకు ఆమోదముద్ర రాకపోవటంతో? బీసీ రిజర్వేషన్లపై ఏం చేయాలనే దానిపై సర్కార్ మల్లగుల్లాలను పడుతోంది. ప్రత్యామ్నాయాలపై ఫోకస్ చేస్తోంది. హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబరు మాసం ముగిసే లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో ముందున్న అన్ని మార్గాలను పరిశీలిస్తోంది. కోర్టు విధించిన గడువు దగ్గరపడటంతో? ఎన్నికల వేళ్లే విషయంపై ఆలోచన చేస్తోంది.జీఓ ద్వారా రిజర్వేషన్లు కల్పిస్తే ఎలా ఉంటుందనే దానిపై ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలుస్తోంది. ఇలా చేస్తే ఎవరైనా కోర్టుకు వెళ్తే ప్రక్రియకు బ్రేకులు పడే అవకాశం ఉంటుంది. ఇలా కాకుండా? పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు ఇవ్వాలని చూస్తోంది. ఇది కాకుండా?. ఎన్నికలను కొంత కాలం పాటు వాయిదా వేయవచ్చు. ఇలా చేస్తే స్థానిక సంస్థలకు కేంద్రం నుంచి వచ్చే నిధులు ఆగిపోయే ప్రమాదం ఉంటుంది. పైగా రిజర్వేషన్ల అమలు విషయంలో ఎలాంటి ప్రయోజనమూ ఉండదు.మొత్తంగా చూస్తే ఏ క్షణమైనా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సర్కార్ నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. అయితే ఇందులో రిజర్వేషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది..? బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తారా..? లేదా..? అనేది తేలాల్సి ఉంది..!

# కాళేశ్వరం బాధ్యత నిర్మాణ సంస్థదే

హైదరాబాద్, ఆగస్టు 9,

తెలంగాణ రాష్ట్రానికి జీవనాడిగా భావించిన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణంలో తీవ్రమైన లోపాలు, నిర్లక్ష్యం, ఆర్థిక అక్రమాలు చోటు చేసుకున్నట్లు జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలోని విచారణ కమిషన్ తేల్చింది. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బారేజీల నిర్మాణంలో జరిగిన ప్లానింగ్, డిజైన్, నిర్మాణ సంబంధిత తప్పిదాలపై సుమారు 15 నెలల పాటు జరిపిన విచారణ అనంతరం ఆయన నివేదికను ఇటీవల సమర్పించారు. ఈ నివేదిక ప్రకారం.. పనులపై ఎలాంటి బలమైన పర్యవేక్షణ లేకపోవడం, నాణ్యత నియంత్రణలో విఫలమయినట్లు.. నిర్మాణ సమయంలో అవకతవకలకు తావిచ్చే విధంగా నిర్వహణ సాగినట్లు తేలింది.ఘోష్ కమిషన్ ప్రధానంగా ఎల్అండ్‌టీ సంస్థపై తీవ్ర విమర్శలు చేసింది. మేడిగడ్డ బారేజ్‌లో 7వ బ్లాక్ పూర్తిగా దెబ్బతినడంతో, ఆ బ్లాక్ మరమ్మత్తు బాధ్యతను ఎల్అండ్‌టీనే భరిస్తుందని స్పష్టం చేసింది. తమ ఖర్చుతోనే దాన్ని పునరుద్ధరించాలని, అలాగే ఎల్అండ్‌టీకి ఎలాంటి పూర్తి ధృవపత్రాలు ఇవ్వకూడదని నివేదిక పేర్కొంది. ఇదే విధంగా అన్నారం, సుందిల్ల బారేజీలకు బాధ్యత వహించిన సంస్థలు కూడా డిఫెక్ట్ లైయబిలిటీ పీరియడ్‌లో తలెత్తిన లోపాలను తమ ఖర్చుతో పరిష్కరించాలని సూచించింది.కమిషన్ తన నివేదికలో వివిధ స్థాయిల్లో తలెత్తిన లోపాలను వెలుగులోకి తీసుకొచ్చారు. నిర్మాణాల్లో మౌలిక లోపాలు(బ్యారెజ్ పొడవు.. నది వెడల్పు విషయంలో) స్పష్టంగా ఉన్నాయని, ఇవి సాంకేతిక ప్రమాణాలను, నిబంధనలను ఖచ్చితంగా ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ముఖ్యంగా బ్యారేజీలు పెర్మియబుల్ ఫౌండేషన్ మీద డిజైన్ చేశారని, వాటిని స్టోరేజ్ స్ట్రక్చర్డ్‌గా వాడారని కమిషన్ పేర్కొంది. మోడల్ స్టడీలు లేకుండానే డిజైన్‌లను ఆమోదించారని, పనులపై టెక్నికల్ రివ్యూ చేపట్టలేదని తీవ్రంగా ఆక్షేపించారు.ప్రాజెక్టులో నాణ్యత నియంత్రణ పూర్తిగా అదుపుతప్పిన స్థాయిలో ఉందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా సెకంట్ పైల్స్ వంటి కీలక నిర్మాణ భాగాల్లో నాణ్యతా ప్రమాణాలు అనుసరించలేదని స్పష్టం చేశారు. పనుల అనంతరం ఎలాంటి నిర్వహణ జరగకపోవడం, ప్రీ-పోస్ట్ మాన్సూన్ తనిఖీలను పూర్తిగా విస్మరించడం, నిర్వహణ రిపోర్టులు లేకపోవడం? ఇవన్నీ ప్రొటోకాల్‌ను ధిక్కరించడమే అని కమిషన్ అభిప్రాయపడింది.ప్రాజెక్ట్ వ్యయం కూడా అంచనాలను మించి మూడు రెట్లు పెరిగింది. ప్రారంభంలో రూ. 38,500 కోట్లతో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్.. చివరకు రూ. 1,10,248.48 కోట్ల ఖర్చుతో ముగిసింది. ఇది 186 శాతం అధిక వ్యయంగా నమోదైంది. ప్లానింగ్ దశలో నుంచి ఆర్థిక నియంత్రణ పాటిస్తే.. పరిస్థితి ఇంత ఇబ్బందికరంగా మారేది కాదని ఘోష్ తెలిపారు. పలు పనులు పూర్తి కాకముందే ఆయా కంపెనీలకు పూర్తయినట్టు ధృవీకరణ పత్రాలు ఇచ్చారని, ఇది సిస్టమటిక్ ఫెయిల్యూర్‌గా రిపోర్ట్ ఇచ్చారు.ఇతర అంశాల్లో, ప్రాజెక్ట్‌కు సంబంధించి ఉన్న సీనియర్ ఇంజినీర్లు సీ మురళీధర్, బీ హరిరామ్, ఏ నరేందర్ రెడ్డి, టి శ్రీనివాస్, ఓంకార్ సింగ్‌లు కమిషన్ ముందు తప్పుల సమాచారం ఇచ్చినట్టు తేలింది. కొంతమంది నిజాలను దాచారని, కొంతమంది తప్పుడు వివరాలతో కమిషన్‌ను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించారని నివేదికలో పేర్కొనడం గమనార్హం.

# ఖైరతాబాద్ గణనాధుడికి 'విశ్వశాంతి'

హైదరాబాద్, ఆగస్టు 9

భాగ్యనగరంలో ఏటా అంగరంగ వైభవంగా జరిగే గణేష్ ఉత్సవాలకు కేంద్ర బిందువైన ఖైరతాబాద్ గణపతి మరోసారి భక్తులను దీవించడానికి సిద్ధమవుతున్నాడు. ఈఏడాది ఇక్కడ 71వ సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని 69 అడుగుల భారీ విగ్రహం దర్శనం ఇవ్వనున్నారు.ఈ ఏడాది విగ్రహానికి 'విశ్వశాంతి' అని పేరు పెట్టారు. ప్రపంచవ్యాప్తంగా శాంతిని పెంపొందించాలనే ఉన్నత లక్ష్యంతో ఈ విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. విగ్రహం తయారీ పనులు జూన్ 6న సర్వ ఏకాదశి సందర్భంగా మొదలయ్యాయి. ఆగస్టు 25 నాటికి పనులు పూర్తవుతాయని కమిటీ అంచనా వేస్తోంది. ఇప్పటివరకు 50%కి పైగా పనులు పూర్తయ్యాయని హైదరాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ సందీప్ రాజ్ తెలిపారు.ఈసారి ఖైరతాబాద్ గణపతి విగ్రహం పూర్తిగా మట్టితో తయారవుతోంది. గత కొన్ని సంవత్సరాల మాదిరిగానే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (ఖూఖ)ను పూర్తిగా పక్కన పెట్టారు. గుజరాత్ నుంచి తెప్పించిన మట్టి, జనపనార పొడి, గడ్డి, ఇసుక వంటి పర్యావరణహిత ముడిసరుకులను మాత్రవే ఉపయోగిస్తున్నారు. అలాగే, విగ్రహానికి రంగులద్దడానికి నీటిలో కరిగిపోయే ప్రత్యేక పెయింట్‌ను వాడుతున్నారు. దీనివల్ల నిమజ్జనం సమయంలో ఎలాంటి పర్యావరణ సమస్యలు తలెత్తవు.విగ్రహం తయారీ కోసం దాదాపు 200 మంది కళాకారుల బృందం నిరంతరం శ్రమిస్తోంది. ఇందులో చెన్నై నుంచి వచ్చిన 40 మంది శిల్పులు, ఒడిశా నుంచి వచ్చిన మట్టి కళాకారులు, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన వెల్డింగ్ బృందం, ఆదిలాబాద్‌కు చెందిన కళాకారులు



ఉన్నారు. ఒడిశాకు చెందిన మట్టి కళాకారుడు జోగారావు మాట్లాడుతూ, గత నాలుగేళ్లుగా ఖైరతాబాద్ గణపతి విగ్రహం తయారీలో తాను భాగస్వామిగా ఉన్నానని చెప్పారు.1954లో అప్పటి కార్పొరేటర్ దివంగత శంకరయ్య చేత మొదలైన ఈ ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు, ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా లక్షలాది భక్తులను ఆకర్షిస్తాయి. ఈసారి కూడా శాంతి, సామరస్యం, భక్తిని పెంపొందించేలా ఉత్సవాలు నిర్వహించడానికి కమిటీ విస్తృతంగా ఏర్పాట్లు చేస్తోంది.

# మంగళగిరి ఆడపడుచులు నా అక్కాచెల్లెళ్లు!

## మీ ఆశీస్సులతో మంగళగిరిని నెం.1గా తీర్చిదిద్దుతా

## మంత్రి లోకేష్ కు రాఖీలు కట్టిన మంగళగిరి మహిళలు

ఉండవల్లి: నాకు సొంతంగా అక్కలు, చెల్లెళ్లు లేరు, మంగళగిరి మహిళలు నా అక్కాచెల్లెళ్లు, ఈరోజు మీరంతా రాఖీకట్టి నాకు అందించిన ఆశీస్సులు కొండంత బలాన్నిచ్చాయి, మీ ఆశీస్సులతో మంగళగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నెం.1గా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. రాఖీపౌర్ణమిని పురస్కరించుకొని మంగళగిరి నియోజకవర్గానికి చెందిన మహిళలు ఉండవల్లి నివాసానికి వచ్చి మంత్రి లోకేష్ కు రాఖీలు కట్టి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... మంగళగిరి ఆడబిడ్డలందరికీ నేను ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. 2019 ఎన్నికల్లో నేను తొలిసారిగా పోటీచేసినపుడు 5,300 ఓట్లతో ఓటమిచెందాను. అప్పుడు నా రాజకీయ ప్రత్యర్థులు నన్ను విమర్శించడమేగాక కొడుకును గెలిపించుకోలేక పోయావంటూ చంద్రబాబు గారిని కూడా అవమానించారు. అయితే ఓడిన చోటే గెలవాలన్న పట్టుదలతో పనిచేశాను. సొంత నిధులతో 26 అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేసి మీ అందరి అభిమానాన్ని చూరగొన్నాను. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో మంగళగిరిలో నన్ను రాష్ట్రంలోనే 3వ అతిపెద్ద మెజారిటీతో గెలిపించి విమర్శించిన వారి నోళ్లు మూయించారు.

# ఎమ్మెల్యే తలసాని నివాసంలో రాఖీ వేడుకలు

హైదరాబాద్

అన్న, చెల్లెలు అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కి పలువురు రాఖీలు కట్టి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం వెస్ట్ మారేడ్ పల్లి లోని కార్యాలయం వద్దకు సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు, యువతులు చేరుకొని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.

రాఖీలు కట్టిన బ్రహ్మ కుమారీలు

రక్షాబంధన్ సందర్భంగా సికింద్రాబాద్ కు చెందిన బ్రహ్మ కుమారీలు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. వెస్ట్ మారేడ్ పల్లి లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి రాఖీ కట్టారు.

# పోలీసులకు రాఖీ పట్టిన హోంమంత్రి అనిత

విశాఖపట్నం

రక్తా బంధన్ సందర్భంగా విధి నిర్వాహణలో ఉన్న పోలీసులకు హోం మంత్రి అనిత రాఖీ కట్టారు. విశాఖ ఎం.వి.పి నుండి ఉషోదయ జంక్షన్ వరకు హోం మంత్రి ఆటోలో ప్రయాణించారు. ఆటో డ్రైవర్ యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. ఆటోడ్రైవర్ గిరీష్ కు రాఖీ కట్టారు. అనారోగ్యంతో బాధపడుతున్న కానిస్టేబుల్ కొర్లయ్యను పరామర్శించి,రాఖీ కట్టారు. కానిస్టేబుల్ కొర్లయ్యకు ధైర్యం చెప్పారు.

# ఖైదీలకు రాఖీలు కట్టిన మంత్రి అనిత

విశాఖపట్నం

రాఖీ పౌర్ణమి సందర్భంగా హోం మంత్రి అనిత విశాఖ కేంద్ర కారాగారానికి వెళ్లారు. యువ ఖైదీలకు రాఖీలు కట్టారు. 30 మంది ఖైదీలకు రాఖీ కట్టారు. గంజాయి రవాణాలో పట్టుబడిన ఖైదీలకు అవగాహన కల్పించారు. యువత మంచి,చెడులను తెలుసుకోవాలి. తెలిసి తెలియని వయస్సులో ఈజీమనీ కోసం ఆలోచిస్తే, జీవితాలు నాశనం అయిపోతాయి. బంగారు భవిష్యత్తులను నాశనం చేసుకోకండి. ఖైదీల జీవితాల్లో మార్పు రావాలి. బ్రతకడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నాం. వచ్చే సంవత్సరం మీరంతా మీ ఇంటి దగ్గర రాఖీపౌర్ణమి జరుపుకోవాలని మంత్రి అన్నారు. తరువాత ఆమె జైళ్లశాఖ అధికారులకు రాఖీలు కట్టారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి, మరొకరికి గాయాలు

బద్వేలు

బద్వేల్ పట్టణం సిద్ధవటం రోడ్డు ఫైర్ ఆఫీస్ వెనక సుమిత్రానగర్ లో నివాసముండే మహమ్మద్ (20) ఆకాష్ అనే ఇద్దరు యువకులు ఈరోజు ఉదయం బద్వేల్ నుండి బయలుదేరి నెల్లూరుకి వెళ్లారు, నెల్లూరులోని ఓ స్కూల్లో పిల్లలను చేర్పించి తిరిగి నెల్లూరు నుండి బద్వేల్ కి వస్తు ఉండగా మర్రిపాడు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొండంతో అక్కడికి అక్కడే మహమ్మద్ (20) అనే యువకుడు మృతి చెందారు, ఆకాస్ అనే యువకునికి గాయాలయ్యాయి, వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం పూర్తి వివరాలు తెలియవలసి ఉంది

# సైబర్ సెక్యూరిటీ రాజధానిగా హైదరాబాద్

## సీఐఓ కనెక్ట్ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు

దేశంలో సైబర్ సెక్యూరిటీకి రాజధానిగా హైదరాబాద్ ఎదుగుతోందని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమలు శాఖల మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. నగరంలోని పార్క్ హయత్ హోటల్‌లో శుక్రవారం జోహో కార్పొరేషన్‌కు చెందిన మ్యానేజ్ఇంజిన్ నిర్వహించిన షీల్డ్ ఎన్ఎక్స్ జీ 2025 ? సీఐఓ కనెక్ట్ సిరీస్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. తెలంగాణ దేశంలోనే మొట్టమొదటి సైబర్ సెక్యూరిటీ బ్యూరోను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింద ..నెలకు 1,200 కుపైగా కేసులు పరిష్కరిస్తోంది. అత్యధిక శిక్ష విధింపు రేటు నమోదు చేసిన ఈ బ్యూరోను జిల్లాల స్థాయికి విస్తరిస్తున్నాం. స్టార్టప్‌లకు, గ్రామీణ ప్రాంత యువతకు సైబర్ మద్దతు అందించేందుకు చర్యలు చేపట్టాం'అని అన్నారు. జోహో సంస్థ తీసుకుంటున్న గ్రామీణ అభివృద్ధి మార్గాన్ని ఈ సందర్భంగా మంత్రి ప్రశంసించారు. పట్టణ?గ్రామీణ మధ్య సాంకేతిక అంతరాన్ని తగ్గించాలన్న దిశగా ఇది చక్కటి ఉదాహరణ అన్నారు.

# హైదరాబాద్ నగరానికి ఏమైంది

హైదరాబాద్, ఆగస్టు 9

ఎంత మంది పాలకులు మారినా ఏమున్నది గర్వకారణం.. ఒక్క భారీ వర్షానికే హైదరాబాద్ మునుగుతున్నది నిజం అని హైదరాబాదీలంతా నెత్తినోరు కొట్టుకుంటున్న పరిస్థితి. విశ్వనగరం అంటూ నాలాలు మూసేసి.. చెరువులను కబ్జా చేసి.. ఎక్కడికక్కడ నీటి ప్రవాహాలకు అడ్డంగా నిర్మాణాలు ఇల్లు కట్టడంతో చిన్న వానకే హైదరాబాద్ మునుగుతోంది. భారీ వర్షాలకు ఇక హైదరాబాద్ అంతా జలమయం అవుతోంది.హైదరాబాద్ నగరాన్ని మరోసారి భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. నగరవ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమవుతోంది. ముఖ్యంగా మూసీ నది పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు అధికారులు హై అలెర్ట్ జారీ చేశారు.వరుసగా కురుస్తున్న వర్షాలతో హిమాయత్‌సాగర్ జలాశయంలోకి భారీగా వరద నీరు చేరుతోంది. జలాశయం పూర్తిగా నిండటంతో అధికారులు గేట్లు ఎప్పుడైనా తీయొచ్చని హెచ్చరికలు జారీ చేశారు. దీనివల్ల మూసీ నదిలోకి నీటి ప్రవాహం మరింతగా పెరగనుంది. దీంతో మూసీ పరివాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలు ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మూసీ పరివాహక ప్రాంతమైన చంద్రాయణగుట్ట, ఎగ్జిబిషన్ గ్రౌండ్, అంబర్‌పేట, మలక్‌పేట, ముసరాంబాగ్, చాదర్ ఘాట్, కాచిగూడ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అత్యంత జాగ్రత్త వహించాలన్న విజ్ఞప్తి చేశారు. అవసరమైతే తాత్కాలికంగా సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించారు.ప్రజలకు ఎలాంటి అత్యవసర సహాయం అవసరమైనా వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 040-21111111 ను సంప్రదించవచ్చని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. ఈ నంబరుకు ఫోన్ చేస్తే వరద ప్రభావిత ప్రాంతాలకు సహాయక బృందాలు చేరుకొని తక్షణ సహాయం అందిస్తాయి.

? ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

ముంపు ప్రాంతాల్లో ఉండే వారు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. విద్యుత్ సరఫరా పరికరాల నుండి దూరంగా ఉండాలి. ప్రభుత్వ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి. పిల్లలను ఒంటరిగా బయటకు పంపకూడదు. అవసరమైతే ఎలాంటి సంకోచం లేకుండా హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలిహైదరాబాద్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మీ జాగ్రత్తే మీ రక్షణ. సహాయానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది.

# మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి రాఖీ కట్టిన మంత్రి సీతక్క

## అన్న చెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతి రూపం రాఖీ పండుగ అన్న మంత్రి

హైదరాబాద్:

రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని శనివారం నాడు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క..రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కి మంత్రుల నివాస సముదాయంలో ఆయనకు రాఖీ కట్టారు. ఒకరికొకరు స్వీట్స్ తినిపించుకుని రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సీతక్క తనకు సొంత సోదరి లాగా అని మంత్రి తన ఆప్యాయతను వ్యక్తం చేశారు. అన్న చెల్లెళ్ల,అక్క తమ్ముళ్ళ అని అనుబంధాన్ని చాటే రాఖీ పండుగ ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి రాష్ట్ర ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపాలి

## ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

అమరావతిఅడవి బిడ్డలకు సకల సౌకర్యాలు అందాలి. ఆ లక్ష్యం దిశగా అడవి తల్లి బాట అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. డోలీ మోతలు లేని గిరిజన గ్రామాలను కూటమి ప్రభుత్వం సృష్టిస్తుంది. ప్రకృతి ఒడిలో జీవిస్తూ.. నిరంతరం పర్యావరణాన్ని పరిరక్షిస్తున్న నా ఆదివాసీ సోదర, సోదరీమణులకు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలని అన్నారు.

# మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో రాఖీ పండుగ కోలాహలం

హైదరాబాద్:

రాఖీ పౌర్ణమి వేళ హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్ లోని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో రాఖీ పండుగ సందడి నెలకొంది.ఉదయం నుండి రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన మహిళలతో మంత్రి అధికారిక నివాసం కోలాహలంగా మారింది. పలువురు మహిళలు రాఖీ కట్టి మంత్రి పట్ల తమ అభిమానాన్ని తెలియజేశారు.

# కవిత దారెటు

హైదరాబాద్, ఆగస్టు 9

బీఆర్ఎస్ పార్టీలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖ లీక్ వ్యవహారం అనేక మలుపులు తిరుగుతోంది. కేసీఆర్ చుట్టు దెయ్యాలు ఉన్నాయంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు? హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. లేఖను లీక్ చేసిన వారి పేర్లను బయటిపెట్టాలని? పార్టీని ప్రక్షాళన చేయాలంటూ కూడా కామెంట్స్ చేస్తున్నారు. ఇదే సమయంలో పార్టీకి దూరంగా ఉంటున్న కవిత?. జాగృతి సంస్థ పేరుతో యాక్టివ్ గా కార్యక్రమాలు చేపడుతున్నారువరంగల్ సభ తర్వాత కవిత? పార్టీ అధినేత కేసీఆర్ కు రహస్య లేఖ రాశారు. అయితే ఈ లేఖ బయటికొచ్చింది. ఈ విషయాన్ని కవిత తీవ్రంగా పరిగణించారు. పార్టీలోని కొంత మంది కోవర్టులు?లేఖను బయటపెట్టారని ఆరోపించారు. కేసీఆర్ దేవుడని.. ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. అప్పట్నుంచి ఆమె పార్టీ కార్యాలయానికి కాదు.. వ్యవహారాలకు కూడా దూరంగా ఉంటున్నారు.లేఖ లీక్ తర్వాత? పార్టీపై కూడా కవిత కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. అప్పటి నుంచి ఆ దెయ్యాలు ఎవరు అంటూ కవితను అడుగుతుండగా?. సమయం వచ్చినప్పుడు బయటపెడతానంటూ ఆమె దాటవేస్తూ వచ్చారు. కట్ చేస్తే?.ఆమె పూర్తిగా పార్టీకి దూరంగా ఉంటూ కార్యక్రమాలు చేస్తున్నారు. జిల్లాల వారీగా పర్యటిస్తున్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నేతలు ఎక్కడ కూడా పాల్గొనటం లేదు. కేవలం జాగృతి కార్యకర్తలు, అనుచరులు మాత్రమే ముందు వరుసలో ఉంటున్నా?.కవిత గత కొంతకాలంగా బీసీల అజెండాతోనే ముందుకెళ్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా జాగృతి కమిటీలను కూడా బలపేతం చేస్తున్నారు. ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్స్ ను కూడా స్వాగతించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నేతలు కూడా తన దారికే వస్తారంటూ కామెంట్స్ చేశారు. తాజాగా ఇందిరాపార్క్ వద్ద దీక్షను కూడా చేపట్టారు. బీసీల రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేస్తున్నారు.ఇక ఇటీవలే పార్టీకి చెందిన సీనియర్ నేత జగదీశ్ రెడ్డిపై కూడా కవిత



తీవ్ర ఆరోపణలు చేశారు. లిల్లీపుట్ అంటూ ఎద్దేవా చేశారు. నల్గొండ జిల్లాలో పార్టీని నాశనం చేసిన వ్యక్తి అంటూ మాట్లాడారు. కేసీఆర్ లేకుంటే జగదీశ్ రెడ్డి ఎక్కడ ఉండే వారిని ప్రశ్నించారు.అంతేకాకుండా రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో యువ నాయకుడిని ఉద్దేశిస్తూ కూడా కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ కూడా సీరియస్ గానే ఉంది. సీనియర్ నేత అయిన జగదీశ్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది.మొత్తంగా బీఆర్ఎస్ కు దూరంగా ఉంటున్న కవిత?. జాగృతి జెండాతోనే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే హైదరాబాద్ లో ఆఫీస్ ప్రారంభించిన కవిత? రాబోయే రోజుల్లో సంస్థను మరింత బలోపేతం చేస్తారని తెలుస్తోంది. అయితే ఆమె కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో కూడా ఉన్నారన్న విశ్లేషణలు, అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే కవిత మాత్రమే? తాను బీఆర్ఎస్ కు నష్టం చేకూర్చే ప్రయత్నాలు చేయనంటూ కూడా చెబుతూ వస్తున్నారు.లేఖ లీక్ నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలను బీఆర్ఎస్ అధినాయకత్వం అన్నింటిని సమగ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కవితపై చర్యలు తీసుకునే విషయాన్ని కూడా పరిశీలించే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగానే అలా జరిగితే కవిత.. నెక్ట్ ఏం చేస్తారనేది టాక్ ఆఫ్ ది పాలిటిక్స్ గా మారింది..! ఇలా కాకుండా? కవిత యూటర్న్ తీసుకొని కేసీఆర్ అడుగుజాడల్లోనే నడుస్తారా అన్న చర్చ కూడా ఓవైపు నుంచి వినిపిస్తోంది..!

# ప్రమాదంలో సింగూరు రిజర్వాయర్

హైదరాబాద్, ఆగస్టు 9

హైదరాబాద్‌కు తాగునీరు అందించే సింగూరు రిజర్వాయర్ ప్రమాదంలో పడింది. డ్యామ్ పైభాగంలో రాతి కట్టడం దెబ్బతినడంతో వెంటనే మరమ్మతులు చేపట్టాలని డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ హెచ్చరించింది. మరమ్మతులు చేయకపోతే డ్యాం తెగిపోయే ప్రమాదం ఉందని, దిగువన ఉన్న బ్యారేజీలు కూడా దెబ్బతినే అవకాశం ఉందని కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పిట్టగోడకు చీలిక ఏర్పడిందని.. ఒకవైపు గోడ వంగిందని ప్యానెల్ వివరించింది. కట్ట పునాదిని వెంటనే గ్రౌటింగ్ చేయాలని ప్రభుత్వానికి సూచించింది. ఆ వివరాలు.. రాజధాని హైదరాబాద్ నగరానికి తాగు నీరు.. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలకు తాగు, సాగు నీరు అందించే సింగూరు రిజర్వాయర్ ప్రమాదంలో పడింది. ఆనకట్టకు వెంటనే మరమ్మతులు చేయకపోతే ఏ క్షణమైనా డ్యాం తెగిపోయే ప్రమాదం ఉందని డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ హెచ్చరికలు జారీ చేసింది. డ్యామ్ పైభాగంలో రాతి కట్టడం దెబ్బతిన్నదని.. దీనికి వెంటనే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్యానెల్ సూచించింది. పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.1976లో సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూరులో సింగూరు రిజర్వాయర్ నిర్మాణం ప్రారంభించారు. దీని సామర్థ్యం 29.91 టీఎంసీలు. 1989లో ఈ ఆనకట్ట నిర్మాణం పూర్తయింది. హైదరాబాద్ తాగునీటి కోసం దీని నుంచి 6.96 టీఎంసీలు కేటాయించారు. అలానే డ్యాం పరిసర ప్రాంతాల్లో సాగునీటి అవసరాలు తీర్చడానికి, మంజీరా నదిలో పూడికను తగ్గించడానికి ఈ ప్రాజెక్టును నిర్మించారు.డ్యామ్ రిహాబిలిటేషన్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు (డీఆర్ఐపీ) కింద సింగూరు ప్రాజెక్టు ఉంది. ఇదిలా ఉంటే చైర్మన్ అశోక్‌కుమార్ గంజు సారథ్యంలో ఆనకట్ట భద్రత సమీక్షా కమిటీ జూన్ 23న డ్యామ్‌ను పరిశీలించింది. ప్రాజెక్టు పరిస్థితిని వివరిస్తూ, వెంటనే చేపట్టాల్సిన మరమ్మతు పనులను తెలియజేస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది.వాస్తవానికి సింగూరు రిజర్వాయర్ డిజైన్ ప్రకారం దీనిలో 517.8 మీటర్ల వరకు నీటిని నిల్వ చేయాలి. కానీ మిషన్ భగీరథ



అవసరాల కోసం 520.50 మీటర్ల వరకు నీరు నిల్వ చేయడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు 2017 అక్టోబరు 30న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అప్పటి నుంచి కూడా సింగూరు రిజర్వాయర్‌లో అనుమతించిన 520 మీటర్లకు మించి.. 522 మీటర్ల కన్నా ఎక్కువగానే నీటిని నిల్వ చేస్తున్నారని కమిటీ గుర్తించింది. దీనివల్లే జలాశయం దెబ్బతిన్నదని తేల్చింది. కట్ట దెబ్బతినడమే కాకుండా మరమ్మతులకు అవకాశం లేకుండా పోయిందని ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో వెల్లడించింది.దెబ్బతిన్న రాతి కట్టడాన్ని వెంటనే సరిచేయకపోతే ఆనకట్టుకు ఏ క్షణంలోనైనా గండి పడే అవకాశం ఉందని కమిటీ హెచ్చరించింది. ఒకవేళ అలా జరిగితే, దిగువన ఉన్న మంజీరా బ్యారేజీ, నిజాంసాగర్‌తోపాటు చెక్‌డ్యామ్‌లు కూడా దెబ్బ తింటాయని పేర్కొంది. ఆనకట్టకు రక్షణగా ఉన్న పిట్టగోడకు నిలువునా చీలిక వచ్చిందని, ఒకవైపు గోడ వంగి ఉందని వివరించింది. కట్ట పునాదిని వెంటనే గ్రౌటింగ్ చేయాలని అభిప్రాయపడింది.ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి.. వర్షాకాలం అయిపోగానే మరమ్మతులు చేపట్టాలని కమిటీ సూచించింది. కట్ట మరమ్మతులకు అవసరమైన నిధులు డ్రిప్ నుంచి రాకపోవచ్చని, రాష్ట్ర ప్రభుత్వమే నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని తెలిపింది.

# మేడారానికి రైలు దిశగా అడుగులు

వరంగల్, ఆగస్టు 9,

మేడారానికి రైలు మార్గం వేయాలని.. అది కూడా మణుగూరు నుంచి వేయాలని ఎంపీ ఈటెల రాజేందర్ కేంద్రానికి రిక్వెస్ట్ చేశారు. 15 ఏళ్ల నుంచి ఈ ప్రతిపాదన ఉందని.. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పందించి నిర్ణయం తీసుకోవాలని ఈటెల కోరారు. ఈ రైల్వే లైను అందుబాటులోకి వస్తే.. విజయవాడ, ఖమ్మం, కొత్తగూడం నుంచి వచ్చే వారికి ప్రయాణ సమయం, ఖర్చులు తగ్గే అవకాశం ఉందంటున్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర.. తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి గాంచింది. రెండేళ్లకు ఒకసారి జరిగే వన దేవతల జాతరకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక.. పక్క రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. సుమారు కోటికి మందికి పైగా భక్తులు.. తల్లులను దర్శించుకుని.. మొక్కులు చెల్లించుకుంటారు. నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జాతర నిర్వహిస్తారు. ఈ వేడుక కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్ కూడా కేటాయిస్తుంది. ఈక్రమంలో తాజాగా పార్లమెంటు సమావేశంలో మేడారం జాతర గురించి కీలక అంశం చర్చకు వచ్చింది. మేడారానికి రైలు మార్గం మరోసారి తెర మీదకు వచ్చింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్.. మేడారానికి రైలు మార్గం వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అయితే ఈ ప్రతిపాదన ఇప్పటిది కాదు.. గత 15 ఏళ్ల నుంచి సాగుతుంది. భద్రాద్రి జిల్లా మణుగూరు నుంచి తాడ్వాయి(మేడారం) మీదుగా రాఘవపురం వరకు కొత్త రైల్వే లైను వేయాలని ఈటల రాజేందర్ కోరారు. బుధవారం నాడు పార్లమెంట్‌లో 377 నిబంధన కింద ఈ అంశాన్ని ఆయన ప్రస్తావించారు. అలానే మేడారాన్ని జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని రిక్వెస్ట్ చేశారు.మేడారానికి రైల్వే లైను ప్రతిపాదన గత 15 ఏళ్లుగా సాగుతోంది. కేంద్ర ప్రభుత్వం గనుక దీనికి అనుమతిస్తే.. వరంగల్‌లో ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాల అభివృద్ధితో పాటుగా సింగరేణి నుంచి బొగ్గు, ఇతర అటవీ ఉత్పత్తులను రవాణా చేయడం సులభం అవుతుంది. దీనితో పాటుగా వరంగల్, కాజీపేట రైలు మార్గాలు సైతం మణుగూరుకు కలిసే అవకాశం ఉంది.

పైగా ఈ రైల్వే లైను ప్రతిపాదన ఆమోదం పొందితే మణుగూరు నుంచి తాడ్వాయి వరకు ఇకో టూరిజం అభివృద్ధికి బాటలు పరిచినట్లు అవుతుంది.ఈ రైల్వే లైను అందుబాటులోకి వస్తే.. ఇతర రాష్ట్రాల నుంచి మేడారం జాతరకు వచ్చే భక్తులకు సమయం, ఖర్చులు తగ్గుతాయి. ఖమ్మం, కొత్తగూడెం, విజయవాడ నుంచి జాతరకు వచ్చే భక్తులు వరంగల్ నుంచి కాకుండా.. డైరెక్ట్‌గా మణగూరు నుంచి మేడారం వేళ్లే అవకాశం లభిస్తుంది. ఈ రైల్వే లైను కోసం కేంద్రం సర్వే జరపగా.. మూడు మార్గాలను ప్రతిపాదించారు. దీనిలో ఏదో ఒకదానికి కేంద్రం ఆమోదం తెలిపే అవకాశం ఉందంటున్నారు. ఈ రైల్వే లైన్‌కున్న ప్రధాన అడ్డంకి ఏదంటే.. అటవీ శాఖ నుంచి భూములు సేకరించడమే అంటున్నారు అధికారులు.

# రేవంత్ కొత్త రాజకీయం...

హైదరాబాద్, ఆగస్టు 9,

జల్సా సినిమాలో డైలాగ్ ఉంటుంది గుర్తుందా.. శత్రువును ఓడించడం అంటే చంపడం కాదు.. గెలవడం.. చాలామందికి ఇది అర్థం కాదు గాని.. దీనిని అర్థమయ్యేలా నిరూపించి చూపిస్తున్నాడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్. " కెసిఆర్ ను చర్లపల్లి జైలుకు పంపించడం ఎందుకు.. ఆయనకు ఫామ్ హౌస్ లో ఉండడమే పెద్ద శిక్ష. నన్ను ఓ చిన్న స్థాయి లీడర్ అని అనుకున్నాడు. తొక్కి తొక్కి అధపాతాళానికి పంపించానని అనుకున్నాడు. చివరికి నా చేతిలోనే ఆయన ఓడిపోయాడు. ఇంతకు మించిన శిక్ష ఇంకేం ఉంటుందని" రేవంత్ ఇటీవల వ్యాఖ్యానించడం విశేషం. తెలంగాణ ముఖ్యమంత్రి మాట్లాడిన మాటల ద్వారా కేసీఆర్ ను జైలుకు పంపించే ఉద్దేశం లేదని తెలుస్తోంది. అలాంటి ఉద్దేశం లేని పక్షంలో కమిషన్లను ఎందుకు ఏర్పాటు చేశారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.గొర్రెల పథకం, కాళేశ్వరం, గత ప్రభుత్వం చేపట్టిన వివిధ పనులపై రేవంత్ కమిషన్లను ఏర్పాటు చేశారు. విచారణ అధికారులు ఇప్పటికే కాళేశ్వరం, గొర్రెల కుంభకోణం లో తుది నివేదికలు ఇచ్చారు. ఇందులో అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి ఓ ఎస్ డి గా పనిచేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాళేశ్వరం కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన మురళీధర్, హరి రామ్ నాయక్ ఏసీబీ అదుపులో ఉన్నారు.. ఇంకా ఈ కేసులో మరిన్ని తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని సాక్షాత్తు గులాబీ అధిపతి అన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇంత మందిని అరెస్టు చేస్తున్నప్పటికీ కెసిఆర్ జోలికి తెలంగాణ ముఖ్యమంత్రి వెళ్లకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. "ప్రత్యర్థి కుంగి కృశించి.. నన్ను వదిలేయ్.. ఈ ఓటమిని నేను తట్టుకోలేను. ఈ జాలిని నేను భరించలేను.. అనేతీరుగా కెసిఆర్ విషయంలో రేవంత్ వ్యవహరిస్తున్నారని" రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.రేవంత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు.. అంతకుముందు టిడిపి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కెసిఆర్ టార్గెట్ చేసి వేధించారు. ఇబ్బంది పెట్టారు. పర్యాయాలు జైలుకు కూడా తరలించారు. చివరికి ఆయన కూతురు వివాహం ఉన్నప్పటికీ కేసీఆర్ వదిలిపెట్టలేదు. తనను అంతటి ఇబ్బందులకు గురిచేసిన సమయంలో రేవంత్ అనేక పర్యాయాలు కేసిఆర్ ను జైలుకు పంపిస్తానని హెచ్చరికలు జారీ చేశారు. గజ్వేల్ లో కూడా తొడగొట్టి ఇదే తీరుగా సవాల్ కూడా విసిరారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ వ్యవహార శైలి ఒక్కసారిగా మారిపోయింది. కెసిఆర్ విషయంలో రేవంత్ జాలి ప్రదర్శిస్తున్నారు. ఉదారతను చూపిస్తున్నారు. అదుపులోకి తీసుకునే అవకాశం వచ్చినప్పటికీ.. ఆ దిశగా అడుగులు వేయడం లేదు.రేవంత్ చేస్తున్న పని జాలి కాదని.. మానసికహింస అని తెలుస్తోంది. వాస్తవానికి కెసిఆర్ 2023 ఎన్నికల ఫలితాలను జీర్ణించుకోలేకపోయారు. తన రాజీనామా లేఖను గవర్నర్ కు ఇవ్వడానికి కూడా ఇష్టపడలేదు. రేవంత్ ముఖ్యమంత్రి కావడాన్ని కెసిఆర్ అసలు జీర్ణించుకోలేకపోయారు. అయినప్పటికీ రేవంత్ కెసిఆర్ ఆసుపత్రిలో ఉన్నప్పుడు ఆయన క్షేమం కోరి పరామర్శించారు.. ప్రభుత్వపరంగా ఆయన ఆరోగ్యాన్ని పర్యవేక్షించారు. రేవంత్ చేతిలో అధికారం ఉన్నప్పటికీ ప్రత్యర్థుల విషయంలో ఏమాత్రం దూకుడు కొనసాగించడం లేదు. ప్రతీకారం తీర్చుకోవడం లేదు.. కాకపోతే ప్రత్యర్థులను ఎలా హింసించాలో అలానే హింసిస్తున్నారు. అధికారం ఉంది కదా అని ఇష్టానుసారంగా అరెస్టు చేయడం లేదు. ఎందుకంటే అలా అరెస్టులు చేస్తే ప్రజల్లో సానుభూతి పెరుగుతుంది. అందువల్లే ప్రత్యర్థులపై మానసికంగా పగ తీర్చుకుంటున్నారు రేవంత్. రాజకీయాలలో సరికొత్త స్టైల్ అవలంబిస్తున్నారు.

# శ్రీవారి సేవలో మంత్రి వీరాంజనేయస్వామి

తిరుమల

ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి శనివారం నాడు శ్రీవారిని దర్శించుకున్నారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రజలకు సంక్షేమం అందించేలా శ్రీవారి ఆశీస్సులు ఉండాలని అన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం సంక్షేమానికి పెద్ద పీట వేశాం. ఉస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వెల్ఫేర్ లకు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుంచి రూ. 310 కోట్ల నిధులు కేటాయించాం. రూ. 100 కోట్లతో కొత్త భవనాలు, హాస్టల్ నిర్మాణాలు, స్వచ్ఛంధ్ర మిషన్ లో భాగంగా రూ. 51 కోట్లతో టాయిలెట్ల నిర్మాణం చేపట్టాం. రూ. 143 కోట్లతో హాస్టల్స్ భవనాల మరమత్తులు చేయించామని అన్నారు.ఇంత పెద్ద మొత్తంలో ఏ ప్రభుత్వం చేయలేదు . రాజకీయం చేసే విధంగా వైసీపీ కుట్రలు చేస్తోంది? హాస్టల్స్ లో పిల్లలు నేలపై పడుకుంటున్నారని మొసలి కన్నీళు వైసీపీ పెడుతోంది. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం పాలనలో మెరుగైన సౌకర్యాలు ఎందుకు చేయలేదు. గత పాలనకన్నా సౌకర్యాలు మెరుగుపరచడం, నాణ్యమైన బియ్యాన్ని విద్యార్థులకు అందిస్తూ?పౌష్టిక ఆహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

## స్వర్ణరథంపై శ్రీ పద్మావతి అమ్మవారి కటాక్షం

తిరుపతితిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వరలక్ష్మి వ్రతం సందర్భంగా స్వర్ణరథంపై ఆశీనులై భక్తులను కటాక్షించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తన్మయత్వంతో నాలుగుమాడ వీధుల్లో రథాన్ని లాగారు. కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు.స్వర్ణ రథోత్సవం లో ఈవో జె. శ్యామల రావు దంపతులు, జేఈవో వి వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, సూపరింటెండెంట్ శ్రీవాణి, విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

# రాష్ట్రంలో ప్రభుత్వ భవనాలకు సోలార్ పవర్ ప్లాంట్లు..






కరీంనగర్ ప్రతినిధి,ఆగస్టు 9(భారత శక్తి):ఇందిరా సౌర గిరిజల వికాసం వేగవంతం చేయాలనీ,ఏజెన్సీ ప్రాంత అధికారులు ఆర్ ఓ ఎఫ్ ఆర్ భూముల వివరాలు పంపాలని, సోలార్ విద్యుత్ ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని,సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ విధాన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం సచివాలయంలో ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ ఓ ఎఫ్ ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, సిఎండి ముషారఫ్ ఫారుకి, రెడ్కో సిఎండి అనిలా తదితరులు పాల్గొన్నారు.అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లు హైదరాబాద్ కు పంపాలని డిప్యూటీ సీఎం సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ కూడా ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ లో ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాదు నుంచి పంపిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. కలెక్టర్ కార్యాలయాల్లో మంచి డిజైన్లు ఉంటే ఆయా కలెక్టర్లు హైదరాబాద్ కు పంపవచ్చని డిప్యూటీ సీఎం సూచించారు.గ్రామపంచాయతీ బిల్డింగ్ మొదలుకొని సెక్రటేరియట్ వరకు,రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేసి,పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి కలెక్టర్లు హైదరాబాద్ కు పంపాల్సిన వివరాలకు సంబంధించి ఒక ప్రశ్నావళిని పంపిస్తున్నాం, అందులో అన్ని వివరాలు నమోదు చేసి వారం లోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయానికి పంపాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.ప్రభుత్వ భవనాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు , ఉన్నత విద్యాసంస్థల భవనాలపై కూడా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని,అందుకు సంబంధించిన భవనాల వివరాలు పంపాలని కలెక్టర్లను ఆదేశించారు.నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ పరిధిలో పెద్ద ఎత్తున ఖాళీ స్థలాలు ఉన్నాయి, వాటి వివరాలు సైతం పంపాలని కలెక్టర్లకు డిప్యూటీ సీఎం సూచించారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ ఓ ఎఫ్ ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల భూములను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసింది, ఈ భూముల్లో నల్లమల డిక్లరేషన్ కింద ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్టు డిప్యూటీ సీఎం కలెక్టర్లకు వివరించారు. నల్లమల డిక్లరేషన్ లో భాగంగా ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గం లో ప్రారంభించాం,ఈ నెలలోనే ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.కలెక్టర్లు ఎక్కడ అలసత్వం ప్రదర్శించకుండా వారంలోగా వివరాలు పంపండి, ఈ విషయాల్లో ఎలాంటి సందేహాలు ఉన్న విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఎస్పీడీసీఎల్, సీఎండీలు ని సంప్రదించాలని డిప్యూటీ సీఎం కలెక్టర్లను ఆదేశించారు.కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మా విశ్వరూపం చూపిస్తాం..




కరీంనగర్ ప్రతినిధి,ఆగస్టు 9 (భారత శక్తి):ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ,తమను నట్టేటముంచే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర ఎంప్లాయిస్ జెఏసి ఛైర్మన్, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ ఆవేదన వ్యక్తం చేసారు. తమ సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 15 తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు యుద్ధానికి సిద్దం కావాలని పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్ టీఎన్జీవో కార్యాలయంలో జిల్లా జె ఎ సి ఛైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,నెలకు రూ.700 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని చెప్పి, కాంట్రిబ్యూషన్ ఆధారిత ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ప్రవేశ పెడుతామన్న ప్రభుత్వం దాని ఊసే ఎత్తడం లేదనీ గుర్తుచేశారు.జీపీఎఫ్ బిల్లులు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించలేదని, ఇన్సూరెన్స్ బిల్లులు, రిటైర్మెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉండటం మూలంగా తమ పిల్లల పెళ్లిళ్లు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు.

అప్పులు తీర్చలేక మానసిక వేదనకు గురవుతున్నామని చెప్పారు. దాచుకున్న డబ్బులను ఇతర సంక్షేమ పథకాల కోసం వాడటం ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.పిఆర్సి గురించి ఎటువంటి ప్రస్తావన లేకపోవడం, సిపిఎస్ రద్దు, ఓపిఎస్ పునరుద్ధరణ, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఉన్నా, ఈ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత, ఉద్యోగుల బ్రతుకులు ఆగమైనాయని, గత ప్రభుత్వంలో ఉద్యోగులపై భౌతిక దాడులు జరిగిన ప్రభుత్వ చర్యలు శూన్యమని తెలియజేశారు. పెట్రోల్ దాడులు, ప్రజలకు ప్రభుత్వ ఉద్యోగులకు మధ్య వైశాల్యాలు సృష్టించి ఉద్యోగులపై దాడులకు ప్రేరేపించడం జరుగుతుందన్నారు.కొంతమంది రాజకీయ నాయకులు ఐఏఎస్, అధికారులపై పరుష పదజాలంతో మాట్లాడుతూ హీరోలుగా ఫీల్ అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రభుత్వాధికారులను తిడితే హీరోలు కాదు, జీరోలు అవుతారని హెచ్చరించారు.ఏ ప్రభుత్వం వచ్చినా, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేది మా ప్రభుత్వ ఉద్యోగులే అని గుర్తుచేశారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తాళ్లు వేసి పనిచేయాల్సిన పరిస్థితులు రావడం, ఉద్యోగుల గౌరవాన్ని దెబ్బతీసే చర్యలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఉద్యోగులను అవినీతిపరులు, అక్రమార్కులుగా ముద్ర వేయడం అసహనీయమైనదనీ చెప్పారు. కమిటీలతో కాలయాపన వద్దనీ, ఇదివరకే మంత్రుల, అధికారుల కమిటీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ఉదాసీన వైఖరి చూపిస్తే ఈనెల 15 తర్వాత మా విశ్వరూపం చూపిస్తామని, మా సహనాన్ని ప్రభుత్వం పరీక్షించవద్దనీ హెచ్చరించారు. ఈనెల ఆగస్టు 15 తర్వాత యుద్ధానికి ప్రభుత్వ ఉద్యోగులు సన్నద్ధంగా ఉండాలనీ పిలుపిచ్చారు. ఈ సమావేశంలో కిరణ్ కుమార్ రెడ్డి, వంటల రవీందర్ రెడ్డి, రాజేశ్వరరావు, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, సుగుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ విద్యార్థులను ఇబ్బంది పెడ్తున్న ప్రైవేటు స్కూల్ యాజమాన్యం..

ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో (భారత శక్తి)ఆగస్టు 9:నిర్మల్ జిల్లా బైంసా పట్టణంలోని ఓ ప్రైవేటు హైస్కూల్లో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తల్లితండ్రులు ప్రైవేటు స్కూల్ యాజమాన్యంతో గొడవకు దిగారు. లక్షల్లో ఫీజులు తీసుకుంటు యాజమాన్యలే పుస్తకాలు యూనిఫామ్ లు అమ్ముతున్నారని అన్నారు.విద్యార్థులపై శ్రద్ధ చూపించడం లేదని తల్లిదండ్రులు ఆవేదన చెందారు.భైంసా పట్టణానికి చెందిన శ్రీనివాస్ కూతురు అయిన సాయశ్రి నాల్గవ తరగతిలో చదువుతుంది. ప్రతీ రోజు తన కూతురుని ఉదయం సమయానికి పాఠశాలకు విడిచిపెట్టినా గైర్హాజరు వేస్తు విద్యార్థినిని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.పిల్లల గురించి అడగడానికి వచ్చిన తల్లిదండ్రులకు కనీసం మర్యాద కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు. ఇలాంటి విద్యాసంస్థలపై అధికారులు



చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ప్రైవేటు స్కూల్ యాజమాన్యంపై తల్లితండ్రులు తెలంగాణ చైల్డ్ ప్రొటక్షన్ అండ్ వెల్ఫర్ పోర్టల్ వుమెన్ డెవలప్మెంట్ అండ్ చైల్డ్ డిపార్ట్మెంట్ చైర్మెన్ నిర్మల్ కాంతి వెస్లె కు పిర్యాదు చేశారు.

# మధు యాష్కికి రాఖీలు కట్టిన మహిళా ప్రజా ప్రతినిధులు



ఎల్బీనగర్, ఆగష్టు 09 (భారత శక్తి):రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క,ఈరోజు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ నివాసానికి వచ్చి రాఖీ కట్టారు. ఈసందర్భంగా సీతక్క మధుయాష్కీ కుటుంబ సభ్యులుతో మాట్లాడి అనుబంధం, ఆత్మీయతను పంచుకున్నారు.అంతేకాకుండా మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద,వరంగల్ మేయర్ గుండు సుధారాణి, బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి,మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రావు, ఇందిరా శోభన్ మధు యాష్కీ నివాసానికి వచ్చి రాఖీలు కట్టారు..

# బీసీల బహిరంగ సభను విజయవంతం చేయాలి..



కరీంనగర్ ప్రతినిధి, ఆగస్టు 9(భారత శక్తి):బీసీలకు 42% రిజర్వేషన్ కనిపించాలన్న డిమాండ్ తో,బీఆర్ఎస్ ఆధ్వర్యంలో, ఈ నెల 14న స్థానిక సర్కస్ గ్రౌండ్లో నిర్వహించే బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో బీసీలు హాజరుకావాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామములోని బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో, శాసనమండలి బిఆర్ఎస్ పక్ష నేత మధుసూదనా చారి,మాజీ మంత్రి ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు ఒడితెల సతీష్ కుమార్, రసమయి బాలకిషన్, సుంకె రవిశంక ర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్లు సమావేశమయ్యారు. బీసీలు ఈ సభకు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. అన్ని నియోజకవర్గాల నుండి బీసీలను తరలించాలని నిర్ణయించారు. బీసీల రిజర్వేషన్ విషయంలో, కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలు ప్రజల్లో ఎండకడతామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ కి చిత్తశుద్ధి లేదని బీసీలను మోసం చేస్తుందని విమర్శించారు. ఈ నెల 11న మరోసారి నియోజకవర్గాలకు చెందిన నాయకులతో సమావేశం అవుతున్నట్లు తెలిపారు. బీసీలు పెద్ద సంఖ్యలో సభకు తరలిరావాలని కోరారు.

# దళితులపై దాడులుచేస్తే ఊరుకు నేది లేదు



పోరుమామిళ్ళ, భారత శక్తి ప్రతినిది, ఆగస్టు 09: ఎక్కడైనా దళిత, గిరిజన, బిసి మైనారిటీ పై దాడులు చేసినా, అసభ్యకరంగా ప్రవర్తించినా, చూస్తూ ఊరుకునేది లేదని, వారిపై ప్రతి దాడులకు దిగుతామని దళిత గిరిజన జేఏసీ బద్వేలు డివిజన్ జేఏసీచైర్మన్ ముత్యాల ప్రసాద్రావు, ప్రధాన కార్యదర్శి గుడిమే బాలస్వామి దళిత సంఘం నాయకులు హెచ్చరించారు. పోరుమామిళ్ల పట్టణంలోనిడాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల న్నారు.తిరుపతిలో దళిత యువకుడి పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ఎక్కడ చూసినా దళితులపై దాడులు. అరాచకాలు మహిళలపై, చిన్నపిల్ల లపై అత్యాచారాలు అధిక మయ్యాయన్నారు. ప్రభుత్వం వెంటనే చర్య లు చేపట్టి ముందు ముందు ఇలాంటివి జరగకుండా గట్టిచర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో దళిత గిరిజన జేఏసీ బద్వేలు డివిజన్నాయకులు గుడిమే సోమయ్య,ఎస్సీ సెల్ వైఎస్ఆర్సిపి జిల్లా కార్యదర్శి కడుగు బాబు,మూర తోటి ఆలివేర్,జక్కుల గురయ్య, దళిత గిరిజన జేఏసీ బద్వేలు డివిజన్ కన్వీనర్ ముత్యాల చెన్నరాయుడు పాల్గొన్నారు.

# డిసిసి ఆధ్వర్యంలో క్విట్ ఇండియా దినోత్సవం..



కరీంనగర్ ప్రతినిధి,ఆగస్టు 9 (భారత శక్తి):క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పీసీసీ ప్రధాన కార్యదర్శి రహ్మత్ హుస్సేన్ తో కలిసి పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించినారు.ఈ సందర్భంగా కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, రహమత్ హుస్సేన్ మాట్లాడుతూ రాక్షస పాలన చేస్తున్న బ్రిటిష్ సామ్రాజ్యాన్ని దేశం నుండి తరిమికొట్టాలని, భారతదేశంలో స్వాతంత్రం తీసుకురావాలనే ఉద్దేశంతో మహాత్మా గాంధీ 1942లో క్విట్ ఇండియా ఉద్యమాన్ని చేపట్టడం జరిగింది, దాని కొనసాగింపుగా ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు,సత్యాగ్రహాలు, ధర్నాలు, నిరాహార దీక్షలు చేపట్టి 1947 ఆగస్టు 15 న మహాత్మా గాంధీ నేతృత్వంలో దేశానికి స్వాతంత్రం రావడం జరిగిందని, ఈ దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్, లాల్ బహుదూర్ శాస్త్రి, బాలగంగాధర్ తిలక్ ఇలాంటి ఎంతోమంది మహనీయులను ఈ దేశం యావత్తు స్మరించుకోవడం జరుగుతుందని, కానీ నేడు దేశంలో పరిపాలిస్తున్న బిజెపి కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో, మరోసారి ప్రజలు ఉద్యమానికి నాంది పలకవలసిన సమయం ఆసన్నమైనదని, రాజ్యాంగ వ్యవస్థ పై,ప్రజాస్వామ్య వ్యవస్థ పై, బిజెపి ఉక్కు పాదం మోపడాన్ని ప్రజలు గమనిస్తున్నారని, బిజెపి అరాచక పాలన,బ్రిటిష్ ప్రభుత్వాన్ని తలపిస్తున్నదని,అందుకే ప్రజలంతా ఏకమై బిజెపి ఈ దేశం నుండి తరిమికొట్టాలని,భారతదేశాన్ని కాపాడుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రహమత్ హుస్సేన్, పత్తి మధుసూదన్ రెడ్డి, వెన్న రాజా మల్లయ్య, లింగంపల్లి బాబు,బొబ్బిలి విక్టర్, వంగల విద్యాసాగర్, హైమద్, మాదాసు శ్రీనివాస్,చింతల కిషన్, కుంభాల రాజ్ కుమార్,గంగుల దిలీప్,సిరికొండ శివప్రసాద్, రాచర్ల పద్మ, మల్యాపురం అనిల్ కుమార్, నాత శ్రీనివాస్. పాల్గొన్నారు.

# ఘనంగా క్విట్ ఇండియా దినోత్సవం..




కరీంనగర్ ప్రతినిధి,ఆగస్టు 9 (భారత శక్తి):స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక ఘట్టం క్విట్ ఇండియా ఉద్యమం అని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆనాడు రెండవ ప్రపంచ యుద్ధంలో భారతదేశాన్ని ఉపయోగించుకోవాలని బ్రిటన్ భావించిందని, భారత దేశానికి స్వాతంత్ర్యం ఇస్తేనే యుద్ధానికి మద్దతు ఇవ్వాలని భారతీయులు భావించారని,ఇందుకు బ్రిటన్ అంగీకరించలేదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ముకరంపుర లోని నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంతో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ భారతీయులను ఒప్పించి యుద్ధంలో దించుటకు సర్ స్టాఫర్డ్ క్రిప్స్ అనే మంత్రిని బ్రిటన్ భారత్ కు పంపించడం జరిగిందని గవర్నర్ జనరల్ కౌన్సిల్ లో రక్షణ సభ్యునిగా భారతీయుడ్ని నియమించాలనే భారత్ ప్రతిపాదనను బ్రిటన్ అంగీకరించక పోవడం వల్ల దౌత్యం విఫలమైందని 1942 ఆగష్టు 8న బొంబాయిలోని వార్ధాలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమై బ్రిటిష్ పాలన అంతమవ్వాలని క్విట్ ఇండియా తీర్మానం ఆమోదించడం జరిగిందని నరేందర్ రెడ్డి అన్నారు.ఆగష్టు 9న ఎన్నో నిర్బంధాల మధ్య క్విట్ ఇండియా ఉద్యమం విజయవంతం అయిందని కానీ ఎందరో ఉద్యమకారులు అమరులయ్యారని మరెందరినో జైళ్ళల్లో బంధింపబడ్డారని గుర్తు చేశారు.ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమం మొత్తం గాంధీ,నెహ్రూ తో పాటు ఎందరో మహానుభావులు కాంగ్రెస్ జండా పట్టుకొని పోరాటం చేశారని అటువంటి కాంగ్రెస్ పార్టీ జండా మోయడాన్ని నిరంతరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా గర్వపడుతామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఎండి తాజ్,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,కుర్ర పోచయ్య,రవీందర్ గౌడ్,మేరాజ్,అష్రఫ్,సుదర్శన్,షబానా మహమ్మద్,ముల్కల కవిత,జ్యోతిరెడ్డి,మాసూమ్ ఖాన్,యనమల మంజుల,హసీనా, సాయిరాం,బషీర్,ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూ శాయంపేటను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)ఆగష్టు9:పోచమ్మతల్లి ఆశీస్సులతో రానున్న రోజుల్లో మోడల్ డివిజన్ గా అభివృద్ధి.గ్రామీణ వాతావరణ నేపథ్యం కలిగిన 31 వ డివిజన్ ని గతపాలకులు నిర్లక్ష్యం చేశారని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.శనివారం శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య,నగర కమిషనర్ చౌహాత్ బాజ్ పాయ్ తో కలిసి రూ.90.50 లక్షలతో రైల్వే ట్రాక్ నుంచి పోచమ్మ ఆలయం వరకు అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఎమ్మెల్యే నాయిని ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో స్థానిక నాయకులు సమన్వయం నియోజకవర్గంలో గతంలో కంటే మెరుగైన అభివృద్ధి ఫలితాలను అందిస్తుందని తెలిపారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి మళ్లీ ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలో జరుగుతుందని అన్నారు.శాయంపేట పోచమ్మ ఉత్సవాలకు ప్రత్యేక విశిష్టత ఉందని,ఉత్సవాల సమయంలో భక్తులకు అసౌకర్యాలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.పనులు నిర్ణీత సమయంలో ఉత్సవాల ముందుగానే అందించాలని ఆదేశించారు.స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు,డివిజన్ అధ్యక్షులు సురేందర్,నాయకులు నత్తు రమేష్,కృష్ణ,రవీందర్,రమేష్ ,సతీష్ తదితరులు పాల్గొన్నారు

## స్మార్ట్ కిడ్జ పాఠశాలలో రాఖీ సంబురాలు..







ఖమ్మం ప్రతినిది,(భారత శక్తి )ఆగష్టు 09:స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో రక్షాబంధన్ సంబురాలు శనివారం ఆనందోత్సవాలతో నిర్వహించారు. పాఠశాల విద్యార్థులలో బాలికలు తమ తరగతి బాలుర ముంజేతికి రాఖీ కట్టి, మిఠాయిలు తినిపించి తమ ఆత్మీయతను చాటుకున్నారు. సోదర ప్రేమకు ప్రతీకగా నిలిచిన రాఖీ పౌర్ణమి వేడుకలను పాఠశాలలో ప్రతి తరగతిలో హుషారుగా నిర్వహించారు. విద్యార్థుల్లో సోదర భావాన్ని పెంపొందించడానికి నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థులలో నూతన ఉత్తేజాన్ని నింపాయి.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల్లో సహోదర భావాన్ని పెంపొందించడానికి ఈ వేడుకలను నిర్వహించామని తెలిపారు. పురాణాల కాలం నుండి రక్షాబంధన్ ఉత్సవాలకు మన దేశంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఏ దేశంలోనూ లేని వేడుకలు అక్కాచెల్లెళ్లకు, అన్నదమ్ములు నిత్యం రక్షణ కల్పించడానికి, శ్రేయస్సును ఆకాంక్షించడానికి ఉత్సవాలు జరుపుకునే సాంప్రదాయం ప్రతి ఒక్కరిని ప్రభావితం చేస్తుందని తెలిపారు.అమ్మ పదంలోని 'అ' నాన్న పదంలోని 'న్న' కలిసి అన్నగా తమ సోదరీమణులకు నిత్యం రక్షణ కవచంగా నిలుస్తున్న సాంప్రదాయ సంబంధ బాంధవ్యాలు మన సమాజం విలువను దశదిశలా చాటి చెప్తున్నాయని పేర్కొన్నారు. ఈ రక్షాబంధన్ వేడుకలలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బి ఆర్ ఎస్ ఒకరికొకరు రక్షా..



కరీంనగర్ ప్రతినిధి, ఆగస్టు 9 (భారత శక్తి):రాష్ట్రంలో విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయని, మీ 10 ఏళ్ల అవినీతికి మేం రక్ష, మా దోపిడీకి మీరు రక్ష. అంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరికొకరు అవినీతి, దోపిడీలకు రక్షగా నిలుస్తూ ప్రజలను వంచిస్తున్నాయనీ ,కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని తెలినా, కేసీఆర్ కుటుంబంపై కాంగ్రెస్ చర్యలు తీసుకోకపోవడానికి ఆ రెండు పార్టీల మధ్యనున్న 'రక్షా' బంధమే కారణమని ఎద్దేవా చేశారు. కరీంనగర్ లో మీడియాతో సంజయ్ మాట్లాడుతూ కాళేశ్వరం కమిషన్ నివేదికను కేబినెట్ లో చర్చించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, విద్యుత్ కొనుగోళ్ల కమిషన్ నివేదికను కేబినెట్ లో ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. పెద్ద ఎత్తున వాటాలు ముట్టినందునే ఆ కమిషన్ నివేదిక గురించి కనీసం పెదవి కూడా విప్పడం లేదని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేటీఆర్ ఇచ్చే లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రాజకీయంగా నేరుగా ఎదుర్కొనే దమ్ములేక, చేసిన తప్పులు, పాపాల నుండి తప్పించుకునేందుకు, లీగల్ నోటీసుల పేరుతో భయపెట్టాలని చూస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ ను ఫోన్ ట్యాపింగ్ జరిగిందని మావద్ద సమాచారముంది.

ఆధారాలున్నాయి. ఇదే విషయంపై ఏ గుడికైనా కుటుంబ సభ్యులతో కలిసి వస్తా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని దేవుడి సాక్షిగా ప్రమాణం చేస్తా,అదే సమయంలో నువ్వు కూడా నీ భార్యాపిల్లలు, తల్లిదండ్రులతో కలిసి గుడికి వచ్చి ఫోన్ ట్యాపింగ్ జరగలేదని వాళ్లందరితో కలిసి ప్రమాణం చేస్తావా?అని సవాల్ విసిరారు. దమ్ముంటే తన సవాల్ కు స్పందించాలని అన్నారు.రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని,ఈరోజు కరీంనగర్ లోని తన నివాసంలో బండి సంజయ్ కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలతో కలిసి రాఖీ సంబురాలు జరుపుకున్నారు. రాష్ట్ర ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు.కేటీఆర్ లీగల్ నోటీసులపై... నేను ఏం తప్పు చేప్పిన? సాక్షాత్తు మీ చెల్లెలు కూడా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని చెప్పారు కదా? ఆమెకు లీగల్ నోటీసులిస్తారా? రాధాకిషన్ రావు తన వాంగ్మూలంలో పెద్దాయన(కేసీఆర్) చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేశారని చెప్పారు కదా? ఆ విషయాన్ని కోర్టు ముందుంది. ఆయనకు నోటీసులిస్తావా? అసలు నోటీసులు ఇవ్వాలనుకుంటే కేసీఆర్, ఆయన కొడుకు ఎప్పటికీ జైల్లోనే ఉంటాను. వాళ్లు తిట్టని తిట్లు లేవు. మాట్లాడని బూతుల్లేవు. చేయని తప్పులు లేవు. జరపని అవినీతి లేదు... నోటీసులిస్తే.. ఏం చేయాలో నాకు తెలుసు. అంతకంటే నోటీసులు ఎక్కువ నా దగ్గరున్నాయనీ చెప్పారీ. ఆ నోటీసులకు భయపడే వ్యక్తిత్వం నాది. అయ్య పేరు చెప్పుకుని రాజకీయాల్లో రాలేదు. దేశం కోసం, ధర్మ రక్షణ కోసం రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసి జైలుకు పోయి వచ్చినోడిని. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సిగ్గు, శరం, రోషం ఉంటే ఆ పార్టీని వదిలి బయటకు రావాలి. ఎందుకంటే ఆనాడు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుసహా అందరి ఫోన్లను ట్యాప్ చేశారు. అయినా మీరు ఇంకా ఎట్లా బీఆర్ఎస్ లో ఉంటున్నారో అర్ధం కావడం లేదు.. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చింది. విజిలెన్స్ నివేదిక ఇచ్చింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా నివేదిక ఇచ్చింది. దీనిపై కేబినెట్ లో చర్చ జరిగింది. మళ్లీ అసెంబ్లీ పేరుతో కాలయాపన ఎందుకు? అట్లాగే విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలపై కమిషన్ నివేదిక ఇచ్చింది. మరి దీనిపై కేబినెట్ లో ఎందుకు చర్చించలేదు? దీనిపై ఎందుకు స్పందించడం లేదు? విద్యుత్ కొనుగోళ్ల అక్రమాల సొమ్ములో వాటా ముట్టింది కాబట్టి దీనిపై నోరు విప్పడం లేదా? ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

ఫోన్ ట్యాపింగ్ పై సీబీఐ విచారణ జరిపించాలనే విషయంలో మాకు స్పష్టత ఉంది. ఎందుకంటే సిట్ పరిమితి చాలా తక్కువ. ఎందుకంటే మావోయిస్టుల పేరు చెప్పి రాజకీయ ప్రముఖుల, సినీ తారల, వ్యాపారుల, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఫోన్ నెంబర్లను ట్యాప్ చేసి బ్లాక్ మెయిల్ చేసి వసూళ్లకు పాల్పడ్డారు. ఆ డబ్బుల లావాదేవీలకు సంబంధించి పూర్తిస్థాయి వాస్తవాలు వెలుగులోకి రావాలంటే.. ఈడీ మాత్రమే విచారణ చేస్తేనే అది సాధ్యమవుతుంది. అట్లాగే టెలికం రెగ్యులేటరీ అథారిటీ నిబంధనలను ఉల్లంఘించి కేసీఆర్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నడిపించింది. ఇది పూర్తిగా కేంద్ర పరిధిలోని అంశం... ఎస్ఐబీ చీఫ్ గా ప్రభాకర్ రావును నియమించడం కేంద్ర హోంశాఖ నిబంధనలకు విరుద్ధం. ఎందుకంటే ఎస్ఐబీ చీఫ్ గా నియమితులైన వ్యక్తి ఐజీ స్థాయి అధికారి అయి ఉండాలి. కానీ ప్రభాకర్ రావు అప్పటికే రిటైర్డ్ అయ్యారు. అయినప్పటికీ ప్రభాకర్ రావు ఐజీగా కొనసాగుతున్నారని కేంద్ర హోంశాఖకు కేసీఆర్ తప్పుడు సమాచారమిచ్చి ఎస్ఐబీ చీఫ్ గా నియమించారు. అట్లాగే జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు సిట్ పోలీసులు ఆధారాలతోసహా వెల్లడించారు. జడ్జీలకు నోటీసులిచ్చి పిలిచి స్టేట్ మెంట్ రికార్డ్ చేసే అధికారం సిట్ కు ఉందా? అది జరిగే పనికాదు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రుల ఫోన్లను కూడా గత ప్రభుత్వం ట్యాప్ చేసింది.

ఆ ఆధారాలు సిట్ వద్ద ఉన్నాయి. ఫోన్ ట్యాప్ నిందితులిచ్చిన కన్ఫెషన్ స్టేట్ మెంట్ లోనూ ఈ వివరాలు వెల్లడించారు. అట్లాంటప్పుడు సీఎంకు నోటీసులిచ్చి విచారణకు రమ్మని ఆదేశించే సాహసం సిట్ చేయగలుగుతుందా? సాధ్యమయ్యే పని కాదు.. పెద్దాయన(కేసీఆర్) చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ప్రధాన నిందితులు రాధాకిషన్ రావు పోలీసుల విచారణలో వెల్లడించారు. నాటి డీజీపీ చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ప్రభాకర్ రావు చెప్పారు. అయినా ఇంతవరకు వాళ్లకు నోటీసులిచ్చి పిలిచే సాహసం కూడా సిట్ చేయలేకపోతోంది.

కేంద్ర హోంశాఖ నిబంధనల ప్రకారం... ఫోన్ ట్యాపింగ్ కు సంబంధించి సేకరించిన సమాచారం, డేటాను ప్రతి ఏటా జనవరిలో, జూన్ లో మాత్రమే ధ్వంసం చేయాలి. కానీ కేసీఆర్ ప్రభుత్వం ఆ పని చేయలేదు. ఏళ్ల తరబడి వేలాది మంది ఫోన్లను ట్యాప్ చేసి ఆ డేటాను భద్రపర్చుకుంది. తమ స్వార్థ ప్రయోజనాలకు అనుగుణంగా వాడుకుంది. ఎప్పుడైతే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోతుందని సర్వేలు తెలిపాయో.. ఎస్ఐబి విషయంలో మీ తెలివి ఇది. అందుకే కదా మీరు బెంగాల్, కర్నాటక రాష్ట్రాల్లో డబ్బులు పంచింది. బెంగాల్ లో మమతా బెనర్జీ వద్దకు పోయి మీ అయ్య డబ్బులు పంచేందుకు సిద్ధమైతే.. మమతా బెనర్జీ మీ అయ్యను గుర్తు పట్టకపోతే ఇబ్బంది పడ్డది నిజం కాదా?... నేను వ్యక్తిగత విషయాలకు పోవద్దని ఆలోచిస్తున్నా... లేకుంటే నీ బండారమంతా బయటపెడతా.

## ప్రజాభిష్టానికి భిన్నంగా ఎన్నికల ఫలితాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదం.

### - ఒంటిమిట్ట, పులివెందుల జడ్పిటిసి ఎన్నికల్లో సిపిఎం ఓటు కీలకం.

### -సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్.

కడప , భారత శక్తి ప్రతినిధి, ఆగస్టు 09:ప్రజాభిష్టానికి భిన్నంగా ఎన్నికల ఫలితాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఒంటిమిట్ట మండల కేంద్రం సిపిఎం కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్నారు.కడప జిల్లాలో జరుగుతున్న జడ్పిటిసి నియోజకవర్గాల ఒంటిమిట్ట, పులివెందుల ఉప ఎన్నికల్లో సిపిఎం ఓటు పరిమితంగా నైనా కీలకమైందేనని తెలిపారు. ఈ ఎన్నికలను కడప అన్నమయ్య జిల్లాలలోని ప్రజాస్వామ్య వాదులందరూ, పౌర సమాజం దగ్గరగా పరిశీలిస్తుందని, ప్రజాభిష్టానికి భిన్నంగా ఎన్నికల ఫలితాలు వస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా పరిణమిస్తుందని వారు తెలిపారు. నేడు దేశంలో కాషాయ కూటమి రాజ్యాంగ విరుద్ధంగా ఎన్నికల కమిషన్ను ప్రభావితం చేస్తోందనే విస్తృతమైన మీడియా, ప్రధాన ప్రతిపక్షాల విమర్శలకు, చర్చకు ఎన్నికల కమిషన్ జాతీయ స్థాయిలో ప్రజా ఓటును కొల్లగొట్టేందుకు ఆపరేషన్ ఈవీఎం ట్యాంపరింగ్లకు అవకాశం లేకుండా నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి, బిజెపి ఏకచత్రాధిపత్యం కోసం ఎన్నికల కుట్రలు చేస్తోందని ఆరోపించారు. భారత రాజ్యాంగం దేశ పౌరులకు




ప్రసాదించిన ఒక మనిషికి ఒక్క ఓటు హక్కు పై దాడి చేసేవారు ఎవరైనా వారి పట్ల ప్రజల విముఖత ఉంటుందని హెచ్చరించారు. సిపిఎం ఒంటిమిట్ట మండల కార్యదర్శి కే.నరసయ్య, సిద్ధవటం సిపిఎం నాయకులు పి.సురేష్ బాబు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వి.రఘు, సిపిఎం ఒంటిమిట్ట మండల కమిటీ సభ్యులు ఎస్.సాంబయ్య ఒంటిమిట్ట మండలంలోని సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## సోదర భావంతో మంత్రికి రాఖీలు





ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), ఆగష్టు 09:శనివారం ఖమ్మం క్యాంపు కార్యాలయం పండుగ వాతావరణంలో మెరిసింది. వివిధ హోదాల్లో ఉన్న మహిళలు, గృహిణులు రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి సోదర భావంతో రాఖీలు కట్టి శుభాకాంక్షలు అందించారు."మీరు మా సోదరుడు మాత్రమే కాదు%ా% మా కుటుంబానికి అండ" అని పలువురు మహిళలు హృదయపూర్వకంగా పేర్కొన్నారు. మంత్రి కూడా స్నేహపూర్వకంగా పలకరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుభకార్యక్రమాలకు హాజరైన మంత్రి, అక్కడ కూడా మహిళల నుంచి రాఖీలు కట్టించుకున్నారు.


## బోలెరో వ్యాన్ ఢీకొన్న కారు..ప్రయాణికులు క్షేమం

రంగారెడ్డిడిఎంఆర్ఎల్ చౌరస్తా ఫిసల్ బండలో. రోడ్డు పక్క బోలోరో వాహనం టైర్ మారుస్తుండగా వేగంగా వచ్చిన శాంత్రో కారు ఢీకొట్టింది. ఈ ఘటన లో శాంత్రో కారు స్వల్ప గాయాలయ్యాయి.

ఫిసల్ బండాలోని ఎస్బీఐ బ్యాంక్ సమీపంలో టైర్ మార్చేందుకు రోడ్డు పక్కన ఆగి ఉన్న బొలెరో పికప్ వాహనంతో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న వాహనాన్ని శాంత్రో కారు ఢీకొట్టడంతో శాంత్రో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. కాంచన్బాగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చంద్రాయణగుట్ట ట్రాఫిక్ అధికారులకు సమాచారం అందించారు. ట్రాఫిక్ టోయింగ్ వ్యాన్ సహాయంతో, దెబ్బతిన్న వాహనాన్ని రోడ్డు నుండి తొలగించి ట్రాఫిక్ను పునరుద్ధరించారు.

=============================చీచీచీఅఅఅ

## రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్లాంట్లు




సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, ఆగస్టు 09 :రాష్ట్రంలోని గ్రామపంచాయతీ భవనం నుంచి సచివాలయం వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు వెల్లడించారు.శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి (ఎనర్జీ) నవీన్ మిట్టల్, రెడ్ కో సి.ఎం.డి., ఎస్.పి.డి.సి.ఎల్. సి.ఎం.డి, సింగరేణి కాలరీస్ సి.ఎం.డి లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సోలార్ సిస్టం ఇన్స్టాలేషన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా నుండి కలెక్టర్ పి. ప్రావీణ్య వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. కలెక్టరేట్లు, పార్కింగ్ ప్రాంతాలు, క్యాంటీన్లు, అలాగే ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల భవనాలపై కూడా సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలు సేకరించి వారం లోపు పంపాలని కలెక్టర్లను ఆదేశించారు.నీటిపారుదల, రోడ్లు-భవనాల శాఖల పరిధిలోని ఖాళీ స్థలాల వివరాలు కూడా సమర్పించాలనిసూచించారు.కలెక్టరేట్లు రాష్ట్రవ్యాప్తంగా ఒకే నమూనాలో నిర్మించబడినందున, అవసరమైన డిజైన్లు హైదరాబాద్ నుండి పంపిస్తామని, కలెక్టరేట్ల వద్ద ఉన్న మెరుగైన డిజైన్లు కూడా పంపవచ్చని తెలిపారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద పంపిణీ చేసిన 6.70 లక్షల ఎకరాల భూముల్లో 'ఇందిరా సౌర గిరిజల వికాసం' పథకం ద్వారా ఉచిత సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని, కలెక్టర్లు ఎటువంటి అలసత్వం లేకుండా నిర్ణీత గడువులో వివరాలు పంపాలని ఆదేశించారు. సందేహాలుంటే విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, సీఎండీలు, ఆర్ఇడిసిఐ, విసి అండ్ ఎండిలను సంప్రదించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఖాళీ ప్రభుత్వ స్థలాల వివరాలను నిర్ణీత నమూనాలో అందించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెనాల్టీ పడినా.. వెనక్కి తగ్గొద్దన్న గంభీర్



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకోవాలంటే పాయింట్ల పట్టికలో టాప్-2లో ఉండాలి. అందుకోసం ప్రతి పాయింట్, పర్సంటేజీ అత్యంత కీలకం. స్లో ఓవర్ రేట్ కారణంగా కొన్నిసార్లు పాయింట్లను కోల్పోవాల్సిన పరిస్థితి ప్రతి జట్టుకూ ఎదురవుతుంది. అయితే, ప్రత్యర్థిపై విజయం కోసం అలాంటివాటిని పట్టించుకోవద్దని భారత్ ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తన టీమ్‌కు ఇచ్చిన సందేశం ఇప్పుడు వైరల్‌గా మారింది. ఇంగ్లాండ్‌తో ఐదో టెస్టు ఐదో రోజు ఐసీసీ నుంచి వచ్చిన వార్నింగ్‌పై గంభీర్ స్పందించిన తీరు అభిమానులను ఆకట్టుకుంది.

ఓవల్ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆఖరి రోజున టీమ్‌ఇండియాకు 4 వికెట్లు అవసరం కాగా.. ఇంగ్లాండ్‌కు 35 పరుగులు మాత్రమే కావాలి. ఇలాంటి పరిస్థితుల్లో అప్పటికే భారత జట్టు 6 ఓవర్లు వెనకబడి ఉంది. దానిని కవర్ చేయడం లేదా ఇంగ్లాండ్‌ను త్వరగా ఆలౌట్ చేయడమే గిల్‌సేన ముందున్న సవాళ్లు. లేకపోతే డబ్ల్యూటీసీలో పాయింట్లను కోల్పోయే ప్రమాదం ఉంది. భారత కోచింగ్ బృందంలోని ఓ సభ్యుడు మాత్రం 'స్పిన్నర్లతో కొన్ని ఓవర్లు వేయిస్తే బెటర్' అని సలహా ఇచ్చాడు. కానీ, స్లోఓవర్ పెనాల్టీ కంటే విజయం ముఖ్యమనే ఉద్దేశంతో గంభీర్ 'పేసర్లతోనే బౌలింగ్ చేయిద్దాం' అని సూచించాడు. సిరాజ్, ప్రసిద్ధ్ అద్భుతంగా బంతులేసి జట్టును గెలిపించారు. గంటలోపే నాలుగు వికెట్లను పడగొట్టడం విశేషం.

ఆటగాళ్ల జెర్సీల వేలం

అండర్సన్ - తెండూల్కర్ ట్రోఫీలో ఆడిన భారత, ఇంగ్లాండ్ క్రికెటర్ల జెర్సీలను వేలం వేసి వచ్చిన నిధులను 'రెడ్ ఫర్ రూత్' ఛారిటీ కోసం కేటాయించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జెర్సీ రూ.5.40 లక్షలు, రవీంద్ర జడేజా రూ.4.94 లక్షలు, కేఎల్ రాహుల్ రూ.4.70 లక్షలు, జో రూట్ రూ.4.47 లక్షలు, బెన్ స్టోక్స్ రూ.4 లక్షలు వేలంలో అమ్ముడయ్యాయి. జో రూట్ టోపీకి రూ.3.52 లక్షలు, భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ క్యాప్‌నకు రూ.1.76 లక్షలు వచ్చాయి. ప్రతి సంవత్సరం లార్డ్స్ వేదికగా జరిగే ఒక టెస్టును మాజీ క్రికెటర్ ఆండ్రూ స్ట్రాస్‌కు చెందిన 'రెడ్ ఫర్ రూత్' ఫౌండేషన్‌కు అంకితం చేయడం ఆనవాయితీగా వస్తోంది.

# పంత్‌ది మాస్టర్‌మైండ్.. నేనూ అలా ప్రయత్నించా: అఫ్గాన్ క్రికెటర్



రిషభ్ పంత్ మైదానంలో ఉంటే ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్. బ్యాటింగ్‌తోనే కాకుండా.. ప్రత్యర్థి ఆటగాళ్లను కవ్వించడంలోనూ నేర్పరి. అలాగే మ్యాచ్‌ను కాస్త 'డిలే' చేయాలంటే వెంటనే తన వ్యూహాలకు పదును పెట్టేస్తాడు. దిల్లీ క్యాపిటల్స్‌కు ఆడిన అఫ్గాన్ క్రికెటర్ గుల్బాదిన్ నైబ్ అయితే పంత్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. సమయం వృథా చేయడంలో తాను కూడా పంత్‌ను అనుసరించిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేసుకున్నాడు. టీ20 ప్రపంచకప్ (%20 ఔశీతీశ్రీస జబజూ% 2025) ఫైనల్‌లో పంత్ 'మోకాలి' గాయంతో ఇబ్బందిపడగా.. అదే టోర్నీలో బంగ్లాతో పోరులో గుల్బాదిన్ 'సడెన్'గా మైదానంలో పడిపోవడం అభిమానులకు ఇప్పటికీ గుర్తుండిపోతుంది. ఆ మ్యాచ్‌లో అఫ్గాన్ విజయం సాధించడంతో.. ఆసీస్ కనీసం సెమీస్‌కు కూడా చేరుకోలేకపోయింది.

"రిషభ్ పంత్ ఓ మాస్టర్ మైండ్ ప్లేయర్. అతడు అవలంబించే విధానం చాలా విభిన్నంగా ఉంటుంది. దిల్లీ క్యాపిటల్స్‌కు అతడితో కలిసి ఆడా. భారత క్రికెటర్లతో కలిసి ఆడటం, సినిమాలకు వెళ్లడం చేస్తే ఇలాంటి ఆలోచనలు (నవ్వుతూ) వస్తాయి. నేను ఫైనల్‌లో పంత్‌ను చూడగానే ఓకే .. అతడు సమయం వేస్ట్ చేస్తున్నాడని తెలిసిపోయింది. ప్రత్యర్థులు దూకుడుగా ఉండేటప్పుడు ఇలా చేయడం తప్పేమీ కాదు" అని నైబ్ వ్యాఖ్యానించాడు. ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై టీమ్‌ఇండియా గెలిచి టైటిల్‌ను ఎగరేసుకుపోయిన సంగతి తెలిసిందే.

కోచ్ నుంచి మాకు సిగ్నల్స్

"బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌కు వర్షం కారణంగా అంతరాయం కలిగింది. తొలుత మేం డక్‌వర్త్ పద్ధతి ప్రకారం బంగ్లా కంటే వెనకబడి ఉన్నాం. కాసేపటికే ముందుకొచ్చాం. దీంతో మా కోచ్ నుంచి సిగ్నల్ వచ్చింది. ఆ విషయం వికెట్ కీపర్ నజీబుల్లా జద్రాన్‌కు చెప్పా. కానీ, అతడు సరిగ్గా వినిపించుకోలేదు. నేను స్లిప్‌లో ఉన్నా. ఇక నేనే ఏదైనా చేయాలని అనుకున్నా. అయితే, ఇలా చేయడం కూడా టీమ్‌ఇండియాకూ కలిసొచ్చింది. అది జరిగిన తర్వాత మా కోచ్ నాతో రెండు రోజులు మాట్లాడలేదు. నావైపు చూసి నవ్వేసి వెళ్లిపోయేవాడు" అని నైబ్ తెలిపాడు.

# కోహ్లీ ఇచ్చిన కానుకను పదిలంగా దాచుకున్న సిరాజ్



విరాట్ కోహ్లీ మహ్మద్ సిరాజ్ ( మధ్య ప్రత్యేక అనుబంధం ఉంది. కోహ్లీ చివరిసారిగా ధరించిన టెస్ట్ జెర్సీని సిరాజ్‌కు కానుకగా ఇచ్చాడు. దాన్ని మహ్మద్ సిరాజ్ పదిలంగా తన ఇంట్లో దాచుకున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా తర్వాత, సిరాజ్.. టీమ్‌ఇండియాకు కీలక బౌలర్‌గా మారాడు. తాజాగా ముగిసిన తెండూల్కర్- అండర్సన్ ట్రోఫీలోనూ అయిదు మ్యాచుల్లో 23 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే రెండు సార్లు అయిదు వికెట్ల ప్రదర్శన కూడా చేశాడు.

ముఖ్యంగా ఈ ట్రోఫీలో భాగంగా ఓవల్ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో టీమ్‌ఇండియా ఆరు పరుగుల తేడాతో గెలిచి, సిరీస్‌ను సమం చేయడంలో.. సిరాజ్ కీలకపాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో అతడు రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి తొమ్మిది వికెట్లు తీసుకున్నాడు. ఇప్పటి వరకు 41 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన సిరాజ్ 123 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లాండ్ టూర్‌లో టీమ్‌ఇండియా విజయం సాధించిన తర్వాత విరాట్ కోహ్లీ.. సోషల్ మీడియా వేదికగా సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణను (%ూతీశుంఱఅస్త్ర ఖతీఱంస్త్రఅఖ%) ప్రశంసించాడు. ముఖ్యంగా మహ్మద్ సిరాజ్ అద్భుతంగా రాణించి, టీమ్‌ఇండియా విజయంలో కీలకపాత్ర పోషించాడని కొనియాడాడు. దానికి సిరాజ్ కూడా స్పందిస్తూ.. విరాట్ కోహ్లీకి కృతజ్ఞతలు తెలిపాడు.

విరాట్ కోహ్లీ, మహ్మద్ సిరాజ్ మధ్య చాలా ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఐపీఎల్‌లో (%ఖూూ%) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో మహ్మద్ సిరాజ్ ఆడాడు. అతడిలోని ప్రతిభను గుర్తించిన కోహ్లీ ప్రత్యేకంగా ప్రోత్సహించాడు. సిరాజ్‌ను వరల్డ్ క్లాస్ బౌలర్‌గా తీర్చిదిద్దడంలో విరాట్ కోహ్లీ పాత్ర కూడా ఉంది! ఈ నేపథ్యంలో వారి మధ్య స్నేహం చిగురించింది. అందుకే విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత.. అతడు లేని డ్రెస్సింగ్ రూమ్ అసంపూర్ణంగా ఉందని సిరాజ్ వాపోయాడు. ప్రస్తుతం ఈ పేసర్ ఇంట్లో ఉన్న కోహ్లీ జెర్సీ.. కేవలం ఓ జ్ఞాపకం మాత్రమే కాదు.. వారిద్దరి మధ్య ఉన్న అనుబంధానికి, స్నేహానికి గుర్తు అని క్రికెట్ అభిమానులు అంటున్నారు.

# బుమ్రాపై వర్క్‌లోడ్.. వారందరి కంటే ఫిజియో ముఖ్యమా?: పాటిల్



భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా 'వర్క్‌లోడ్' అంశం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. కొందరేమో అతడిని అన్ని మ్యాచుల్లోనూ ఆడించాలని చెబుతుండగా.. మరికొందరు మాత్రం బుమ్రాపై ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదన్నారు. టీమ్‌ఇండియా క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ఇప్పటికే బుమ్రా 'వర్క్‌లోడ్' గురించి విమర్శలు గుప్పించాడు. ఇప్పుడు మరో మాజీ క్రికెటర్, మాజీ సెలక్టర్ సందీప్ పాటిల్ స్పందించాడు. బీసీసీఐ తీరుపై అసహనం వ్యక్తంచేశాడు.

"బుమ్రా కొన్ని మ్యాచులు మాత్రమే ఆడాలనే నిర్ణయానికి బీసీసీఐ అంగీకరించడం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. అంటే హెడ్ కోచ్, కెప్టెన్ కంటే ఫిజియో ముఖ్యమా? అతడు తీసుకున్న డెసిషనే ఫైనలా? మరి సెలక్టర్లు ఏం చేస్తున్నారు? అంటే సెలక్షన్ కమిటీ మీటింగ్స్‌లో ఫిజియో కూడా ఉంటున్నారని వేం భావించాలా? అతడే నిర్ణయం తీసుకుంటున్నాడా?. ఎప్పుడైనా సరే దేశం కోసం ఎంపికైతే.. చివరివరకూ పోరాడేందుకు సిద్ధంగా ఉండాలి. గతంలో నేను సునీల్ గావస్కర్ ఐదు రోజులూ బ్యాటింగ్ చేయడం చూశా. కపిల్‌దేవ్ ఎక్కువగా బౌలింగ్ చేయడమూ చూసిన రోజులు ఉన్నాయి. నెట్స్‌లోనూ విపరీతంగా బంతులేసేవాడు. వారెవరూ బ్రేక్ అడగలేదు. ఎప్పుడూ ఫిర్యాదు చేయలేదు. వారంతా 16 ఏళ్లకు పైగా కెరీర్‌ను కొనసాగించారు. నేను కూడా 1981లో తలకు గాయమైన తర్వాత టీంలోకి వచ్చాక ఎప్పుడూ టెస్టు మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా లేను" అని సందీప్ పాటిల్ వ్యాఖ్యానించాడు.

ముందే చెప్పాడుగా: రహానె

మరోవైపు అజింక్య రహానె మాత్రం బుమ్రాకు మద్దతుగా నిలిచాడు. టెస్టు సిరీస్‌కు ముందే బుమ్రా తాను ఆడే మ్యాచులపై స్పష్టతతో ఉన్నాడని రహానె వెల్లడించాడు. "బుమ్రా విషయంలో నాకు నచ్చింది ఇదే. అతడు ఎప్పుడూ స్పష్టతతో ఉంటాడు. సిరీస్‌కు ముందే.. నేను తొలి టెస్టు ఆడతా, రెండో టెస్టు ఆడను. మళ్లీ మూడో మ్యాచ్ ఆడతా.. ఇలా కెప్టెన్, మేనేజ్‌మెంట్‌కు ముందే చెప్పాడు. తనకంటే జట్టే ముఖ్యమని అతడి ఉద్దేశం. భారత జట్టుకు ఆడేటప్పుడు పక్కన కూర్చుంటానని చెప్పడం చాలా కష్టం'' అని రహానె వెల్లడించాడు.

# విరాట్.. రెండు నెలల తర్వాత

లండన్: ఈ ఏడాది ఐపీఎల్ అవ్వగానే టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించి పెద్ద షాకిచ్చాడు విరాట్ కోహ్లి. ఇప్పటికే టీ20లకూ దూరమైన నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్లో ఇక విరాట్ ఆడేది వన్డేలు మాత్రమే. టీమ్‌ఇండియా తర్వాతి వన్డే సిరీస్ అక్టోబరులో కావడం గమనార్హం. ఆ నెల 19-25 తేదీల మధ్య ఆస్ట్రేలియాలో మూడు మ్యాచ్‌ల సిరీస్ ఉంది. అందుకు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ.. అప్పుడే విరాట్ సాధన మొదలుపెట్టేశాడు. రెండు నెలల తర్వాత అతను బ్యాట్ పట్టి సాధన చేశాడు. లండన్‌లో సొంత నివాసం ఏర్పాటు చేసుకుని అక్కడే ఉంటున్న విరాట్.. నెట్స్‌లో సాధన అనంతరం దిగిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నాడు. అందులో కోహ్లితో పాటు ఐపీఎల్ జట్టు గుజరాత్ టైటాన్స్ సహాయ కోచ్ నయీమ్ అమిన్ ఉన్నాడు. అమిన్ పర్యవేక్షణలోనే విరాట్ సాధన చేశాడు. తనకు సాయపడ్డందుకు కృతజ్ఞతలు చెబుతూ, అతణ్ని కలవడం ఎప్పుడూ బాగుంటుందని వ్యాఖ్యానించాడు కోహ్లి.



అవతారం మారింది..: టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించాక విరాట్ కోహ్లి అవతారం మార్చేశాడు. అతను తెల్లటి గడ్డంతో కనిపిస్తున్నాడు. అతడి గడ్డం ముందే నెరిసినప్పటికీ.. దానికి రంగు వేసుకునేవాడు. కానీ ఇటీవలి విరాట్ ఫొటోలను గమనిస్తే.. గడ్డం తెల్లబడే ఉంటోంది.

# సంజు దారెటు?

దిల్లీ: ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టును అయిదు సీజన్ల పాటు సారథిగా నడిపించిన ఆటగాడు సంజు శాంసన్. స్థిరమైన కెప్టెన్ కోసం చూస్తున్న రాయల్స్‌కు అతను సరైన ప్రత్యామ్నాయంగా కనిపించాడు. 2021లో, 25 ఏళ్ల వయసులో కెప్టెన్ అయిన శాంసన్.. ఆ జట్టును బాగానే నడిపించాడు. రెండో కప్పు కోసం సుదీర్ఘ కాలంగా సాగుతున్న నిరీక్షణకు తెరదించకపోయినా.. అంతకుముందున్న సారథులతో పోలిస్తే మెరుగైన ఫలితాలే రాబట్టాడు. ఇంకా కొన్నేళ్ల రాయల్స్ కెప్టెన్‌గా కొనసాగుతాడనుకున్న శాంసన్.. అనూహ్యంగా ఆ జట్టును వీడుతుండడం చర్చనీయాంశంగా మారింది. తనను విడిచిపెట్టాలని రాజస్థాన్ యాజమాన్యాన్ని సంజు కోరిన నేపథ్యంలో అతను ఆ జట్టుకు దూరమవడం లాంఛనమే. అయితే ఈ ఏడాది ఐపీఎల్ ముందు వరకు రాయల్స్ యాజమాన్యం, కోచింగ్ సిబ్బందితో మంచి సంబంధాలున్న శాంసన్.. ఇప్పుడు ఆ జట్టును వీడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందన్నది ప్రశ్నార్థకం. టీమ్‌ఇండియా కోచ్‌గా పదవీ కాలం ముగియడంతో రాజస్థాన్ జట్టుకు తిరిగి శిక్షకుడిగా వచ్చిన ద్రవిడ్‌తో సంజుకు పొసగలేదని తెలుస్తోంది. ఈ సీజన్ ఆరంభంలో గాయంతో ఇబ్బంది పడ్డ సంజు.. కొన్ని మ్యాచ్‌ల్లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగాడు.



# వైరలవుతోన్న రామ్‌చరణ్ 'పెద్ది'..

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది' (). చరణ్ అభిమానులు ఈ సినిమా అప్‌డేట్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

గతంలో 'రంగస్థలం' సినిమాతో రామ్ చరణ్– సమంత ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు మరోసారి ఈ జోడి స్క్రీన్‌పై మెరవనున్నట్లు వార్తలు వస్తున్నాయి. పెద్ది సినిమాలో సమంత స్పెషల్ సాంగ్ చేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే సమంత 'పుష్ప'లో చేసిన సాంగ్ ప్రపంచవ్యాప్తంగా ట్రెండ్ సృష్టించింది. ఇప్పుడు మరోసారి అదేతరహాలో ప్రత్యేక పాటలో కనిపించి స్టెప్పులు వేయనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాను ప్రకటించినప్పుడు ఇందులో సమంత కూడా కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. కాగా, దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

ఇక 'పెద్ది'లో తనకు రామ్‌చరణ్ అవకాశం ఇచ్చారని ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ ఎకమ్ తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన 'తంగలాన్'లో తన వర్క్ చూసి రామ్‌చరణ్ పెద్దిలో అవకాశం ఇచ్చినట్లు చెప్పారు. ఈ సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు ( దీంతో ఈ వార్తను చరణ్ అభిమానులు షేర్ చేస్తున్నారు. మరోవైపు పెద్ది షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. అందులోభాగంగా రామ్‌చరణ్‌తోపాటు, ఇతర తారాగణంపై ఓ వేడుక నేపథ్యంలో సాగే సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా సెట్‌ని తీర్చిదిద్దారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ చిత్రమిది. వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానుంది.

# మహేశ్ సినిమాపై రాజమౌళి పోస్ట్.. హ్యాష్‌ట్యాగ్‌తో బిగ్‌హింట్..

ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు ఎదురుచూస్తోన్న చిత్రం మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న ఈ సినిమా నుంచి నేడు అప్‌డేట్ వస్తుందని అభిమానులు ఆశించారు. వారిని ఉద్దేశించి దర్శకధీరుడు పోస్ట్ పెట్టారు. మహేశ్ ప్రీలుక్ ఫొటోను పంచుకున్నారు. దీని పూర్తి లుక్‌ను నవంబర్‌లో రివీల్ చేస్తామని చెప్పారు.



నేడు ఈ సూపర్‌స్టార్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి అప్‌డేట్ పంచుకుంటారని ఫ్యాన్స్ భావించారు. వారిని ఉద్దేశిస్తూ రాజమౌళి ) ప్రత్యేక పోస్ట్ పెట్టారు. "మేం ఈ సినిమా షూటింగ్‌ను ఇటీవలే ప్రారంభించాం. దీనిపై మీ అందరి ఆసక్తి చూసి ఎంతో ఆనందంగా ఉంది. ఇది చాలా భారీస్థాయిలో రానుంది. కేవలం ప్రెస్‌మీట్ పెట్టి లేదా కొన్ని ఇమేజ్‌లు విడుదల చేయడం వల్ల స్టోరీకి పూర్తిస్థాయిలో న్యాయం చేయలేము. దీన్ని భారీఎత్తున రూపొందిస్తున్నాం. నవంబర్ 2025లో మహేశ్ లుక్‌ను విడుదల చేస్తాం. గతంలో ఎప్పుడూ చూడనివిధంగా దీన్ని రూపొందిస్తున్నాం. మీరంతా సహకరిస్తారని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు.

ఇక ఈ పోస్ట్‌కు రాజమౌళి అనే హ్యాష్ ట్యాగ్‌ను జోడించారు. అంటే ఇందులో హీరోని ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ప్రయాణించే వ్యక్తిగా చూపించనున్నట్లు పరోక్షంగా చెప్పినట్లు తెలుస్తోంది. ఎన్నో ఏళ్ల తర్వాత ఈ సినిమా నుంచి అప్‌డేట్ వచ్చేసరికి అటు మహేశ్ అభిమానులతో పాటు ఇటు సినీ ప్రియులంతా సంబరపడుతున్నారు. దీంతో క్షణాల్లోనే ఈ హ్యాష్ ట్యాగ్ ఎక్స్‌లో ట్రెండింగ్‌లోకి వచ్చింది.

నేనూ ఎదురుచూస్తున్నా: మహేశ్ బాబు

తన పుట్టినరోజు సందర్భంగా విషెస్ చెప్పిన అభిమానులకు మహేశ్ బాబు ధన్యవాదాలు తెలిపారు. ఆయనకు విషెస్ చెప్పిన అభిమానుల నుంచి సినీ ప్రముఖుల వరకూ అందరూ అప్‌డేట్‌ను కోరారు. దీంతో ఆయన స్పందించారు. రాజమౌళి సినిమాలో తన లుక్ కోసం తాను కూడా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. 'మీలాగే నేను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. నవంబర్‌లో మీతో పాటు నేను కూడా ఎంజాయ్ చేస్తా' అంటూ పోస్ట్ పెట్టారు.

విషయానికొస్తే.. అటవీ నేపథ్యంలో సాగే కథతో ప్రపంచాన్ని చుట్టేసే సాహస ప్రయాణంగా ఈ సినిమాని సిద్ధం చేస్తున్నారు రాజమౌళి. ఇందులో మహేశ్ మునుపెన్నడూ చేయని ఓ విభిన్నమైన పాత్రలో.. సరికొత్త లుక్‌తో ప్రేక్షకుల్ని అలరించనున్నారు. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని జక్కన్న ఆవిష్కరించబోతున్నారు. ఈ సూపర్‌స్టార్ సరసన ప్రియాంక చోప్రా నటిస్తున్నారు. ఇప్పటికే పలు షెడ్యూళ్లు పూర్తి చేసుకున్న ఈ సినిమా తదుపరి షెడ్యూల్ దక్షిణాఫ్రికాలో జరగనున్నట్లు సమాచారం.



# ఏడాది పాటు గదిలో బంధించాడు.. ఆమిర్‌పై సోదరుడి ఆరోపణలు

బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్‌ఖాన్‌పై అతని సోదరుడు ఫైసల్ ఖాన్ సంచలన ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఏడాది పాటు ఆమిర్ తనను గదిలో బంధించాడని ఫైసల్ ఆవేదన వ్యక్తంచేశారు. కొన్నేళ్ల క్రితం తాను అనుభవించిన ఆవేదనను తాజాగా గుర్తుచేసుకున్నారు.

"నాకు మానసిక వ్యాధి వచ్చిందని, నేను పిచ్చివాడినని సమాజానికి హాని చేస్తానని ఏవోవే అన్నారు. కొన్ని విషయాల్లో నా కుటుంబానికి నేను సహకరించపోవడంతో వారు నాకు పిచ్చి అనుకున్నారు. నేను ఉచ్చులో కూరుకుపోయానని తర్వాత అర్థమైంది. దాని నుంచి ఎలా బయటపడాలో అర్థం కాలేదు. సంవత్సరం పాటు ఆమిర్ నన్ను ఒక గదిలో బంధించాడు. నా ఫోన్ లాగేసుకున్నారు. బయటకు వెళ్లనివ్వలేదు. నా గది బయట బాడీగార్డ్‌లను పెట్టారు. నాకు మందులు ఇచ్చేవారు. వారి నుంచి నా తండ్రి నన్ను కాపాడతాడని అనుకున్నాను. కానీ, ఆయన్ని ఎలా సంప్రదించాలో నాకు తెలియలేదు. నా దగ్గర ఆయన కాంటాక్ట్ నంబర్ కూడా లేదు" అని ఫైసల్ ( తెలిపారు. సంవత్సరం తర్వాత ఆమిర్ తనను వేరే ఇంటికి మార్చినట్లు చెప్పారు.

ఆమిర్, ఫైసల్‌కు మధ్య ఎన్నో రోజులుగా విభేదాలు ఉన్న విషయం తెలిసిందే. ఫైసల్ దీనిపై చట్టపరమైన పోరాటం చేస్తున్నారు. తన ఆస్తి విషయంపై కోర్టును ఆశ్రయించారు. గతంలో ఆయన ఓ ఆసుపత్రిలో మానసిక ఆరోగ్యం మెరుగు కోసం ట్రీట్‌మెంట్ తీసుకున్నారు. 20 రోజుల చికిత్స అనంతరం ఆయన పూర్తిగా నార్మల్ అయినట్లు వెల్లడించారు. అయినప్పటికీ ఆమిర్ తనను బంధించాడని ఆరోపించారు.

ఇక ఆమిర్, సోదరుడు ఫైసల్‌తో కలిసి 'మేళ' అనే చిత్రంలో నటించారు. ధర్మేశ్‌దర్శన్ దర్శకత్వం వహించిన ఆ చిత్రం 2000లో విడుదలైంది. 1988లో ఫైసల్ విలన్ పాత్రతో సినీ రంగ ప్రవేశం చేశారు. 1990లో తన తండ్రి నటించిన తుమ్‌మేరే హెూ చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. పలు హిందీ సినిమాల్లోను నటించారు. 1994లో మధోశ్, 2015లో చినార్ దాస్తాన్ ఏ ఇష్క్ వంటి చిత్రాల్లోనూ నటించారు.

# టాలెంట్ ఉన్నా అవకాశాలు రావు: మౌనీరాయ్

సినీ నేపథ్యం లేకపోతే ఇండస్ట్రీలో అవకాశాలు రావడం కష్టమన్నారు నటి మౌనీరాయ్ ). తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. వినోద పరిశ్రమలో బయటి వ్యక్తులు ఎదుర్కొంటోన్న సవాళ్ల గురించి ప్రస్తావించారు. ప్రతిభ ఉన్నప్పటికీ అవకాశాలు రావన్నారు. వాటిని పొందడం ఎంతో కష్టమన్నారు.



"సినీ నేపథ్యం లేకపోతే మనం ఎంత పెద్ద సినిమాలో నటించినప్పటికీ ఉపయోగం ఉండదు. బయటి వ్యక్తులకు అవకాశాలు ఇవ్వరు. వీటి కోసం ఎప్పుడూ పోరాటం చేస్తూనే ఉండాలి. అందుకే నేను చిన్న ఆఫర్ వచ్చినా ఉపయోగించుకుంటాను. సినీ నేపథ్యం లేకపోయినప్పటికీ ఆడిషన్స్ నిర్వహించి వారికి కూడా అవకాశం ఇవ్వాలని ఎవరికీ అనిపించదు. నేను ఇన్ని సినిమాల్లో చేసినప్పటికీ ఇప్పటికి కూడా ఆడిషన్స్ ఇస్తూనే ఉన్నాను" అని చెప్పారు. బ్రహ్మాస్త్ర తర్వాత తనకు ఎన్నో అవకాశాలు వస్తాయని అనుకున్నట్లు తెలిపారు. కానీ, ఆ సినిమా విజయం తనకు ఛాన్సులు తీసుకురాలేదని చెప్పారు.

బాలీవుడ్ బలహీనపడుతోంది: వివేక్ అగ్నిహోత్రి

ఇక ఈ విషయంపై బాలీవుడ్ దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి కూడా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. కొత్త వారు పరిశ్రమకు రాకపోతే ఇండస్ట్రీ బలహీనపడుతుందన్నారు. సామాన్యులు కూడా ఇందులోకి రావాలని కోరారు. "ఇన్‌స్టాగ్రామ్‌లో బాగా ఫేమస్ అయిన వారికి అవకాశాలు ఇస్తున్నారు. వారిలో ఎక్కువమంది స్టార్ కిడ్స్ ఉంటారు. నటీనటుల పిల్లలందరూ ఇన్‌స్టా ఇన్‌ఫ్లుయెన్సర్లుగా మారుతున్నారు. అలాగే ఇన్‌ఫ్లుయెన్సర్లు స్టార్‌లుగా మారాలని కోరుకుంటున్నారు. కానీ, చిన్నచిన్న పల్లెటూర్లలో కూడా గొప్ప ప్రతిభ ఉంటుంది. వారికి అవకాశం ఇవ్వాలి" అని తెలిపారు.


# జడల్... హడల్

నరకంలోకి నడిచి దాన్ని స్వర్గంగా మార్చేశాడంటూ 'ది ప్యారడైజ్' సినిమాలోని కథానాయకుడి పాత్రని పరిచయం చేశారు శ్రీకాంత్ ఓదెల. ఆయన దర్శకత్వంలో నాని కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్.ఎల్.వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా నాని లుక్‌ని విడుదల చేయడంతోపాటు, ఆయన పోషిస్తున్న పాత్ర వివరాల్ని వెల్లడించింది చిత్రబృందం. లుక్‌లో రెండు జడలతో కనిపిస్తున్నారు నాని. ఇందులో ఆయన పాత్ర పేరు కూడా జడల్ అని చిత్రబృందం తెలిపింది. లుక్‌లో కత్తులు, బుల్లెట్లు, బ్లేడ్‌లతోపాటు నాని రూపం హడలెత్తించేలా ఉంది. విజయవంతమైన 'దసరా' తర్వాత నాని – శ్రీకాంత్ ఓదెల – సుధాకర్ చెరుకూరి కలిసి చేస్తున్న చిత్రమిది. హైదరాబాద్ – సికింద్రాబాద్ నేపథ్యంలో, ఓ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇందులో బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయల్ కీలక పాత్రని పోషిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 26న తెలుగుతోపాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సీహెచ్ సాయి, కూర్పు: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్: అవినాశ్ కొల్లా, సంగీతం: అనిరుధ్ రవిచందర్.



# కనకావతి @ 'కాంతార 1'

కనకావతిగా సినీ ప్రియుల్ని పలకరించేందుకు సిద్ధమవుతోంది నటి రుక్మిణీ వసంత్. 'కాంతార: చాప్టర్ 1' కోసమే ఆమె ఈ పాత్రలోకి మారింది. రిషబ్ శెట్టి హీరోగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రమిది. విజయవంతమైన 'కాంతార' సినిమాకి ప్రీక్వెల్‌గా హెూంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. శుక్రవారం ఈ చిత్రం నుంచి రుక్మిణి పాత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అందులో యువరాణి తరహాలో కనకావతి పాత్రలో ఆమె కనిపించిన తీరు ఆసక్తి రేకెత్తించింది. కదంబ కాలం నేపథ్యంలో సాగే ఆసక్తికర కథాంశంతో రూపొందుతున్న చిత్రమిది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా అక్టోబరు 2న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి అజనీశ్ లోక్‌నాథ్ సంగీతమందిస్తున్నారు.



### శానిటైజర్లు ఎక్కువగా వాడుతున్నారా?

# రోగాలను కొనితెచ్చుకున్నట్లేనట!.. బీ అలర్ట్ !!

శానిటైజర్లను అధికంగా వాడుతున్నారా? అయితే అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకున్నట్టే. రసాయనాల అధిక వాడకం వల్ల లాభాల కంటే నష్టాలే ఎక్కువని శాస్త్రవేత్తలు గుర్తించారు. వాటికి బదులు నీరు, సబ్బును వాడుకోవాలని సూచిస్తున్నారు. కొవిడ్ తర్వాత శానిటైజర్ల వినియోగం ఎక్కువైన విషయం తెలిసిందే. వీటిపై అమెరికా శాస్త్రవేత్తలు అధ్యయనం చేసి, అతి వాడకం వల్ల అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని గుర్తించారు.



అనవసరంగా వాడొద్దు

క్వాటర్నరీ అమ్మోనియం కాంపౌండ్స్‌గా పిలుచుకునే యాంటి మైక్రోబయాల్ రసాయనాలను అధికంగా వాడితే రోగాల బారిన పడతారని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. రోగ నిరోధకత పెరగదు సరికదా అనారోగ్యానికి గురవుతారని వెల్లడించారు. పర్యావరణానికి కూడా హాని కలుగుతుందని తెలిపారు. శానిటైజర్లకు బదులు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఉబ్బసం, చర్మ వ్యాధులకు వీటి వాడకానికి మధ్య సంబంధం ఉన్నట్టు గుర్తించామని వివరించారు.

యాంటిబయాటిక్‌లు పని చేయవు

శాస్త్రవేత్తలు ముందుగా జంతువులపై ప్రయోగాలు చేశారు. ఈ పరిశోధనల్లో పిల్లలు పుట్టకపోవడం, పుట్టిన పిల్లల్లో అవయవ లోపాలు తదితర సమస్యలకు శానిటైజర్లకు సంబంధం ఉన్నట్టు గుర్తించారు. క్వాటర్నరీ అమ్మోనియం కాంపౌండ్స్ యాంటి మైక్రోబయాల్ రోగ నిరోధకతను అడ్డుకుంటాయని 1950ల్లోనే గుర్తించారు. దీని కారణంగా వివిధ వ్యాధులకు విరుగుడుగా వాడే యాంటిబయాటిక్‌లు పని చేయవు. వీటి వల్ల భవిష్యత్తులో మరణాల సంఖ్య పెరిగే ఆస్కారం ఉన్నదని పరిశోధకులు తేల్చారు.

అమ్మోనియం పేరిట విక్రయాలు

బెంజల్‌కోనియమ్ క్లోరైడ్ ఈ కోవకి చెందిన రసాయన పదార్థమే. కాని దీన్ని అమ్మోనియం క్లోరైడ్ పేరిట మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పంట ఉత్పత్తులకు వాడే రసాయనాల లేబుళ్లపై వీటి గురించి ఉంటుంది. రంగుల్లోనూ వీటిని వాడుతున్నప్పటికి డబ్బాలపై వీటి గురించి రాయడం లేదు. సరైన పద్ధతిలో పరీక్షించకుండానే మార్కెట్లోకి వదులుతున్నారు. ఈ రసాయనాలకు ఎంత దూరంగా ఉంటే అంతమంచిదని శాస్త్రవేత్తలు సూచించారు.

# తండ్రి కాలేక పోతున్నారా..?

సంతానలేమికి ఆడవాళ్లలోనే కాదు.. మగవాళ్లలోని సమస్యలు కూడా అంతే ప్రధాన కారణం. సంతానలేమికి 30 శాతం పురుషులే కారణం. వారిలో ఇన్‌ఫర్టిలిటీకి ప్రధానంగా రెండు కారణాలు. ఒకటి శుక్రకణాల సంఖ్య తక్కువగా లేదా వాటి నాణ్యత, చలనంలో సమస్యలు ఉండటం. రెండు లైంగిక కలయికలోనే ఇబ్బంది ఉండటం. స్తంభన సమస్యలు ఉండటం. అందుకే సంతానలేమి సమస్య ఉన్న జంట వచ్చినప్పుడు ఆడవాళ్లతోపాటు మగవాళ్ల ఆరోగ్యాన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. ముందు సాధారణ ఆరోగ్య పరిస్థితిని చూడాలి. స్థూలకాయం, మధుమేహం లాంటి సమస్యలున్న వాళ్లలో లైంగిక సమస్యలకు ఆస్కారం ఉంటుంది. ఏ సమస్యలూ లేవని తేలినప్పుడు వీర్య పరీక్షలు చేస్తారు. వీర్యంలో శుక్రకణాలు ఎలా ఉన్నాయో తెలుసుకుంటారు. వీర్యకణాల సంఖ్య ఒక మిల్లీలీటర్ వీర్యానికి 16 మిలియన్లు ఉండాలి. అంతకన్నా తక్కువగా ఉంటే ఆలిగోజూ స్పెర్మియా అంటారు. అసలు వీర్యకణాలే లేకపోతే అజూస్పెర్మియా అంటారు. కొన్నిసార్లు వీర్యకణాల సంఖ్య సరైన మోతాదులో ఉన్నప్పటికీ ఫర్టిలిటీలో సమస్య ఉంటుంది. ఇందుకు కారణం వీర్యకణాల్లో నాణ్యత లోపించడం. సంఖ్య ఉంటే సరిపోదు.. వాటి నిర్మాణం, చురుకుదనం, మొబిలిటీ సరిగ్గా ఉండాలి.

వీర్యకణాల సమస్య ఎందుకు?


వీర్యకణాల ఉత్పత్తి లేకపోవడానికి 'నాన్ అబ్‌స్ట్రక్షన్ అజూస్పెర్మియా' లేక 'అబ్‌స్ట్రక్టివ్ అజూస్పెర్మియా' గానీ కారణం అవుతాయి.

వృషణాల్లో ఉత్పత్తయిన వీర్యకణాలు శుక్ర వాహిక ద్వారా వీర్యంలోకి చేరుతాయి. ఈ నాళంలో అడ్డంకులు ఉన్నప్పుడు వీర్యకణాలు వీర్యంలోకి చేరలేవు. దీన్ని 'అబ్‌స్ట్రక్టివ్ అజూస్పెర్మియా' అంటారు. ఈ సమస్యను అల్ట్రాసౌండ్ స్కాన్ ద్వారా గుర్తించవచ్చు.

కొందరిలో జన్యుపరమైన సమస్యల వల్ల కూడా వీర్యకణాల ఉత్పత్తి ఉండదు.

లైంగిక హార్మోన్ల ఉత్పత్తి యాక్టివేట్ కావాలంటే పిట్యూటరీ గ్రంథి నుంచి ఫోలికిల్ స్టిమ్యులేటింగ్ హార్మోన్, ల్యూటినైజింగ్ హార్మోన్ సరిగ్గా ఉండాలి. వీటి ఉత్పత్తిలో తేడా ఉంటే లైంగిక హార్మోన్లలో సమస్య వస్తుంది. పురుషుల్లో టెస్టోస్టిరాన్ ఉత్పత్తి కుంటుపడుతుంది. అందువల్ల సంతానలేమి సమస్యకు దారితీస్తుంది. ఈ సమస్యను 'హైపోగొనాడోట్రోపిక్ హైపోగొనాడిజమ్' అంటారు.

కీమోథెరపీ తీసుకున్నవాళ్లలో, వైరికోసిల్ సమస్య ఉన్నవాళ్లలో, గవదబిళ్లలు వ్యాధి వచ్చినవాళ్లలో వృషణాలు కూడా ఇన్‌ఫెక్ట్ కావడం వల్ల శుక్రకణాల సంఖ్య దెబ్బతింటుంది.



20 నుంచి 30 శాతం మందిలో కారణం తెలియకుండానే ఇన్‌ఫర్టిలిటీ ఉంటుంది.

పరిష్కారం?

అబ్‌స్ట్రక్టివ్ అజూస్పెర్మియా ఉన్నవాళ్లకు టీసా (టీఈఎస్ఏ) లేదా పీసా (పీఈఎస్ఏ) ద్వారా నీడిల్‌ను డైరెక్ట్‌గా లోపలికి పంపించి వృషణాల నుంచి వీర్యకణాలను సేకరిస్తారు. తర్వాత అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నిక్స్ ద్వారా అండంతో ఫలదీకరణం చెందిస్తారు.

పిట్యుటరీలో సమస్య వల్ల వీర్యకణాల లోపం ఉన్న వాళ్లకు మూడు నెలల పాటు హార్మోన్ ఇంజెక్షన్లు ఇస్తే వీర్యకణాల ఉత్పత్తి సాధారణ స్థితికి వస్తుంది.

స్థూలకాయం ఉన్నవాళ్లలో కొవ్వులోని టెస్టోస్టిరాన్ ఈస్ట్రోజెన్‌గా మారుతుంది. ఈ రెండు హార్మోన్ల మధ్య నిష్పత్తి 1:50కి చేరితే.. దీన్ని ఆపడానికి మందులు ఇస్తారు. వీర్యకణాలు ఉత్పత్తి కావడానికి 72 రోజులు పడుతుంది. అందువల్ల ఈ మందులు తీసుకున్న 3 నుంచి 5 రోజుల వరకు లైంగిక కలయికలో పాల్గొనవద్దని చెబుతారు. ఆ తర్వాత వీర్యాన్ని సేకరించి పరీక్షిస్తారు. వీర్యకణాలను తీసుకుని ఐవీఎఫ్ ద్వారా సంతాన సాఫల్యం పొందవచ్చు.

నివారణ :

ఇన్‌ఫర్టిలిటీ సమస్యకు మారిన జీవనశైలే ప్రధాన కారణం. అందుకే జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటూ, మంచి ఆహారపు అలవాట్లు చేసుకోవాలి. సిగరెట్లు, ఆల్కహాల్ ముట్టుకోవద్దు. కొలెస్ట్రాల్ పెరగకుండా జాగ్రత్తపడాలి.

# స్కిన్ ట్యాగ్స్ ఎందుకొస్తాయి?

స్కిన్ ట్యాగ్స్ ఎందుకొస్తాయి? మేడమ్! మా పిన్నికి ఒంటిమీద అక్కడక్కడా చిన్నచిన్న బొడిపెల్లాంటివి వస్తున్నాయి. దీంతో తను ఆత్మన్యూనతకు గురవుతున్నది. ఏవో చిట్కాలు ప్రయోగించింది కానీ, ఫలితం ఉండటం లేదు. ఈ సమస్యకు కాస్మటాలజీలో పరిష్కారం ఉందా?

మేడమ్! మా పిన్నికి ఒంటిమీద అక్కడక్కడా చిన్నచిన్న బొడిపెల్లాంటివి వస్తున్నాయి. దీంతో తను ఆత్మన్యూనతకు గురవుతున్నది. ఏవో చిట్కాలు ప్రయోగించింది కానీ, ఫలితం ఉండటం లేదు. ఈ సమస్యకు కాస్మటాలజీలో పరిష్కారం ఉందా?

వీటిని ఇంగ్లిష్‌లో 'స్కిన్ ట్యాగ్స్' అంటాం. ఒంటి మీద అదనపు చర్మం పెరుగుదల ఫలితమే ఈ వికృత ఆకృతులు. చంకలు, మెడ, ఛాతీ తదితర చోట్ల ఎక్కువగా వస్తుంటాయి. ఊబకాయం, మధుమేహం కూడా ఓ కారణమే.




తొంభైశాతం సందర్భాల్లో వీటివల్ల ఎలాంటి హానీ జరుగదు. నొప్పి కూడా ఉండదు. అరుదుగా మాత్రం క్యాన్సర్ కణితులుగా మారే ప్రమాదం ఉంది. సౌందర్య స్పృహ ఉన్నవారు చిన్నపాటి లోపాన్ని కూడా తట్టుకోలేరు.

దీంతో రకరకాల చిట్కాలు ప్రయత్నిస్తుంటారు. ఇవి పనిచేయవచ్చు, చేయకపోనూవచ్చు. చాలా సందర్భాల్లో స్కిన్ ట్యాగ్స్ మాయమైనా ఆ మచ్చలు మాత్రం మిగిలిపోతాయి. రకరకాల అలర్జీలకూ కారణం అవుతాయి. కాబట్టి, సాధ్యమైనంత వరకూ శాస్త్రీయమైన పద్ధతులనే ఎంచుకోవాలి. చిన్నపాటి శస్త్ర చికిత్స ద్వారా వీటిని సులభంగా తొలగించవచ్చు. కాబట్టి, భయపడాల్సిన పన్లేదు. ఆత్మన్యూనతకు గురికావాల్సిన అవసరమూ లేదు.

# రుచిమొగ్గల రహస్యం!

మీ నాలుక మీద చిన్నచిన్న బొడిపెల్లాంటి వాటిని ఎప్పుడైనా గమనించారా? వీటిని చాలామంది రుచిమొగ్గలు అనుకుంటారు. కానేకాదు. రుచిమొగ్గలను సూక్ష్మదర్శినితో మాత్రమే చూడగలం. చర్మం బయటిపొర నుంచి పొడుచుకువచ్చినట్టుండే ఈ నిర్మాణాన్ని వైద్య పరిభాషలో 'పాపిలే' అంటారు. రుచిమొగ్గలు వీటిలోపల ఉంటాయి. ఒక్క నాలుకమీదే కాదు.. నోరు, అన్నవాహిక తదితర భాగాల్లోనూ ఉంటాయి. రుచిమొగ్గల్లో వేరు వేరు అంటూ ఉండవు. వివిధ రుచులకు స్పందించే విభిన్న కణాలు సమాహారం ఇది.

వీటి సాయంతో తీపి, పులుపు, ఉప్పు, వగరు రుచులను గుర్తిస్తాం. కారం రుచి కానేకాదు. మిరపకాయ ఘాటుకు మన ప్రతిస్పందన మాత్రమే. నాలుక మీదుండే ప్రతీ రుచిమొగ్గ ఈ కణాల మిశ్రమంగా ఉంటుంది. మనం ఏదైనా తిన్నప్పుడు రుచిమొగ్గల్లోని రుచి గ్రాహకాలు మెదడుకు సంకేతాలను పంపిస్తాయి.



అలా మనం రుచిని గుర్తిస్తాం. ఎక్కువ వేడి, మసాలాలు, ఆమ్లత్వం, చక్కెరలు ఎక్కువగా ఉన్న ఆహారం తినడం, పొగతాగడం, కొన్ని రకాలైన వ్యాధులు, కొన్ని ఔషధాలు, కీమోథెరపీ లాంటివి రుచిమొగ్గల్ని చంపేస్తాయి.

విటమిన్-బి12 లోపం, ఫంగల్ ఇన్ఫెక్షన్స్, ఇతర లోపాలు కూడా రుచిమొగ్గల మీద దుష్ప్రభావం చూపుతాయి. దీంతో రుచుల్ని తెలుసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. మంచి ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులతో కొన్ని రోజుల్లోనే రుచిమొగ్గలు మళ్లీ పుట్టుకొస్తాయి. వీటికి సమస్య వచ్చినప్పుడు.. ఓ మోస్తరు వేడిగా ఉన్న ఆహారమే తీసుకోవాలి. మరీ చల్లగానూ ఉండకూడదు. ఘాటైన మసాలాలూ వద్దు. అయినా, రుచి తెలియకపోతే డాక్టర్లను సంప్రదిస్తే మంచిది.

# డైలీ కర్బూజా జ్యూస్ తాగుతున్నారా.?

వేసవిలో అత్యధికంగా దొరికే పండ్లలో కర్బూజా ఒకటి. వేసవి తాపాన్ని తగ్గించుకోవడానికి, శరీరం కోల్పోయిన నీటిని తిరిగి అందించడంలో కర్బూజా ఉపయోగపడుతుంది. అంతేకాకుండా డైలీ కర్బూజా జూస్ తాగడం వల్ల అనేక ప్రయోజనాలతో పాటు అనేక పోషకాలు మన శరీరానికి అందుతాయి.

కర్బూజాలో అధిక మోతాదులో పొటాషియం ఉండటం వల్ల గుండెకు న్యూట్రియంట్స్‌ను అందజేస్తుంది. అంతేకాకుండా ఫోలెట్ ఉండటం వల్ల హార్ట్ ఎటాక్ నుంచి, గుండె జబ్బుల నుంచి కాపాడుతుంది.

కర్బూజా జూస్ రెగ్యూలర్‌గా తాగడం వల్ల రక్తంలోని చక్కర శాతాన్ని తగ్గించుకోవచ్చు. అంతేకాకుండా కిడ్నీలో రాళ్లను కరిగించే శక్తి ఈ పండుకు ఉంది.

కర్బూజా పండులో విటమిన్ కె, విటమిన్ ఈ ఎక్కువగా ఉంటుంది. దీనివలన ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. అంతేకాకుండా రక్త ప్రసరణ సరిగా జరిగేలా ఉపయోగపడుతుంది.



కర్బూజాలో ఫోలిక్ యాసిడ్ అధికంగా ఉంటుంది. ఇది గర్భిణీలకు మేలు చేస్తుంది. బిడ్డ ఎదుగుదలకు తోడ్పడుతుంది.

కర్బూజాలో ఉండే బీటా కెరోటిన్, విటమిన్ సి ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతుంది. అంతేకాకుండా తెల్ల రక్తకణాలు వృద్ధి చెందేలా చేయడంతోపాటు రక్తంలో ఇన్ఫెక్షన్ రాకుండా కాపాడుతుంది.

విటిమిన్ ఎ ఎక్కువగా ఉండటం వల్ల కంటి సంబంధిత జబ్బులను తగ్గించడంలో కర్బూజా ముఖ్య పాత్ర పోషిస్తుంది.

# చల్లటి నీరుతో హృద్రోగులకు ముప్పు


: ప్రాణాంతక గుండె పోటుతో నిత్యం ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. గుండె కండరానికి రక్త సరఫరా తగ్గుముఖం పడితే గుండె పోటు ముప్పు పెరుగుతుంది. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనుల్లో బ్లాక్స్ ఏర్పడితే గుండె దెబ్బతినడంతో పాటు మరణం సంభవిస్తుంది. గుండె పోటుకు ముఖ్యమైన కారణాల్లో ధమనుల్లో వ్యర్థాలు పేరుకుపోవడమని వైద్య నిపుణులు చెబుతున్నారు.


ఫ్యాట్, కొవ్వుల వంటి అనారోగ్య కారక వ్యర్థాలు శరీరంలో పేరుకుపోవడంతో రక్త సరఫరాకు అడ్డంకులు ఏర్పడతాయి. ఇక చల్లటి నీరు, రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేసిన నీరు తాగితే ముఖ్యంగా హృద్రోగుల్లో గుండె కొట్టుకునే వేగంలో మార్పులు చోటుచేసుకుని తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జ్వరంతో బాధపడేవారు, ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే వారిలో చల్లటి నీరు శరీరంలో ఉష్ణోగ్రతను తగ్గించినా ఇప్పటికే గుండె జబ్బులతో బాధపడేవారిలో మాత్రం హృదయ స్పందనల్లో హెచ్చుతగ్గులు ఏర్పడే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చల్లటి నీరును సేవించగానే ముఖ్యంగా హృద్రోగుల్లో కొద్ది క్షణాల్లోనే గుండె పోటు వంటి సీరియస్ సమస్యలు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

రూమ్ టెంపరేచర్‌కు సరిపోయే రీతిలోనే హైడ్రేట్ కావాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. భోజనానంతరం గోరువెచ్చటి నీరు తీసుకుంటే మేలని, అది జీర్ణక్రియకు దోహదపడుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. రూం టెంపరేచర్‌తో కూడిన నీటిని తీసుకుంటే శరీరంలో కీలక అవయవాలు సజావుగా పనిచేయడంతో పాటు శరీరం అంతటికీ పోషకాలు, ఆక్సిజన్ సమకూరుతుంది. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడంతో పాటు గుండె కొట్టుకునే వేగం నిలకడగా ఉంటుందని వైద్య నిపుణులు సూచిస్తుందని అన్నారు.





# మనల్ని మనమే నాశనం చేసుకుంటున్నాం..

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, ఆగష్టు 09 ( భారత శక్తి ) : పర్యావరణం అంటే అర్థం భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్నది ప్రకృతి. ఇది మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం. భారతీయ మహర్షులు పర్యావరణాన్ని రెండు రకాలుగా అభివర్ణించారు. ఒకటి మన చుట్టూ ఉన్న బాహ్య పర్యావరణం, రెండవది అంతర్గత పర్యావరణం. ఈ రెండింటినీ కూడా భగవంతుడే సృష్టించాడు. ఈ రెండింటి మధ్య సంబంధం ఉంది. దానిని మనం అర్థం చేసుకోవాలి.



పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయి. దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోంది.

నేడు ఈ పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది, దీనికి కారణం కాలుష్యం. దీన్నే ఆంగ్లంలో పొల్యూషన్ అంటారు. కాలుష్యానికి అర్థం పర్యావరణంలో అసమతుల్యతలు సంభవించడమే.

అయితే భారతదేశంలో పర్యావరణ పరిరక్షణ చరిత్ర ప్రాచీనమైనదిగా చూడవచ్చు.. .

ఇందులో హరప్పా నాగరికత సంస్కృతి పర్యావంణహితమైనదిగా ఉంది. ఇక వైదిక సంస్కృతి పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్దేశించబడింది.

అలాగే తీజ్ లాంటి పండుగలు, పర్వదినాలు జరుపుకోవడం హిందూ సంస్కృతి ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. హెూలీ, దీపావళి, శరత్ పూర్ణిమ, వైశాఖి, మకర సంక్రాంతి, జన్మాష్టమి, రామ నవమి వంటి పర్వదినాలు ఆయా ఋతువులను అనుసరించి ప్రకృతి గొప్పతనాన్ని, సౌందర్యాన్ని మనకు తెలియచేస్తాయి. భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించారు. సౌరశక్తిని సూర్యదేవునిగా కొలిచారు. భారతీయ సంస్కృతిలో జలాన్ని కూడా దేవీ స్వరూపంగా భావించారు. నదులను జీవనదాయిని అయిన మాతలుగా భావించారు. అందుచేతనే ప్రాచీన సంస్కృతి నదీ తీరాల వెంబడి ఉద్భవించి ముందుకు కొనసాగింది.

భారతీయ సంస్కృతిలో అరటి, రావి, మర్రి, తులసి, మామిడి మొదలైన చెట్లను పూజిస్తారు.. మధ్యయుగపు, మొగలు పరిపాలన కాలపు భారతదేశంలో పర్యావరణంపై ప్రేమపూర్వక వాతావరణమే నెలకొని ఉండేది. ఆంగ్లేయులు తమ స్వార్థపూరిత ఆర్థిక ప్రయోజనాల కోసం భారతదేశంలో పర్యావరణాన్ని నాశనం చేయడం ప్రారంభించారు. వారి విధ్వంసకర విధానాలవల్ల భారతదేశంలో పర్యావరణం దెబ్బతింది.

అయితే భారత రాజ్యాంగం 1950లో అమలులోకి వచ్చింది. కానీ అందులో పూర్తి స్థాయిలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అధికరణలు జోడించబడలేదు. 1972లో జరిగిన స్టాక్ హెూమ్ సమ్మేళనం కారణంగా భారతదేశం పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించడం ఆరంభించింది. 1976లో జరిగిన రాజ్యాంగ సవరణలో అధికరణం 48ఏ, 51ఏ లను జోడించారు.

కానీ అధికరణం 48 ఏ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణకు, వాటిలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టాలి. అధికరణం 51ఏ/ 6 పౌరులు పర్యావరణ పరిరక్షణతోపాటు.. అభివృద్ధికి తోడ్పడుతూ వన్య జీవుల పట్ల సహానుభూతిని కలిగి ఉండాలని తెలుపుతుంది.



అయితే ప్రతి సంవత్సరంలో జూన్ 5 ఒక ప్రత్యేకత ఉంది..

జూన్ 5న విశ్వవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు. దీన్ని పురస్కరించుకొని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ జాగృతపరిచే ప్రయత్నాలు చేస్తుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1972లో ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రపంచ సమ్మేళనం ఒకటి నిర్వహించింది. అన్ని దేశాలను ఆహ్వానించింది. స్వీడన్ లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో సుమారు 119 దేశాలు పాల్గొన్నాయి. ప్రతి సంవత్సరం జూన్ 5న ఈ సమ్మేళనం జరుగుతుంది.

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కాలుష్యానికి ముఖ్య కారణాలు ఒకసారి పరిశీలిస్తే :

జల కాలుష్యం, వాయు కాలుష్యం, భూ కాలుష్యం..

కాలుష్య నియంత్రణకు ఆర్ఎస్ఎస్ ఎంతో ప్రయత్నం చేసింది..

పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ఉత్పాదకత మానవ జాతి మనుగడకే ప్రమాదం. దీని ప్రభావం పర్యావరణంపై పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 10 మార్చి 2019 లో జరిగిన ప్రతినిధుల సభలో ఒక నిర్ణయం తీసుకుంది. సంఘం పర్యావరణ పరిరక్షణ సంకల్పాన్ని ప్రారంభించింది. స్వయంసేవకులు తమ తమ స్థాయిలో క్షేత్రాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రయత్నిస్తూనే సమాజాన్ని జాగృతం చేస్తారు. నిర్దిష్టమైన పద్ధతిలో కార్యక్రమాలు కూడా చేపడతారు. సంఘ్ దేశవ్యాప్తంగా విభిన్నమైన గతివిధుల సహకారంతో పనులు చేపడుతోంది.

2018 సంవత్సరంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 15 ఆగస్టు నుండి 22 ఆగస్టు వరకు చేపట్టిన ఒక అభియాన్ ద్వారా దేశ రాజధాని ఢిల్లీలో 10 లక్షలకు పైగా మొక్కలు నాటారు. పరిసరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యంగా నీడనిచ్చే, ఔషధ గుణాలున్న మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం ఢిల్లీ లోని ప్రతి ప్రాంతంలో చేపట్టారు. దీనిలో స్థానిక రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ లు, సామాజిక సంస్థలు, ప్రముఖ వ్యక్తులు, విద్యాలయాలు, ఇతర శిక్షణా సంస్థలను భాగస్వాములు చేశారు. స్థానికంగా ప్రజల సహకారంతో పర్యావరణ కమిటీలు ఏర్పాటు చేసి నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత అప్పగించారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా దేశవ్యాప్తంగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించే ఉద్యమాన్ని 2016 జూన్ 20న ప్రారంభించింది. పట్టణాలలో పెరుగుతున్న కాలుష్యానికి దృష్టిలో ఉంచుకొని ఐదు వేల కంటే ఎక్కువ మొక్కలు నాటడానికి సంకల్పించారు. ఈ కార్యక్రమంలో సమాజంలోని ప్రజలను భాగస్వాములను చేయాలని ప్రయత్నిస్తూ 93 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో సంఘ్ జీవనాన్ని ప్రసాదించే మాతృ స్వరూపంగా ప్రకృతిని భావిస్తూ, ఆ ప్రకృతిని రక్షించే బాధ్యతను పోషించడం కర్తవ్యంగా భావిస్తోంది.

అయితే ఏ ఒక్క సంస్థో పర్యావరణ పరిరక్షణకు నడుం కడితే సరిపోదు.. అందరూ ఇందులో భాగస్వామ్యం కావాలి.. తల్లి ఒడి లాంటి ప్రకృతిని తగలబెట్టకుండా కాపాడుకోవాలి.. నిర్లక్ష్యం వహిస్తే ఎంతో ప్రమాదం.. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు సంభవిస్తున్న విపత్తులను ఒకసారి గమనించాలి.. ఒక దేశం, ఒకప్రాంతం అని కాకుండా ఇది భూమండలమంతా వ్యాపించిన జాడ్యం.. దీనిని అరికట్టకపోతే ప్రపంచం స్మశానంగా మారిపోతుంది.. పర్యావరణ పరిరక్షణకు " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " నడుం కట్టింది.. మీ అందరి భాగస్వామ్యాన్ని ఆశిస్తోంది..

# భారత రక్షణ రంగ ఉత్పత్తులు @రూ.1.51 లక్షల కోట్లు



దేశీయంగా రక్షణ ఉత్పత్తులు ఇటీవల గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ ఉత్పత్తుల విలువ రూ.1,50,590 కోట్లకు చేరిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ (%ఞుఞఅఞ్ష్ర రాఙఅస్త్రష్ట్ర%) వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే 18శాతం వృద్ధి కనిపించగా.. ఐదేళ్లలోనే 90శాతం వృద్ధి నమోదైందని చెప్పారు.

"2024-25 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.5లక్షల కోట్లకు చేరుకొని ఆల్‌టైమ్ రికార్డు సాధించింది. గతేడాది 1.27లక్షల కోట్లుగా ఉండగా.. ప్రస్తుతం 18శాతం వృద్ధి నమోదు చేసుకుంది. 2019-20లో రూ.79వేల కోట్లు విలువైన ఉత్పత్తులు నమోదు కాగా ఇప్పుడది 90శాతం పెరిగింది" అని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. డీఆర్‌డీవో, రక్షణ రంగ విభాగాలు సహా అన్ని భాగస్వామ్యపక్షాల సమష్టి కృషి ఫలితంగా ఈ ఘనత సాధ్యమైందన్నారు.

మొత్తం ఉత్పత్తుల్లో డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్ (డీపీఎస్‌యూ)తో పాటు ఇతర పీఎస్‌యూలు 77శాతం తయారు చేయగా, మరో 33శాతంలో ప్రైవేటు రంగం పాత్ర ఉందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. రక్షణ పరికరాల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని మన దేశం తగ్గించుకొని, ఆత్మనిర్భరత సాధిస్తుందనడానికి ఇదో నిదర్శనమన్నారు. దేశ అవసరాలను తీర్చడమే కాకుండా, రక్షణ ఉత్పత్తుల ఎగుమతి సామర్థ్యం కూడా భారీగా పెరిగిందన్నారు.

## పట్టాలెక్కిన ఆసియాలోనే అతిపొడవైన గూడ్స్ రైలు.. భారత రైల్వే సరికొత్త రికార్డ్..

భారతీయ రైల్వేలు శాఖ ఒక చారిత్రాత్మక ఘనతను సాధించింది. దేశ చరిత్రలో మొదటిసారి 4.5 కిలోమీటర్ల పొడవున్న సూపర్ గూడ్స్ రైలు 'రుద్రాస్త్ర'ను విజయవంతంగా పట్టాలెక్కించింది. తూర్పు మధ్య రైల్వే పరిధిలోని పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ డివిజన్ నుంచి మొదలైన ఈ రైలు.. ధన్‌బాద్ రైల్వే డివిజన్‌కు విజయవంతంగా సరకు చేరవేసి ప్రయాణాన్ని పూర్తి చేసింది. ఇది దేశంలోనే మాత్రమే కాదు. ఆసియాలోనే అతి పొడవైన సరుకు రవాణా రైలుగా రికార్డు నెలకొల్పింది.

రుద్రాస్త్ర 54 వ్యాగన్లు, 6 రాక్‌లు7 ఇంజిన్‌లతో కూడిన 4.5 కి.మీ పొడవైన ఈ గూడ్స్ రైలు. 2025 ఆగస్టు 7న, మధ్యాహ్నం 2:20 గంటలకు గంజ్‌ఖ్వాజా స్టేషన్ నుంచి బయలుదేరింది. అద్భుతమైన వేగంతో సుమారు 5 గంటల్లో 200 కిలోమీటర్ల దూరాన్ని ప్రయాణించి గర్వా రోడ్ స్టేషన్ చేరుకుంది. ప్రయాణంలో సగటు వేగం గంటకు 40 కిలోమీటర్లు. ప్రస్తుతం ఈ సరకు రవాణా రైలును ప్రయోగాత్మకంగా నడిపారు. త్వరలోనే, రైల్వే శాఖ రుద్రాస్త్ర సాధారణ కార్యకలాపాలకు పచ్చజెండా ఊపనుంది.

ఎలా రూపొందించారు?

ఈ సూపర్ ఫ్రైట్ ట్రైన్‌ను ఆరు ఖాళీ బాక్సన్ ర్యాక్‌లను కలిపి రూపొందించారు. సాధారణంగా ఇవి వేర్వేరు ట్రైన్లుగా నడిపే వీలుండగా, ఈసారి ప్రత్యేకంగా ఒకే ట్రైన్‌గా కలిపారు. దీన్ని నడిపేందుకు మొత్తం ఏడు శక్తివంతమైన ఇంజిన్లు ఉపయోగించారు. ఇది కేవలం ఒక సాధారణ ప్రయోగం కాదు. సరకు రవాణాలో సమయాన్ని, వనరులను ఆదా చేసే వినూత్న ప్రయత్నంగా అభివర్ణించవచ్చు. ఇది భారతీయ రైల్వే చరిత్రలో అతి పెద్ద గూడ్స్ రైలు కావడం గమనార్హం.

# సినీ కార్మికుల వేతనాల పెంపునకు నేను హామీ ఇవ్వలేదు: చిరంజీవి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: సినీ కార్మికుల వేతనాల వివాదం రోజుకో ఆసక్తికర వార్తతో ముందుకొస్తోంది. తాజాగా ఈ వివాదం విషయంలో మెగాస్టార్ చిరంజీవి వార్తల్లోకెక్కారు. ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులమని చెప్పుకునే కొంతమంది వ్యక్తులు.. తాను వారిని కలిశానని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కార్మికుల 30 శాతం వేతన పెంపు వంటి వారి డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చినట్లు వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు.

సినీ కార్మికులకు 30శాతం వేతనాలు పెంచి, తాను త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తానని హామీ ఇచ్చినట్లు మీడియాకు తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని చిరంజీవి పేర్కొన్నారు. తాను కార్మికుల సంఘాల నుంచి ఎవరినీ కలవలేదని మెగాస్టార్ తేల్చి చెప్పారు. ఇది ఒక పరిశ్రమ సమస్య అని, తనతో సహా ఏ వ్యక్తీ దీన్ని పరిష్కరించడానికి ఏకపక్ష హామీలు ఇవ్వలేరని వివరించారు. ఫిల్మ్ ఛాంబర్ అనేది తెలుగు చలనచిత్ర పరిశ్రమకు అత్యున్నత సంస్థ మాత్రమే అని తెలిపారు. ఆ సంస్థ మాత్రమే.. సమష్టిగా సంబంధిత వారందరితో చర్చలు జరిపి న్యాయమైన పరిష్కారాన్ని కనుగొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గందరగోళం సృష్టించే ఇటువంటి నిరాధార, ప్రేరేపిత వాదనలన్నింటినీ ఖండిస్తున్నట్లు చిరంజీవి చెప్పుకొచ్చారు.

తెలుగు ఫిలిం ఇండస్ట్రీలో వర్కర్స్ ఫెడరేషన్‌కు చెందిన కార్మిక సంఘాలు వేతనాల పెంపు కోసం సినిమా షూటింగ్‌లను నిలిపివేసి బంద్ కొనసాగిస్తున్నాయని తెలిసిందే.

వర్కర్ల ప్రధాన డిమాండ్ వేతనాలను 30 శాతం మేర పెంచాలని. దీనిపై ఫెడరేషన్ ప్రతినిధులు ఇప్పటికే ఫిలిం ఛాంబర్‌తో చర్చలు జరిపారు.

అయితే చర్చలపై నిర్మాతలు సరిగ్గా స్పందించకపోవడంతో నిరసనగా బంద్ ప్రకటించారు. అయితే సినీ కార్మికుల వేతనాల పెంపు విషయంపై చిరంజీవితో నిర్మాతలు సమావేశమై చర్చలు కూడా జరిపారు. రోజుకో మలుపు తీసుకుంటున్న సినీ కార్మికుల వేతనాల పెంపు వివాదం ఎలా పరిష్కారం అవుతుందో అనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## రిజిస్టర్డ్ పోస్టు సేవ నిలిపివేత అంటూ వార్తలు..

న్యాయ, ప్రభుత్వ వ్యవహారాలకు కీలకంగా ఉన్న రిజిస్టర్డ్ పోస్టు సేవ నిలిచిపోయిందంటూ ఇటీవల ఓ వార్త సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతూ కలకలం రేపింది. వాస్తవం ఏంటో తెలియక నెటిజన్లు కొందరు ఆందోళన చెందారు. ఈ విషయమై నెట్టింట కలకలం రేగిన నేపథ్యంలో ఇండియా పోస్టు తాజాగా క్లారిటీ ఇచ్చింది. రిజిస్టర్డ్ పోస్టు సేవ రద్దు కాలేదని, స్పీడ్ పోస్టుతో విలీనం మాత్రమే అయ్యిందని క్లారిటీ ఇచ్చింది.

లేఖపై పేర్కొన్న వ్యక్తులకే పోస్టు డెలివరీ అయ్యేందుకు అనేక మంది రిజిస్టర్డ్ పోస్టును వినియోగిస్తారని తెలిసిందే. న్యాయపరమైన వ్యవహారాల్లో రిజిస్టర్డ్ పోస్టుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. అయితే, లేఖలు వేగంగా డెలివరీ చేసేందుకు స్పీడ్ పోస్టు సేవను ప్రారంభించారు. పోస్టుపై ఉన్న అడ్రస్ ఆధారంగా డెలివరీ జరుగుతుంది. రిజిస్టర్డ్ పోస్టు డెలివరీ మాత్రం వ్యక్తి పేరు ఆధారంగా జరుగుతుంది. రిజిస్టర్డ్ పోస్టు విషయంలో వ్యక్తి ఐడెండిటీ చాలా కీలకం. దీంతో, ఈ సేవ నిలిచిపోయిందన్న అపోహ జనాల్లో వ్యాపించడంతో కలకలం రేగింది.

ఈ అంశంపై ఇండియా పోస్టు స్పష్టతను ఇచ్చింది. రిజిస్టర్డ్ పోస్టు సేవను స్పీడు పోస్టులో విలీనం చేసినట్టు పేర్కొంది. దీంతో, ఈ రెండు సేవలూ ఒకే గొడుగు కిందకు వచ్చినట్టు అయ్యిందని పేర్కొంది. స్పీడ్ పోస్టులో భాగంగా రిజిస్టర్డ్ పోస్టు సేవ యథాతథంగా కొనసాగుతుందని తెలిపింది. మరింత సమర్థవంతంగా సరళతరంగా పోస్టల్ కార్యకలాపాలు తీర్చిదిద్దేందుకు ఈ విలీనం దోహదపడుతుందని పేర్కొంది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy